www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వైద్య కళాశాలలకు ప్రపంచ బ్యాంకు రుణం!

రూ. 1,000 కోట్లు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచన

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమయ్యే నిధులను రుణాల రూపంలో సమకూర్చుకోవాలని రాష్ట్ర సర్కారు భావిస్తోంది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నుంచి మరో రూ.1,000 కోట్ల రుణం తీసుకోవాలనుకుంటోంది. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తాజాగా వైద్య ఆరోగ్యశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేని దృష్ట్యా ఖజానాపై ఆధారపడితే వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేని పరిస్థితి. ఇటీవలే జాతీయ వైద్య కమిషన్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు వసతులు లేని కారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గత మూడేళ్లలో 25 కాలేజీలు ఏర్పాటు చేయగా వీటిలో మౌలిక సదుపాయాలు లేవు. వీటి కోసం కోట్ల రూపాయల అవసరం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయం తీసుకోవాలనుకుంటోంది. ఇప్పటికే వరల్డ్ బ్యాంక్ రూ.4,150 కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి అదనంగా మరో రూ.1,000 కోట్ల రుణాన్ని తీసుకోవాలనుకుంటున్నారు.

మంగళవారం | 1-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 93 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి ఉ.10:21 తదుపరి సప్తమి, నక్షత్రం: పుబ్బ ఉ.8:54 తదుపరి ఉత్తర, వర్జ్యం: సా.4:45-6:30, దుర్ముహూర్తం: ఉ.8:24-9:16, రా.10:25-11:07, అమృతఘడియలు: తె. 3:15-4:59, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:48, సూర్యాస్తమయం: 6:49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాల విభజన



18-21 నెలల్లో పూర్తి.. ఆ తర్వాతమార్కెట్లో లిస్టింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ హాస్పిటల్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్‌ఈఎల్) తన వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. ఇందులో భాగంగా అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాలను ఒక ప్రత్యేక కంపెనీగా విభజించి, ఆ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన సమావేశంలో అపోలో హాస్పిటల్స్, దాని అనుబంధ సంస్థ అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (ఏహెచ్ఎల్) డైరెక్టర్ల బోర్డులు ఇందుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపాయి. అయితే కొత్త కంపెనీ పేరును ఇంకా నిర్ణయించలేదు. ఈ విభజన, షేర్ల లిస్టింగ్ ప్రక్రియను 18 నుంచి 21 నెలల్లో పూర్తి చేయాలని ఏహెచ్‌ఈఎల్ భావిస్తోంది.ఈ విభజన ద్వారా ఏహెచ్‌ఈఎల్ ఈక్విటీలో 100 షేర్లు ఉన్న ప్రతి వాటాదారుకు.. కొత్తగా ఏర్పాటు చేసే ఫార్మసీ, డిజిటల్ హెల్త్ కంపెనీలో 195.2 షేర్లు లభిస్తాయి.

- తొలి దశలో ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్, అపోలో 24/7 డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్, రిమోట్ టెలిహెల్త్ వ్యాపారాలను ఏహెచ్‌ఈఎల్ నుంచి ప్రత్యేక కంపెనీగా విభజిస్తారు.
- రెండో దశలో అపోలో హెల్త్ కంపెనీని కొత్త కంపెనీలో విలీనం చేస్తారు.
- మూడో దశలో హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీలో విలీనం చేస్తారు.
- ఈ విభజనతో గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.16,300 కోట్లుగా ఉన్న ఫార్మసీ, డిజిటల్ హెల్త్ విభాగాల ఆదాయం 2027 మార్చి నాటికి రూ.25,000 కోట్లకు చేరుతుందని అంచనా.
- విభజనతో ఏర్పడే కొత్త కంపెనీ పూర్తి భారతీయుల యాజమాన్యం, నిర్వహణలో ఉన్న కంపెనీ (ఐఓసీసీ) అవుతుంది.
- ఈ కొత్త కంపెనీకి అపోలో గ్రూప్ నిర్వహణలోని ఫ్రంట్ ఎండ్ ఫార్మా కంపెనీ అయిన అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ (ఏపీఎల్) ఈక్విటీలో 100 శాతం వాటా ఉండనుంది.
- ఏహెచ్‌ఈఎల్‌కు కొత్త కంపెనీ ఈక్విటీలో 15 శాతం వాటా.
- కొత్తగా ఏర్పడే కంపెనీ బోర్డులోనూ ఏహెచ్‌ఈఎల్‌కు ఒక నామినీ డైరెక్టర్ పోస్టు.
- వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదం లభించిన తర్వాత కొత్త కంపెనీకి ఫ్రంట్ ఎండ్ ఫార్మా బిజినెస్ కంపెనీ అపోలో మెడికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలోనూ 74.5 శాతం వాటా.
- అపోలో హెల్త్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని.. కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీకీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.
- ఏహెచ్‌ఈఎల్ ప్రమోటర్లు అందరూ కొత్త కంపెనీ బోర్డులో సభ్యులుగా ఉంటారు.

విభజన ప్రక్రియ ప్రధానాంశాలు

"రేపటి డిజిటల్ తరం కోసం ముందుచూపుతో ఈ కొత్త కంపెనీని ఏర్పాటు చేస్తున్నాం.
- ప్రతాప్ సి రెడ్డి, చైర్మన్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్

అపోలో హాస్పిటల్స్ ఆరోగ్య సేవలు అందించడం పైన దృష్టి పెడుతుంది. కొత్తగా ఏర్పడే కంపెనీ కస్టమర్లతో సంబంధాలు, వ్యాప్తిపై దృష్టి పెడుతుంది. రెండు కంపెనీలకు నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికలు, నిర్వహణ విషయాలు వేరు వేరుగా ఉంటాయి."
- సునీతా రెడ్డి, ఎండీ, ఏహెచ్‌ఈఎల్.

హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీలోకి బీఈ

చైనా కంపెనీ రెక్‌బయోతో భాగస్వామ్య ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రజలను హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి కాపాడేందుకు హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీ కోసం చైనా బయోఫార్మాస్యూటికల్ కంపెనీ రెక్‌బయో టెక్నాలజీతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బయోలాజికల్-ఈ (బీఈ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బీఈతో లైసెన్సింగ్ సహకార ఒప్పందం కుదిరినట్టు జియాంగ్సు రెక్‌బయో టెక్నాలజీ కంపెనీ వెల్లడించింది. ఈ ఒప్పందానికి అనుగుణంగా బీఈకి తాము రీ కాంబినెంట్ 9-వాలెంట్ హెచ్‌పీవీ (హెచ్‌పీవీ 9) వ్యాక్సిన్ టెక్నాలజీ బదిలీని ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. అలాగే ఆ వ్యాక్సిన్ తయారీకి అవసరమైన ముడి పదార్థాన్ని (డీఎస్) కూడా రెక్‌బయో అందిస్తుంది. టెక్నాలజీ బదిలీ పూర్తి కాగానే భారీ పరిమాణంలో హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ తయారీని బీఈ ప్రారంభిస్తుంది. వ్యాక్సిన్‌కు సంబంధించిన క్లినికల్ డెవలప్‌మెంట్, రెగ్యులేటరీ అనుమతుల విషయంలో బీఈకి అవసరమైన మద్దతును అందించనున్నట్టు రెక్‌బయో తెలిపింది. ఇదిలా ఉండగా ఆ వ్యాక్సిన్ తమ ప్లాంట్‌లో తయారుచేసి, దేశంలో వాణిజ్యపరంగా విడుదల చేయడంతో పాటు యునిసెఫ్, పీఏహెచ్‌ఓ టెండర్లలో పాల్గొనే అవకాశం బీఈకి ఈ ఒప్పందం ద్వారా లభిస్తుంది. సర్వైకల్, వుల్వా, వెజైనల్, ఆనల్, ఓరోఫరింజియల్ క్యాన్సర్లు సహా 9 రకాల క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) చికిత్స కోసం జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి తయారుచేసే (రీకాంబినెంట్) వ్యాక్సిన్ ఇది. 9-45 సంవత్సరాల మధ్య వయస్కుల్లో వినియోగించే మరో కీలక ఉత్పత్తి ఆర్‌ఈసీ 603పై ప్రస్తుతం చైనాలో మూడో దశ క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి.

చిన్న మొత్తాల పొదుపు వడ్డీరేట్లు యథాతథం

న్యూఢిల్లీ: పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ సహా వివిధ చిన్న తరహా పొదుపు మొత్తాలపై వడ్డీ రేట్లను వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి యథాతథంగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అంటే చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీ రేట్లను ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా ఉంచడం వరుసగా ఇది ఆరోసారి. అంటే సెప్టెంబరు చివరి వరకు చిన్న మొత్తాల పొదుపుపై చెల్లించే వడ్డీ ప్రస్తుత స్థాయిలోనే కొనసాగుతుంది.

శాట్‌ష్యూర్‌తో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న శాట్‌ష్యూర్ కంపెనీ అంతరిక్ష టెక్నాలజీ స్టార్టప్ అయిన ధ్రువ స్పేస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ఉభయ సంస్థలు నానాటికీ విస్తరిస్తున్న అంతరిక్ష అబ్జర్వేషన్ సామర్థ్యాలకు మద్దతు ఇచ్చే వన్ స్టాప్ షాప్‌ను అందుబాటులోకి తెస్తాయి. చిన్న ఉపగ్రహ వ్యవస్థలు, అందుకు అవసరమైన కీలక సహాయ వ్యవస్థల ఇంటిగ్రేషన్‌లో ధ్రువ స్పేస్‌కు గల నైపుణ్యాలను శాట్‌ష్యూర్ అనుబంధ సంస్థ కలైడియో అనలిటికల్ సొల్యూషన్స్‌తో అనుసంధానం చేసే అవకాశం ఈ ఒప్పందం ద్వారా లభిస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	590
వరంగల్	572	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	90
వరంగల్	90	గుంటూరు	95
కరీంనగర్	90	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	88
కర్నూలు	90	నెల్లూరు	93
విశాఖపట్నం	79	అనంతపురం	93
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,260 ▼	89,150 ▼	1,17,700 ▼
విజయవాడ	99,000 ▲	93,000 ▲	1,08,500 ▼
విశాఖపట్నం	99,060 ▲	89,150 ▼	1,17,700 ▼
రాజమండ్రి	97,250 ▼	89,150 ▼	1,09,900 ▲
ప్రొద్దుటూరు	96,500 ▲	88,780 ▲	1,07,000 ▲
ముంబై	95,886 ▲	87,832 ▲	1,05,510 ▲

జీఎస్‌టీ వసూళ్లు ఐదేళ్లలో రెట్టింపు

గత ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయింది. కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం జీఎస్‌టీ వార్షిక వసూళ్లు గడిచిన ఐదేళ్లలో రెట్టింపయ్యాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.11.37 లక్షల కోట్లుగా నమోదుకాగా.. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగాయి. మరిన్ని విషయాలు..

జీఎస్‌టీ వసూళ్లు

ఆర్థిక సంవత్సరం	రూ.లక్షల కోట్లు
2024-25	22.08
2023-24	20.18
2022-23	18.08
2021-22	14.83
202021	11.37



- 2024-25లో జీఎస్‌టీ ఆదాయం అంతక్రితం ఆర్థిక సంవత్సరం(2023-24)తో పోలిస్తే 9.4 శాతం వృద్ధి చెందాయి.
- 2020-21 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ వసూళ్ల సగటు రూ.95,000 కోట్లుగా నమోదుకాగా.. 2021-22లో రూ.1.51 లక్షల కోట్లకు, రూ. 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు, 2024-25లో రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి.
- జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్)లో నమోదు చేసుకున్న వ్యాపారులు (పన్ను చెల్లింపుదారులు) గడిచిన 8 ఏళ్లలో రెట్టింపునకు పైగా పెరిగారు. 2017లో వీరి సంఖ్య 65 లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 1.51 కోట్లు దాటింది.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు చేరాయి. 2025 మే నెలలో రూ.2.01 లక్షల కోట్లుగా నమోదు కాగా.. జూన్ గణాంకాలు మంగళవారం విడుదల కానున్నాయి.
- దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎస్‌టీ చట్టం 2017 జూలై 1న అమలులోకి వచ్చింది.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 452 పాయింట్లు పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బ్యాంకింగ్‌తో పాటు ఇతర షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో ప్రామాణిక సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 576.77 పాయింట్లు పతనమై 83,482.13 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 120.75 పాయింట్లు కోల్పోయి 25,517.05 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టాలు చవిచూడగా.. యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా క్షీణించాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.81 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, బ్యాంకింగ్ అర శాతానికి పైగా నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్ సూచీలు మాత్రం ఒక శాతానికి పైగా పెరిగాయి.

సిగాచీ షేరు 11.50 శాతం డౌన్

తెలంగాణకు చెందిన ఫార్మా కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు పాశమైలారంలో ఉన్న ప్లాంటులో భారీ పేలుడు సంభవించడంతో కనీసం 12 మంది సిబ్బంది మరణించడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. అంతేకాదు, పలు పరికరాలు, మౌలిక వసతులు కూడా ధ్వంసమవడంతో ప్లాంట్‌ను 90 రోజుల పాటు మూసివేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిగాచీ షేరు ఒక దశలో 14.82 శాతం వరకు పతనమైంది. చివరికి 11.58 శాతం నష్టంతో రూ.48.79 వద్ద ముగిసింది.

ఏఎం గ్రీన్ చేతికి ఓరిక్స్ కార్ప్ వాటా

- గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో 17.5% వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ.11,000 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్ కంపెనీలో జపాన్‌కు చెందిన ఆర్థిక సర్వీసుల కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్‌కు గల 17.5% వాటాను ఏఎం గ్రీన్ బీవీ కొనుగోలు చేయనుంది. ఈ డీల్ విలువ 128 కోట్ల డాలర్లు (రూ.11,000 కోట్లు). గ్రీన్‌కో వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఇద్దరి యాజమాన్యంలోని సంస్థ ఏఎం గ్రీన్‌కు ఈ లావాదేవీ అనంతరం గ్రీన్‌కోలో 25% వాటాలుంటాయి. గ్రీన్‌కోలో తనకు గల 20% వాటాలో 17.5% వాటాను ఏఎం గ్రీన్ పవర్ బీవీకి బదిలీ చేయడంతో పాటు దాని మాతృసంస్థ ఏఎం గ్రీన్ (లగ్జెంబర్గ్), సరళ్ (ఏఎంజీ లక్స్) జారీ చేసే కన్వర్టిబుల్ నోట్లలో 73.1 కోట్ల డాలర్లు (రూ.6,286.6 కోట్లు) ఓరిక్స్ కార్పొరేషన్ ఇన్వెస్ట్ చేస్తుంది. గ్రీన్‌కో దేశంలో పునరుత్పాదక ఇంధన కంపెనీలను కలిగి ఉండడంతో పాటు 10 గిగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం కూడా కలిగి ఉంది. 2021 నుంచి గ్రీన్‌కో వ్యాపార వృద్ధికి ఓరిక్స్ మద్దతు ఇస్తోంది.

స్పోర్ట్స్

మెద్వెదెవ్ అవుట్



- రూన్ కూడా ఇంటిబాట
- ఐదు సెట్లు పోరాడి గెలిచిన అల్కారజ్
- సబలెంకా, రదుకాను, కీస్ బోణీ



లండన్: వింబుల్డన్ తొలిరోజే సంచలనాలు చోటు చేసుకున్నాయి. ఎనిమిదో సీడ్ హోల్గర్ రూన్, తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు మొదటి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఇక..మూడో టైటిల్ వేటలో ఉన్న అల్కారజ్ ఆరంభ మ్యాచ్‌లో ఐదు సెట్లు పోరాడాల్సి వచ్చింది. మహిళల టాప్ సీడ్ సబలెంకా, లోకల్ ఫేవరెట్ ఎమ్మా రదుకాను శుభారంభం చేయగా, ఆరో సీడ్ మాడిసన్ కీస్ మూడు సెట్లు శ్రమించాల్సి వచ్చింది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో చిలీకి చెందిన క్వాలిఫయర్ నికొలాస్ జారీ ఐదు సెట్ల పోరాటంలో 4-6, 4-6, 7-5, 6-3, 6-4తో రూన్‌ను చిత్తు చేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన 64వ ర్యాంకర్ బెంజమిన్ బోంజి 7-6 (2), 3-6, 7-6 (3), 6-2తో 2021 యూఎస్ ఓపెన్ విజేత మెద్వెదెవ్ (రష్యా)పై సంచలన విజయం సాధించాడు. ఇటీవల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మెద్వెదెవ్ ఆరంభ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఇక.. 20వ సీడ్ పాపిరిన్ 4-6, 1-6, 6-4, 4-6తో ఆర్థర్ ఫెర్రీ చేతిలో ఓటమి పాలయ్యాడు. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్‌కు ఇటలీ ఆటగాడు ఫాబియో ఫోనిని గట్టి ప్రతిఘటన ఇచ్చాడు. దాంతో అల్కారజ్ 7-5, 6-7 (7), 7-5, 2-6, 6-1తో గట్టెక్కాడు. 12వ సీడ్ టియఫో 6-3, 6-4, 6-2తో మోలెర్‌ని ఓడించి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో సబలెంకా 6-1, 7-5తో బ్రాన్‌స్టిన్‌పై సులువుగా నెగ్గగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్ 6-7 (7), 7-5, 7-5తో గాబ్రియెలాపై పోరాడి గెలిచింది. బ్రిటన్ నెంబర్‌వన్ క్రీడాకారిణి రదుకాను 6-3, 6-3తో తన దేశానికే చెందిన మింగ్ గ్జూపై, 12వ సీడ్ ష్నీడెర్ 7-6 (5), 6-3తో మొయూకాపై, 14వ సీడ్ స్విటోలినా 6-3, 6-1తో అనా బోండర్‌పై విజయాలతో రెండో రౌండ్ చేరారు. 20వ సీడ్ ఒస్టాపెంకోకు 7-5, 2-6, 6-2తో అన్‌సీడెడ్ సోనె కర్తాల్ షాకిచ్చింది. రెండుసార్లు వింబుల్డన్ రన్నరప్ ఆన్స్ జెబ్యూర్, 24వ సీడ్ సిట్సిపాస్ గాయాలతో తొలి రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలిగారు.



స్టార్ కళ..

ఇంగ్లండ్ ఫుట్‌బాల్ మాజీ సూపర్ స్టార్ డేవిడ్ బెక్‌హామ్, టెన్నిస్ అందాల తార మరియా షరపోవా రాకతో వింబుల్డన్ తొలి రోజు పోటీలు స్టార్ కళను సంతరించుకున్నాయి. 2004లో 17 ఏళ్ల వయస్సులోనే వింబుల్డన్ విజేతగా నిలిచిన షరపోవా.. బెక్‌హామ్‌తో దిగిన సెల్ఫీని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

బాబోయ్.. ఎండలు



వింబుల్డన్ తొలిరోజే ఎండ మండింది. ఉదయం 11 గంటలకే సూర్యుడు 28 డిగ్రీల సెల్సియస్‌తో చుర్రు మనిపించాడు. దాంతో ఆటగాళ్లతోపాటు ప్రేక్షకులు ఇబ్బందిపడ్డారు. 2001 తర్వాత టోర్నీ మొదటి రోజు ఇంత ఎండ ఉండడం ఇదే తొలి సారట! 'మొదటి రోజంతా ఎక్కడ నీడ ఉంటే అక్కడకు వెళ్లి కూర్చున్నా' అని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ సీఈవో సాలీ బోల్టన్ చెప్పాడు.

ట్రేడ్‌మార్క్‌గా 'కెప్టెన్ కూల్'



రిజిస్టర్ చేసిన ధోనీ

న్యూఢిల్లీ: 'కెప్టెన్ కూల్' అంటే క్రికెట్ అభిమానులకు వెంటనే స్ఫురించే పేరు ధోనీ. మైదానంలో ఎంతో ఒత్తిడి ఉన్నా.. ప్రశాంతంగా తనదైన వ్యూహాలను అమలు చేయడం ధోనీ స్టైల్. ఇప్పుడు ఆ 'కెప్టెన్ కూల్'నే మహీ ట్రేడ్ మార్క్‌గా మార్చాడు. క్రీడలకు సంబంధించి ట్రైనింగ్, ఇతరత్రా సౌకర్యాల కింద 'కెప్టెన్ కూల్' పేరును రిజిస్టర్ చేశాడు. ఈ నెల 5న ఇందు కోసం దరఖాస్తు చేసుకోగా.. వెంటనే ఆమోదించారు. ఈ నెల 16న ట్రేడ్ మార్క్ జర్నల్‌లో పబ్లిష్ కావడం విశేషం. అయితే, ప్రభా స్కిల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంతకంటే ముందే 'కెప్టెన్ కూల్' టైటిల్ కోసం దరఖాస్తు చేసినా.. మార్చుకోవాలని సూచించినట్టు సమాచారం.

పాక్ టెస్ట్ జట్టు కోచ్‌గా అజర్ మహమూద్

లాహోర్: మాజీ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ పాకిస్థాన్ టెస్ట్ జట్టు కోచ్‌గా పదోన్నతి పొందాడు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అతడి పదవీకాలం ముగిసే వరకు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తాడని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం తెలిపింది. అన్ని ఫార్మాట్ల జట్లకు సహాయ కోచ్‌గా అజర్ గత ఏప్రిల్‌లో నియమితుడయ్యాడు. అప్పట్లో గిలెస్పీ (టెస్టులు), కిర్‌స్టెన్ (పరిమిత ఓవర్లు)లను కోచ్‌లుగా నియమించింది. అయితే కొద్దికాలానికే వారిద్దరూ వైదొలిగారు. అజర్ 21 టెస్టులు, 143 వన్డేలు ఆడాడు.

పసిడికి పంచ్ దూరంలో..



ఫైనల్స్‌కు నిఖత్, లవ్లీనా ● నిహారిక, యషిలకు నిరాశ

హైదరాబాద్: జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఇక్కడి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన 51 కిలోల విభాగం సెమీ ఫైనల్లో నిఖత్ 5-0తో లక్ష్యను చిత్తుచేసి జ్యోతితో తుదిపోరుకు సిద్ధమైంది. 75 కిలోల కేటగిరి సెమీస్‌లో స్నేహను ఓడించిన లవ్లీనా.. ఫైనల్లో లషు యాదవ్‌తో తలపడనుంది. తెలంగాణకు చెందిన మరో ఇద్దరు బాక్సర్లు యషి శర్మ (65 కి), నిహారిక గోనెళ్ల (60 కి) సెమీఫైనల్స్‌లో ఓటమి పాలయ్యారు. నిహారికపై ప్రాచి, యషి శర్మపై శశి గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు.

చాంపియన్ ఆయుష్

మహిళల రన్నరప్ తన్వీ ● యూఎస్ ఓపెన్



లోవా (యూఎస్): భారత యువ షట్లర్ ఆయుష్ షెట్టి యూఎస్ ఓపెన్ టైటిల్‌తో అదరగొట్టాడు. మహిళల్లో16 ఏళ్ల టీనేజర్ తన్వీ శర్మ రన్నరప్‌గా సరిపెట్టుకొంది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఆయుష్ 21-18, 21-13తో మూడో సీడ్ బ్రియాన్ యాంగ్ (కెనడా)పై వరుస గేముల్లో నెగ్గాడు. ఈ క్రమంలో కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. కాగా, మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో తన్వీ 11-21, 21-16, 10-21తో టాప్ సీడ్ బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.

బరిలోకి హర్మన్‌ప్రీత్!

నేడు ఇంగ్లండ్‌తో భారత్ రెండో టీ20
రాత్రి 11 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..



బ్రిస్టల్: ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను అదిరే విజయంతో ఆరంభించిన భారత మహిళల జట్టు నేడు (మంగళవారం) రెండో టీ20 ఆడనుంది. తొలి మ్యాచ్‌కి విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ రెండో టీ20కి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత పటిష్ఠం కానుంది. ఓపెనర్ స్మృతి మంధాన కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడంతో నాటింగ్‌హామ్ మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల తేడాతో నెగ్గింది. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ సత్తా నిరూపించుకుంది. మిడిలార్డర్‌లో జెమీమా, రిచా ఘోష్ నిలకడ చూపాల్సి ఉంది. ఓపెనర్ షఫాలీ సహజశైలిని అందుకుంటే ఇంగ్లండ్‌కు మరోసారి కష్టాలు తప్పవు. ఇక ప్రధాన బౌలర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ లేకపోయినా బౌలింగ్ విభాగం అదరగొట్టింది. ముఖ్యంగా అరంగేట్రంలోనే తెలుగమ్మాయి శ్రీచరణి నాలుగు వికెట్లతో ఇంగ్లండ్‌ను వణికించింది. వెటరన్ స్పిన్నర్లు రాధా యాదవ్, దీప్తి శర్మ సైతం ప్రభావం చూపారు. కానీ ఆతిథ్య ఇంగ్లండ్ బౌలర్లు, బ్యాటర్లు మాత్రం ప్రభావం చూపలేదు. బ్యాటింగ్‌లో నాట్ సీవర్ మాత్రమే క్రీజులో నిలిచినా తనకు సహకారమే కరువైంది. నేటి మ్యాచ్‌లో మాత్రం ఇంగ్లండ్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చి సిరీస్‌లో సమవుజ్జీగా నిలువాలనుకుంటోంది.

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో

కోహ్లీ అన్న కొడుకు, సెహ్వాగ్ కుమారులు

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో ఇద్దరు ప్రముఖ క్రికెటర్ల బంధువులు బరిలో నిలిచారు. వారిలో ఒకరు విరాట్ కోహ్లీ అన్న కుమారుడు ఆర్యవీర్ కోహ్లీ (15)కాగా, మరొకరు టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయులు ఆర్యవీర్ సెహ్వాగ్ (17), వేదాంత్ సెహ్వాగ్ (15). విరాట్ అన్న వికాస్ కోహ్లీ తనయుడే ఆర్యవీర్ కోహ్లీ. లెగ్‌స్పిన్నర్ అయిన ఆర్యవీర్..విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ వద్ద శిక్షణ పొందుతున్నాడు. గత సీజన్‌లో ఢిల్లీ అండర్-16 జట్టులో పేరు నమోదు చేసుకున్న ఆర్యవీర్ డీపీఎల్ వేలంలో గ్రేడ్-సి విభాగంలో పోటీపడుతున్నాడు. ఇక..ఢిల్లీ అండర్-19 జట్టుకు ఆడుతున్న ఆర్యవీర్ సెహ్వాగ్ వేలంలో గ్రూప్-బిలో బరిలోకి దిగుతున్నాడు. అలాగే ఢిల్లీ అండర్-16కి ఆడుతున్న ఆఫ్ స్పిన్నర్ వేదాంత్ సెహ్వాగ్ కూడా గ్రూప్-బిలో పోటీపడుతున్నాడు. జూలై ఐదున వేలం జరగనుంది. గత ఏడాది డీపీఎల్ తొలి సీజన్ జరిగింది.

ముల్డర్ శతకం

- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 369
- జింబాబ్వే లక్ష్యం 537

బులవాయో: జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో వరల్డ్ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది. వియాన్ ముల్డర్ (147) శతకం సాధించగా, కెప్టెన్ కేశవ్ మహరాజ్ (51) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు సాధించింది. అలాగే జింబాబ్వే ముందు 537 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఉంచింది. మసకద్జాకు నాలుగు.. చివంగ, మసెకెసాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే సోమవారం ఆట ముగిసే సమయానికి 32/1 స్కోరుతో ఉంది.

మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి

రోజుకు రూ. 600 కూలి నుంచి..



వరుణ్ చక్రవర్తి.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మిస్టరీ స్పిన్నర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాడు. ఐపీఎల్‌లో మెరిసిన 33 ఏళ్ల వరుణ్.. టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, వరుణ్ గతం మాత్రం ఎంతో విచిత్రం. గిటారిస్ట్, ఫిల్మ్‌మేకర్, ఆర్కిటెక్చర్‌గా పలు వృత్తుల్లో ప్రయత్నించిన చక్రవర్తి.. ఆఖరికి క్రికెటర్‌గా సెటిలయ్యాడు. ఒకప్పుడు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా రోజుకు రూ. 600 కూలీకి పని చేసిన వరుణ్, ఇప్పుడు ఐపీఎల్ వేలంలో రూ. 12 కోట్లు పలికి కోటీశ్వరుడయ్యాడు. ఇలా.. తన జీవితంలో నమ్మశక్యం కాని ఆసక్తికర విషయాలను అశ్విన్ యూట్యూబ్ చానెల్‌లో వరుణ్ పంచుకొన్నాడు. ఇంజినీరింగ్ తర్వాత రూ. 14 వేల జీతానికి ఆర్కిటెక్చర్ కంపెనీలో చేరినట్టు తెలిపాడు. తర్వాత క్రికెట్ టీమ్‌తో తమిళంలో నిర్మించిన 'జీవా' సినిమాలో నటించినట్టు చెప్పాడు. అంతేకాదు.. తమిళ నటుడు విజయ్‌కు తాను వీరాభిమానినని తెలిపాడు. కెరీర్ ముగిసిన తర్వాత విజయ్‌తో సినిమాను డైరెక్ట్ చేయాలనుకొంటున్నట్టు చెప్పాడు.

ఇంగ్లండ్‌దే రెండో వన్డే

వికెట్ తేడాతో భారత యువ జట్టు ఓటమి

నార్తాంప్టన్: భారత్ అండర్-19 జట్టుతో ఉత్కంఠ భరితంగా సాగిన రెండో యూత్ వన్డేలో ఇంగ్లండ్ ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వికెట్ తేడాతో నెగ్గిన ఆతిథ్య జట్టు.. ఐదు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత కుర్రాళ్లు 49 ఓవర్లలో 290 పరుగులు సాధించారు. విహాన్ (49), రాహుల్ (47), వైభవ్ (45), కనిష్క్ (45), అభిగ్యాన్ (32) రాణించారు. ఫ్రెంచ్‌కు నాలుగు.. గ్రీన్, హోమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ అండర్-19 జట్టు 49.3 ఓవర్లలో 291/9 స్కోరు చేసింది. ఓ దశలో 47/3 స్కోరుతో తడబడినా.. కెప్టెన్ థామస్ రూ (131) అద్భుత సెంచరీతో జట్టును విజయం వైపు నడిపించాడు. చివర్లో వేగంగా వికెట్లు కోల్పోయినా ఆఖరి ఓవర్‌లో ఆరు పరుగులను తొలి మూడు బంతుల్లోనే సాధించి భారత్‌కు ఝలక్ ఇచ్చింది. రాకీ (39), సెబాస్టియన్ (20 బ్యాటింగ్) ఆకట్టుకున్నారు. పేసర్లు అంబరీష్‌కు నాలుగు.. హెనిల్ పటేల్, యుధజిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 1-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) :93

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

ఇంజనీరింగ్‌కు పాత ఫీజులే!

ఎంబీఏ, ఫార్మసీ, ఇతర వృత్తి విద్య కోర్సులకూ నిరుటి ఫీజులే కొనసాగింపు

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా

కళాశాలల ఫీజు పెంపు ప్రతిపాదనలు

పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఇతర రాష్ట్రాల విధానాలపైనా అధ్యయనం

2



రసాయన పరిశ్రమలో పేలుడు..

20 మంది దుర్మరణం

మరో 14 మంది కార్మికులు గల్లంతు

కాలిన తీవ్ర గాయాలతో 30 మంది ఆస్పత్రిలో..

వారిలో 16 మంది పరిస్థితి విషమం

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో ఘోరం



పరిశ్రమలో పేలుడుతో ఎగిసిపడుతున్న మంటలు



తీవ్రంగా కాలిన గాయాలతో అంబులెన్స్‌లో కార్మికులు

డ్రయ్యర్ పేలడంతో ఎగిసిన అగ్నికీలలు.. 2 కిలోమీటర్ల మేర కంపించిన భూమి

కుప్పకూలిన పరిశ్రమ గెస్ట్ హౌస్.. అందులో ఉన్న జనరల్ మేనేజర్ మృతి

పేలుడు సమయంలో విధుల్లో 155 మంది.. ముద్దలుగా మృతదేహాలు

డీఎన్ఏ పరీక్షలకు చర్యలు.. రంగంలోకి దిగిన హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు

మృతులు, క్షతగాత్రులు బిహార్, ఒడిసా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాసులు

ఘటనాస్థలిని సందర్శించిన మంత్రులు దామోదర, వివేక్, మాజీ మంత్రి హరీశ్

సీఎస్ నేతృత్వంలో విచారణ కమిటీ.. ఘటనపై సీఎం దిగ్భ్రాంతి.. నేడు సందర్శన

సంగారెడ్డి ప్రతినిధి/రామచంద్రాపురం టౌన్/మియాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సిగాచి రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, 20 మంది దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి, ముద్దలుగా కనిపించాయి. అగ్నికీలలు, పేలుడు ధాటికి పక్కనే ఉన్న భవనం కూలిపోవడం, పార్క్ చేసిన వాహనాలకు నిప్పంటుకోవడంతో.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇంకో 14 మంది కార్మికులు గల్లంతైనట్లు సమాచారం. రాత్రి కడపటి వార్తలందే సరికి కూడా పరిశ్రమలో శిథిలాల వెలికితీత కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక

మిగతా 11వ పేజీలో...



హైదరాబాద్‌లో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో రాంచందర్‌రావు

కమల దళపతి

రాంచందర్‌రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

నూతన సారథిగా నేడు అధికారిక ప్రకటన

కార్యకర్త నుంచి పార్టీ అధ్యక్షుడి దాకా..

4 దశాబ్దాల్లో అంచెలంచెలుగా ప్రస్థానం

విద్యార్థి నేతగా రాడికల్స్‌తో పోరు

నక్సల్స్ దాడితో 2 నెలలు మంచంపైనే..

1986 నుంచి అడ్వకేట్‌గా సేవలు

కార్పొరేటర్‌గా తొలిసారి పోటీ..

2015లో ఎమ్మెల్సీగా ఎన్నిక

రాష్ట్రంలో అధికార పీఠమే లక్ష్యం!

స్థానిక సంస్థల ఎన్నికలే తొలి టార్గెట్

'ఆంధ్రజ్యోతి'తో ఎన్.రాంచందర్‌రావు

మేం అధికారంలోకి వస్తే బీసీనే సీఎం

కేంద్ర మంత్రి బండి సంజయ్

12

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడి ఎన్నిక విషయంలో ఉత్కంఠకు తెరపడింది. పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రాంచందర్ రావు రాష్ట్ర పార్టీ నూతన సారథిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధ్యక్ష పదవికి సోమవారం ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు

మిగతా 12వ పేజీలో...

బీజేపీకి రాజాసింగ్ వీడ్కోలు

పార్టీ సభ్యత్వానికి రాజీనామా

ఏపీ బీజేపీ కొత్త అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

సార్క్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త గ్రూప్?

దక్షిణాసియా దేశాలతో చైనా, పాక్, బంగ్లాదేశ్ మంతనాలు

భారత్‌కు కౌంటర్‌గా ఏర్పాటు యత్నాలు

2



నేటి నుంచే తత్కాల్‌కు ఆధార్ లింక్

2

సర్క్యులర్ జారీ చేసిన రైల్వే శాఖ

నేటి నుంచి అమల్లోకి రైలు చార్జీల పెంపు

ఏసీ- కి.మీ.కి 2 పైసలు.. నాన్ ఏసీ-1 పైసా

వివాహితపై ఆర్ఎంపీ ఘాతుకం

ఆమె రెండు చేతులకూ గడ్డి మందు ఇంజెక్షన్ చేసి లైంగికదాడి

2

అపస్మారక స్థితికి చేరుకున్న బాధితురాలు

గస్తీ పోలీసుల రాకతో నిందితుడు పరార్

నల్లగొండ జిల్లా గుర్రంపోడులో దారుణం

చికిత్స పొందుతూ బాధితురాలి మృతి

నాలుగు రోజుల్లో శ్రీశైలం గేట్లు ఓపెన్!

ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కులు

జల విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభం

12

మనకూ బంకర్ బస్టర్ బాంబులు

2

అమెరికా తరహాలో అభివృద్ధిపై భారత్ దృష్టి

7,500 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లేలా అగ్ని-5లో మార్పులు

హిందుస్థాన్ ధాన్యం టెండర్ లాట్ రద్దు



పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వు

2022-23 రబీ సీజన్ వేలంలో కేటాయింపు

దాని బదులు సన్న బియ్యం ఇస్తామన్న మిల్లర్లు

తనకు అభ్యంతరం లేదన్న హిందుస్థాన్

80,872 మెట్రిక్ టన్నులు మిల్లింగ్ చేసి, సన్నబియ్యం ఇవ్వడానికి మిల్లర్లకు అనుమతి

ఈఎండీ వెనక్కిస్తారా!? జప్తు చేస్తారా!?

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో భాగంగా 2022-23 రబీ సీజన్లో హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఇచ్చిన ధాన్యం టెండర్ లాట్ (నంబరు 12)ను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ రద్దు చేశారు. ఈ మేరకు మే 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో లాట్ నంబరు 12కు బదులుగా 25 శాతం నూకలతో కూడిన ఫోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని సరఫరా చేయడానికి తమను అనుమతించాలంటూ ఐదు జిల్లాల రైస్ మిల్లర్లు ఇప్పుడు కోరారని, వారి నుంచి పౌర సరఫరాల శాఖ సన్న బియ్యాన్ని సేకరిస్తే తనకు ఎటువంటి అభ్యంతరం లేదని హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ స్పష్టం చేసిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజానికి, యాసంగి (2022- 23) ధాన్యం టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న హిందుస్థాన్

మిగతా 12వ పేజీలో...



బనకచర్లకు బ్రేక్!

ప్రాజెక్టు పర్యావరణ అనుమతికి విధి విధానాలు జారీ చేయలేం

అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున టీవోఆర్ నిర్ణయించలేం

గోదావరి ట్రిబ్యునల్ నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులొచ్చాయి

వరద జలాల లభ్యతపై సమగ్రంగా అంచనా వేయాల్సి ఉంటుంది

ఇందుకు సీడబ్ల్యూసీని సంప్రదించండి.. ఆమోదం తర్వాతే రండి

ఏపీ సర్కారుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ స్పష్టీకరణ.. ప్రతిపాదన వెనక్కి

ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి ఇవ్వరాదంటూ కేంద్రానికి గతంలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ లేఖలు, వినతిపత్రం

న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది! దీనికి పర్యావరణ అనుమతి కోసం అవసరమైన విధివిధానాలు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) జారీ చేసేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) నిరాకరించింది. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలా!? వద్దా!? అనే విషయమై కేంద్ర జల సంఘమే (సీడబ్ల్యూసీ) తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున ప్రాజెక్టు అంచనాకు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) నిర్ణయించలేమని చెబుతూ ప్రతిపాదనను వెనక్కి పంపింది. బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి తీసుకోవడానికి వీలుగా టీవోఆర్ జారీ చేయాలని కోరుతూ జూన్ 5న ఏపీ దరఖాస్తు పెట్టుకోగా.. దీనిపై జూన్ 17న ఈఏసీ (రివర్ వ్యాలీ, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్స్) చైర్మన్ జి.జె.చక్రపాణి అధ్యక్షతన సమావేశం

మిగతా 9వ పేజీలో...

క్యాబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం

9

గుర్తించిన ప్రభుత్వం.. జస్టిస్ ఘోష్ కమిషన్‌కు లేఖ సిద్ధం

అన్ని వివరాలతో నేడు సీల్డ్ కవర్‌లో సమర్పణ!

మొబైల్ అంగన్‌వాడీలు

మురికివాడలు, వలస కార్మికులుండే ప్రాంతాల్లో ఏర్పాటు

అక్కడి పిల్లలకు నిర్దేశిత సమయంలో పౌష్టికాహారం

తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికే రోల్‌మోడల్ కావాలి

పౌష్టికాహారం, బోధనలో అగ్రగామిలా ఉండేలా కార్యాచరణ

భవనాల నిర్మాణంలో అధునాతన సాంకేతికత వినియోగం

పిల్లలు పట్టించుకోని వృద్ధులకు అండగా నిలవాలి

వారి వేతనాల నుంచి తల్లిదండ్రులకు వాటా జమ చేయాలి

రవాణాతోపాటు ఇతర శాఖల్లోనూ ట్రాన్స్‌జెండర్ల సేవలు

దివ్యాంగులకు మరింత అండగా రాష్ట్ర ప్రభుత్వం

సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

9



మహిళా శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రిత్వ శాఖలపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొన్నం, సీతక్క, లక్ష్మణ్, అధికారులు



వానాకాలం పంటలకు బీమా లేనట్లే!

టెండర్లు పిలవని ప్రభుత్వం.. ఆర్థిక సమస్యలే కారణం!

ప్రకృతి విపత్తుల్లో తక్షణ సాయం.. ఎకరానికి రూ.10 వేలు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వానాకాలం పంటల సాగు మొదలై నెల రోజులు గడిచిపోయాయి. అయినా పంటల బీమా పథకానికి ప్రభుత్వం టెండర్లు పిలవలేదు. అంటే ఈసారికి పంటల బీమా ఉండదని తేటతెల్లమైంది. ఈ సీజన్‌కు పంటల బీమా పథకాన్ని అమలు చేయడంలేదు. గత బడ్జెట్‌లో రూ.1,300 కోట్ల కేటాయింపులు చేసినప్పటికీ ఇప్పుడున్న ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఇంత భారీ మొత్తాన్ని పంటల బీమాకు కేటాయించే పరిస్థితి లేదనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఒకవేళ ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఎప్పటికప్పుడు పంట నష్టాన్ని

మిగతా 2వ పేజీలో...

ట్యాపింగ్ ముఠా.. వసూళ్ల వేట!

ట్యాపింగ్ మాటున బెదిరింపులు, దోపిడీలు

ఎంపీ కొండా నుంచి భూమి కొన్న వ్యక్తి నుంచి వసూళ్లు

13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లకుతోడు 4-5 కోట్లకు కుచ్చుటోపీ

ఎన్నికలవేళ ఎంపీ ఈటల అనుచరులకు బెదిరింపులు

వీరందరి వాంగ్మూలాల నమోదుకు తాజాగా సిట్ కసరత్తు

బాండ్లు ఏ పార్టీకి, ఎవరు కొనిపించారని ఆరా తీసే చాన్స్

పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు.!



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "నేను ఓ వ్యక్తికి భూమి అమ్మాను. ఆ వ్యక్తి వద్దకు ట్యాపింగ్ ముఠా వెళ్లి బెదిరించింది. బలవంతంగా రూ.12 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఎలక్టోరల్ బాండ్లను కొనిపించింది. మరో రూ.4 కోట్ల నుంచి 5 కోట్ల వరకు అదనంగా వసూలు చేసింది. నా దగ్గర భూమి కొన్న వ్యక్తి వివరాలు వారికెలా తెలుస్తాయి? ఫోన్ ట్యాపింగ్ చేస్తే తప్పు?"

.. ఫోన్ ట్యాపింగ్ విచారణ తర్వాత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్న మాటలివి!

మునుగోడు, హుజూరాబాద్ ఎన్నికలప్పుడు నా ఫోన్ ట్యాప్ చేశారు. ఎవరెవరితో మాట్లాడుతున్నానో తెలుసుకున్నారు. నా అనుచరులను బెదిరించారు.

.. ఫోన్ ట్యాపింగ్‌పై ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలు

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రెండో కోణంపై సిట్ అధికారులు తాజాగా దృష్టి సారించారు. ట్యాపింగ్ మాటున స్పెషల్

మిగతా 2వ పేజీలో...

వానాకాలం పంటలకు బీమా లేనట్లే!

(మొదటిపేజీ తరువాయి)

అంచనా వేసి తక్షణ సాయం కింద పరిహారం పంపిణీ చేయాలని సర్కారు భావిస్తోంది. రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇందులో వానాకాలంలో 1.30 కోట్లకుపైగా ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. పంటలు చేతికొచ్చే దశలో అకాల వర్షాలు, వడగండ్లతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పంటలకు బీమా చేయడం అనివార్యంగా మారింది. అయితే బీఆర్ఎస్ హయాంలో 2019-20 వరకే రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలైంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నుంచి కూడా అప్పట్లోనే బయటకు వచ్చింది. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. పీఎం-ఎఫ్‌బీవైలో చేరడంతోపాటు మెరుగైన పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కసరత్తు కూడా చేసింది. అయితే, పంటల సాగుకు ముందే బీమాకు టెండర్లు పిలవాల్సి ఉంటుంది. కానీ, మే, జూన్ నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రక్రియే చేపట్టలేదు. అంటే ఈ సీజన్‌కు పథకం అమలు చేయడం లేదన్నమాట.

ఆర్థిక భారం అవుతుందనే..!

పంటల బీమా పథకాన్ని అమలు చేయాలంటే కనీసం రూ.1000 కోట్లకు పైగా కావాలి. 2019-20లోనే ప్రీమియం ఖర్చు రూ.881 కోట్లు అయ్యింది. ఇప్పుడింకా పెరుగుతుంది. 2024-25లో రూ.1,300 కోట్లు, 2025-26 బడ్జెట్‌లో రూ.1,300 కోట్ల చొప్పున పంటల బీమాకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. కానీ, ఇంత భారీ మొత్తంలో నిధులు సర్దుబాటు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదనే చర్చ జరిగినట్లు తెలిసింది. రెండు పంటలకు కలిపితే ఏడాదికి రూ.2,600 కోట్లు సర్దుబాటు చేయాల్సి వస్తుంది. ఇంత భారీ బడ్జెట్ ఇప్పుడు సాధ్యం కాదని, అందుకే పంటల బీమా పథకం పునరుద్ధరణకు ముందడుగు వేయలేదని తెలిసింది. మరోవైపు పంటల బీమా పథకం అమలు చేస్తే.. రైతుల కంటే బీమా కంపెనీలకే ఎక్కువ లాభం కలుగుతున్నదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో గత ప్రభుత్వ హయాంలో బీమా కంపెనీలకు చెల్లించిన ప్రీమియం, రైతులకు అందిన నష్టపరిహారం లెక్కలు కూడా తీసినట్లు సమాచారం. 2019-20లో బీమా కంపెనీలకు రూ.881 కోట్ల ప్రీమియం చెల్లించగా.. రైతులకు రూ.509 కోట్ల నష్టపరిహారం వచ్చింది. ప్రీమియం, క్లెయిమ్‌కు మధ్య తేడా 372 కోట్లు ఉంది. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు నష్టపరిహారం ఇవ్వడమే మేలన్న ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది.

ఎకరానికి రూ.10 వేలు

గడిచిన రెండు, మూడు సీజన్లలో పంటలు నష్టపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేయించింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం పంపిణీ చేసింది. 2024-25, 2025-26 సంవత్సరాల్లో ఐదు సార్లు అకాల వర్షాలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.140 కోట్లు పంపిణీ చేసింది. ప్రస్తుతానికి ఇదే పద్ధతిని కొనసాగించాలని, రాబోయే రోజుల్లో పంటల బీమా పథకం పునరుద్ధరణపై ఆలోచన చేద్దామని సర్కారు నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.



ట్యాపింగ్ ముఠా.. వసూళ్ల వేట!

(మొదటిపేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)లోని స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) సభ్యులు బెదిరింపులు, దోపిడీలు, వేధింపులు, బ్లాక్ మెయిలింగ్, రికార్డులను తారుమారు చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి నేరాలను పక్కాగా నిరూపించేందుకు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వద్ద భూమి కొన్న సదరు వ్యక్తి వాంగ్మూలాన్ని సేకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎలక్టోరల్ బాండ్లను ఏ పార్టీ తరఫున కొనుగోలు చేశారు? ఆ పార్టీ తరఫున కొనుగోలు చేయాలంటూ ఎవరు బెదిరించారు!? ఎవరి పేరు చెప్పి వసూలు చేశారు!? అదనంగా డబ్బులు వసూలు చేశారా!? అయితే ఎంత!? వాటిని ఎవరికి ఇచ్చారు!? తదితర వివరాలను సేకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే, అప్పట్లో బెదిరింపులకు గురైన ఈటల అనుచరుల వాంగ్మూలాలను కూడా సిట్ సేకరించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న అనుచరుల వివరాలు వారికి ఎలా తెలిశాయి? ఏమని బెదిరించారు? ఎవరెవరు రంగంలోకి దిగారు? తదితర వివరాలతో వాంగ్మూలాలు సేకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి బాధితుల చిట్టా పెద్దగానే ఉందని తెలుస్తోంది. పక్కాగా సాక్ష్యాధారాలను సేకరించాలని సిట్‌ను ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో.. ఈ కేసులో బాధితుల వాంగ్మూలాలే కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఎస్ఓటీ అధికారులు చేసిన అరాచకాలకు సంబంధించి పకడ్బందీ సాక్ష్యాధారాలను కోర్టులకు సమర్పించి, అభియోగాలను రుజువు చేయాలని సిట్ భావిస్తోంది. ఇది సిట్ వ్యూహాత్మక ఎత్తుగడ అని విశ్రాంత పోలీసు అధికారులు, న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌తోపాటు దాని మాటున జరిగిన అరాచకాలూ బయటకు వస్తాయని వివరిస్తున్నారు.

4 వేలకుపైగా నంబర్ల ట్యాపింగ్!

సీఎం రేవంత్ సైతం.. తాను విపక్ష నేతగా ఉన్నప్పుడు తనతోపాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించిన విషయం తెలిసిందే. దీనికితోడు, ఫోన్ ట్యాపింగ్ బాధితుల సంఖ్య కూడా భారీగానే బయట పడుతోంది. ఈ క్రమంలో ప్రభాకర్ రావు నేతృత్వంలోని ఎస్ఓటీ బృందంలోని సభ్యులు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావు నాలుగు వేలకుపైగా ఫోన్ నంబర్లను ట్యాప్ చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిలో రాజకీయ నాయకులు, వ్యాపారులు, సెలబ్రిటీలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల నంబర్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు. మావోయిస్టులు, వారి సానుభూతిపరుల పేరుతో అధికారికంగా కొందరివి.. అనధికారికంగా మరికొందరివి ట్యాపింగ్ చేసినట్లు వివరిస్తున్నారు. అధికారికంగా కాల్ డిటైల్ రికార్డ్స్‌ను తెప్పించుకున్నారు. ఇందులో 615 నంబర్లు ఉన్నట్లు సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. వేల నంబర్లను ట్యాపింగ్ చేసిన నేపథ్యంలో వీటిలో రాజకీయ ట్యాపింగ్ ఏవి.. వసూళ్ల ట్యాపింగ్ ఏవేవి అనే వివరాలను ఆరా తీయాలని కూడా సిట్ భావిస్తోంది.

వివాహితపై ఆర్ఎంపీ ఘాతుకం

ఆమె రెండు చేతులకూ గడ్డిమందు ఇంజెక్షన్ చేసి, అదే మందు తాగించి లైంగికదాడికి పాల్పడ్డ వైనం

- అపస్మారక స్థితికి చేరుకున్న బాధితురాలు
- గస్తీ పోలీసుల రాకతో పరారైన నిందితుడు
- ఆమెను ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- నల్లగొండ జిల్లా గుర్రంపోడులో దారుణం
- ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ ఘోరం!


గడ్డిమందు ఇంజెక్షన్ కారణంగా కమిలిన మృతురాలి చేయి

గుర్రంపోడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆర్ఎంపీ వైద్యుడు.. గొడవలు రావడంతో ఆమె ప్రాణాలు తీయాలనుకున్నాడు. బలం ఇంజెక్షన్ చేస్తున్నానంటూ.. ఆమె రెండు చేతులకూ గడ్డి మందు ఇంజెక్ట్ చేసి, అదే మందు ఆమె నోట్లో బలవంతంగా పోసి అత్యాచారానికి పాల్పడ్డాడు! అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను చూసి.. చనిపోయిందని భావించి, ఆమెను ఎక్కడైనా పడేసి తప్పించుకోవాలనుకున్నాడు. కానీ.. అదే సమయంలో హైవే పెట్రోలింగ్ పోలీసులు ఆ దారిలో రావడంతో అక్కణ్నుంచీ పారిపోయాడు. కొన ఊపిరితో ఉన్న బాధితురాలిని పోలీసులు ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో జరిగిందీ దారుణం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలానికి చెందిన మహిళ తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి మిర్యాలగూడలో నివాసం ఉంటోంది. గ్రామంలో ఉంటున్న ఆమె అత్త ఆరు నెలల క్రితం జారిపడటంతో కాలు విరిగింది. దీంతో ఆమెకు సపర్యలు చేసేందుకు వివాహిత మిర్యాలగూడ నుంచి జూనూతల గ్రామానికి తరచూ వచ్చి వెళుతోంది. ఈ క్రమంలోనే.. ఆమె అత్తకు వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ వైద్యుడు మహేశ్‌తో ఆమెకు పరిచయమైంది. అది క్రమంగా వివాహేతర సంబంధంగా మారింది. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కామళ్ల గ్రామానికి చెందిన మహేశ్‌కు అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలు న్నారు. వారిద్దరి మధ్య సంబంధం కొంతకాలం సజావుగానే సాగినా.. ఆ తర్వాత గొడవలు మొదలయ్యాయి. దీంతో ఆమెను అడ్డుతొలగించుకోవాలని అతడు నిశ్చయించుకున్నాడు. అత్తకు సపర్యలు చేసేందుకు ఆదివారం సాయంత్రం మిర్యాలగూడ నుంచి బయల్దేరిన వివాహిత.. రాత్రి 9 గంటల సమయానికి కొండమల్లేపల్లి చేరుకుంది. భర్తకు ఫోన్ చేసి.. అప్పటికే బాగా ఆలస్యమైందని, అత్తకు వైద్యం చేస్తున్న వైద్యుడికి ఫోన్ చేసి ఆయన కార్‌లో అత్త దగ్గరకు వెళ్తానని సమాచారమిచ్చింది. అనంతరం ఆర్ఎంపీ మహేశ్‌కు ఫోన్ చేయడంతో.. అతడు తన కారులో అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి బయల్దేరారు. కానీ.. కారును అతడు వెళ్లాల్సిన దారిలో కాక వేరేవైపు మళ్లించాడు. దారిలో నిర్మానుష్య ప్రదేశంలో ఆపి.. బలం ఇంజెక్షన్ల పేరుతో ఆమెకు గడ్డిమందు ఇంజెక్ట్ చేసి.. అదే మందు ఆమె నోట్లో పోసి.. లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడంతో.. మృతి చెందిందని భావించి.. ఆమెను కారులో గుర్రంపోడు వరకు తీసుకొచ్చాడు. అక్కడినుంచి కాచారం వైపు వెళ్లే దారిలో కారు నిలిపి ఉంచాడు. అప్పటికి రాత్రి 12 గంటలైంది.

గస్తీ వాహనం రాకతో..

కాచారం వైపు వెళ్లే దారిలో కారు నిలిపి ఉంచిన మహేశ్.. అటుగా గస్తీ పోలీసుల వాహనం రావడంతో అక్కణ్నుంచీ పరారయ్యాడు. అటుగావచ్చిన పోలీసులు.. దారిలో నిలిపి ఉంచిన కారులో ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉండటం గమనించి తమ వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మహేశ్ చేసిన ఘాతుకం గురించి ఆమె అక్కడి వైద్యులకు వివరంగా తెలిపింది. అయితే అప్పటికే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు పోలీసులు ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ ఘాతుకానికి పాల్పడిన పాల్పడిన మహేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా.. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్య ఫోన్ చేసి మాట్లాడిందని, ఆర్ఎంపీ వెంట వెళుతున్నట్లు చెప్పిందని, అప్పటినుంచి ఆమె నెంబర్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని మృతురాలి భర్త పోలీసులకు తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్‌కు పాత ఫీజులే!

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్య కోర్సులకు ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత ఫీజులే కొనసాగనున్నాయి. నిబంధనల ప్రకారం 2025-28 విద్యా సంవత్సరం ఫీజులను సవరించాల్సి ఉండగా.. దీన్ని మరో ఏడాది వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఇతర వృత్తి విద్య యూజీ, పీజీ కోర్సుల ఫీజులను యథాతథంగా కొనసాగించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫీజుల సవరణపై ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఇచ్చిన ప్రతిపాదనలు సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా లేవని తెలిపారు. ఆయా కళాశాలల ప్రతిపాదనలను పరిశీలించేందుకు అధికారులతో ప్రత్యేక కమిటీ వేస్తామన్నారు. ఈ కమిటీ ఫీజుల పెంపు ప్రాతిపదికను పరిశీలిస్తుందని, మరింత మెరుగైన సవరణలు సూచిస్తుందని పేర్కొన్నారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలను ఇతర రాష్ట్రాలు ఎలా అమలు చేస్తున్నాయనే అంశాలను కమిటీ పరిశీలిస్తుందని వెల్లడించారు. 2022-25లో పేర్కొన్న ఫీజులనే ఈ ఏడాదీ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నిరుడు గరిష్ఠ ఫీజు రూ.1.60 లక్షలు!

దాదాపు అన్ని ఇంజనీరింగ్ కళాశాలలూ ఫీజులను పెంచాలంటూ ప్రతిపాదనలు పంపాయి. హైదరాబాద్, శివార్లలోని అనేక కాలేజీలు ఫీజులను 100 శాతం పెంచాయి. గత ఏడాది ఇంజనీరింగ్‌లో గరిష్ఠ ఫీజు రూ.1.60 లక్షలుగా ఉంది. ఈసారి వచ్చిన ప్రతిపాదనల్లో కొన్ని ప్రముఖ కళాశాలలు వార్షిక ఫీజును రూ.2.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత ఫీజులే ఉండనున్నాయి. వచ్చే విద్యాసంవత్సరంలో అన్ని ఇంజనీరింగ్ కాలేజీలను తనిఖీ చేసి, అక్కడి వసతులు, బోధనా సిబ్బందికి నిబంధనల ప్రకారం జీతాలు చెల్లిస్తున్నారా? లేదా? వంటి అన్ని విషయాలను పరిశీలించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

తత్కాల్‌కు ఆధార్ లింక్ నేటి నుంచే..

- రైలు చార్జీల పెంపు కూడా
- ఏసీ - కిలో మీటర్‌కు 2 పైసలు
- నాన్ ఏసీ - కి.మీ.కి 1 పైస
- సర్క్యులర్ జారీ చేసిన రైల్వే శాఖ



న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తత్కాల్ టికెట్ కోసం ఆధార్ నెంబరును తప్పనిసరి చేస్తూ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మంగళవారం నుంచే అమల్లోకి రానుంది. తత్కాల్ టికెట్ కావాలనుకునే వారు ఆధార్ నెంబరును ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా టికెట్ మంజూరవుతుంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాన్ని అసలైన ప్రయాణికులు మాత్రమే పొందేలా ఈ మార్పులు చేసింది. బాట్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించిన అనుమానాస్పద వ్యక్తులు టికెట్లు బుక్ చేస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకొంది. అలాంటి వ్యక్తులకు సంబంధించిన సుమారు 2.5 కోట్ల ఖాతాలను బ్లాక్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ఐఆర్‌సీటీసీ ద్వారా తత్కాల్ ఇ-టికెట్ బుకింగ్ కోసం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. రైల్వే కౌంటర్ వద్ద కూడా ఇదే విధానం అమలవుతుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు ఆన్‌లైన్ వినియోగదారులకు, స్టేషన్లలోని కౌంటర్ల వద్ద నిలబడే వ్యక్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్లు, అధీకృత ఏజెన్సీలు అరగంట తర్వాత టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఆధార్ లేని వినియోగదారులు, తత్కాల్ టికెట్ బుకింగ్‌ను కౌంటర్లు లేదా అధీకృత ట్రావెల్ ఏజెంట్ల వద్ద చేసుకోవచ్చు. ఇది జూలై 15 నుంచి అమల్లోకి రానుంది. కాగా, రైల్వే చార్జీలను పెంచుతూ సోమవారం రైల్వే మంత్రిత్వ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఏసీ ఎక్స్‌ప్రెస్/మెయిల్ రైళ్లకు ప్రతి కిలోమీటరుకు 2 పైసలు చొప్పున, నాన్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రతి కిలోమీటరుకు ఒక పైస చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. పెంచిన చార్జీలు మంగళవారం నుంచి (సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత) అమల్లోకి వస్తాయని పేర్కొంది. రోజువారీ ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సబర్బన్ రైళ్లు, నెలవారీ సీజన్ టిక్కెట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 67 మంది మృతి

ఓ కెఫేలో ఆహారం కోసం వచ్చిన వారిపై కాల్పులు

కైరో, జూన్ 30 : ఇజ్రాయెల్ దళాలు గాజాపై సోమవారం జరిపిన దాడుల్లో సుమారు 67 మంది చనిపోయారు. గాజా నగరంలో సముద్రపు ఒడ్డున మహిళలు, పిల్లలతో రద్దీగా ఉన్న అల్-బకా కేఫ్‌పై క్షిపణి విరుచుకుపడి సుమారు 30 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అక్కడ ఆహారం కోసం వచ్చిన పాలస్తీనియన్లపై జరిపిన కాల్పుల్లో 22 మంది చనిపోయారు. గాజా నగరంపై జరిగిన మరో రెండు క్షిపణి దాడుల్లో 15 మంది చనిపోయారు.

సార్క్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త గ్రూప్?

దక్షిణాసియా దేశాలతో చైనా, పాక్, బంగ్లాదేశ్ మంతనాలు

న్యూఢిల్లీ, జూన్ 30: భారతదేశం కీలక సభ్యదేశంగా ఉన్న సార్క్(దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం)కు ప్రత్యామ్నాయంగా మరో కూటమిని ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రయత్నిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం మేరకు ఈ విషయంలో పాక్, చైనా చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఇదే అంశంపై చైనాలోని కున్మింగ్‌లో జూన్ 19న నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ కూడా భాగస్వామ్యమైంది. 'సార్క్‌లో సభ్యదేశాలుగా ఉన్న ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త గ్రూప్‌లో చేరేలా ఆహ్వానించడమే కున్మింగ్ భేటీ లక్ష్యం' అని ఆ కథనం పేర్కొంది. శ్రీలంక, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ సహా సార్క్ సభ్యదేశాలు కొత్త గ్రూప్‌లో చేరే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ఈ కథనాన్ని బంగ్లాదేశ్ ఖండించింది. సార్క్‌లో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, భూటాన్, నేపాల్, మాల్దీవులు సభ్యదేశాలుగా ఉన్నాయి. 1985 డిసెంబరు 8న బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వేదికగా ఏడు దేశాలతో సార్క్ ఏర్పాటైంది. 2007లో అఫ్ఘానిస్థాన్ చేరింది.

కొన్ని నెలల్లో ఇరాన్ అణు కార్యక్రమం మళ్లీ మొదలు

న్యూఢిల్లీ, జూన్ 30: అమెరికా దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి వచ్చిన ముప్పు పెద్దగా ఏం లేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. అమెరికా దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని, ఆ తర్వాత ఇరాన్ మళ్లీ యురేనియాన్ని తనకు కావాల్సిన విధంగా శుద్ధి చేయగలదని వివరించారు. ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం, ఆ దేశ అణు కార్యక్రమాన్ని పూర్తిగా ధ్వంసం చేశామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనకు ఇది పూర్తిగా విరుద్ధంగా ఉండటం గమనార్హం.

సీఎం మార్పు అధిష్ఠానం చేతుల్లో!

- కర్ణాటక నేతలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పష్టం
- ఖర్గే కాకుంటే.. ఇంకెవరు హైకమాండ్?: బీజేపీ


బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఖర్గే స్పందించారు. అలాంటి అంశాలపై అధిష్ఠానం మాత్రమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. 'అనవసర సమస్యలు' సృష్టించవద్దని పార్టీ నేతలకు హెచ్చరికలు చేశారు. ఖర్గే సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అక్టోబరులో రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉంటుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'చూడండి, అది హైకమాండ్ చేతుల్లో ఉంటుంది. అధిష్ఠానంలో ఏం జరుగుతుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. తదుపరి ఏ చర్య అయినా తీసుకొనే అధికారం వారికే ఉంటుంది' అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నేత అశోక్ స్పందించారు. ఖర్గేకు కాంగ్రెస్ పార్టీకి యాక్సిడెంటల్‌గా అధ్యక్షుడు అయ్యారని వ్యాఖ్యానించారు. "పార్టీ అధ్యక్షుడు హైకమాండ్ కాకుంటే.. ఇంకెవరు" అని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ప్రశ్నించారు. మరోవైపు ప్రభుత్వంలో చీలిక ఉందనే ప్రచారాన్ని సీఎం సిద్దరామయ్య కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం రాయిలాగా ఐదేళ్లు ధృడంగా ఉంటుందన్నారు. ఓ కార్యక్రమంలో శివకుమార్‌తో చేతులు కలిపి, పైకెత్తి ఐక్యతను చాటారు.

భారీ వర్షాలతో ముగ్గురి మృతి

సిమ్లా, జూన్ 30: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీవర్షాలు కుదిపేస్తున్నాయి. ఈ కారణంగా 24 గంటల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఈ ఏడాది వర్షాల కారణంగా హిమాచల్‌లో మరణాల సంఖ్య 20కి పెరిగింది. సిమ్లాలో 5 అంతస్తుల ఓ భవనం సోమవారం కుప్పకూలింది. అందులో నివాసం ఉంటున్నవారు ముందుగానే బయటపడడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. భారీవర్షాల కారణంగా రాష్ట్రంలోని 259 రోడ్లను మూసివేశారు. సోలన్‌లో ఒక వంతెన కొట్టుకుపోయింది. రాష్ట్రంలోని 130 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాంగ్రా, మండి, సిర్మార్, సోలన్ జిల్లాల్లో సోమవారం పాఠశాలలను మూసివేయాల్సిందిగా సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు ఆదేశించారు. సిమ్లా-కాల్కా రైల్వే లైనులో భారీ వర్షాలకు ట్రాక్‌పై బండరాళ్లు పడడంతో రైళ్లు నడవలేదు.

మనకూ బంకర్ బస్టర్ బాంబులు

- అమెరికా తరహాలో అభివృద్ధిపై భారత్ దృష్టి
- 7,500 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లేలా అగ్ని-5లో మార్పులు



న్యూఢిల్లీ, జూన్ 30: ఇటీవల ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా ప్రయోగించిన బంకర్ బస్టర్లు తీవ్ర నష్టం కలిగించాయి. దీంతో వాటి సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అమెరికా తరహాలో బంకర్ బస్టర్ బాంబుల తయారీపై దృష్టిపెట్టింది. అయితే వీటిని యుద్ధ విమానాలపై నుంచి కాకుండా క్షిపణుల ద్వారా ప్రయోగించేందుకు వీలుగా అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిలో మార్పులు చేస్తున్నట్టు తెలిసింది. దీనికోసం ఇప్పటికే రంగంలోకి దిగిన డీఆర్‌డీవో భారీ బంకర్ బస్టర్ బాంబును మోసుకెళ్లేందుకు వీలుగా అగ్ని-5 మిస్సైల్‌లో మార్పులు చేస్తోంది. ప్రస్తుతం అగ్ని-5 క్షిపణి గరిష్ఠంగా 5 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణ్వాయుధ ప్రయోగాల కోసం దీన్ని రూపొందించారు. అయితే ఈ అణు వార్‌హెడ్ స్థానంలో 7,500 కిలోల బరువుండే బంకర్ బస్టర్ బాంబులను మోసుకెళ్లగలిగేలా డీఆర్‌డీవో మార్పులు చేస్తోంది. కాంక్రీటు గోడలతో శత్రు దుర్భేద్యంగా నిర్మించిన భూగర్భ కేంద్రాల (బంకర్లు)ను సైతం ధ్వంసం చేసేలా దీన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో దీని పరిధిని కూడా 2,500 కిలోమీటర్లకు కుదించారు. అలాగే ఇది మోసుకెళ్లే బంకర్ బస్టర్ బాంబు 80 నుంచి 100 మీటర్లమేర భూగర్భంలోకి చొచ్చుకుపోగలదని భావిస్తున్నారు. అగ్ని-5తో పోలిస్తే కొత్త వేరియంట్‌లో 2,500 కిలోమీటర్ల పరిధి తగ్గినప్పటికీ.. విధ్వంసక సామర్థ్యం, కచ్చితత్వం భారత వ్యూహాత్మక ఆయుధాల్లో దీన్ని కీలక శక్తిగా మారుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. పాకిస్థాన్, చైనా వంటి దేశాలలోని కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, భూగర్భ క్షిపణి, సైనిక స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించడం కోసం గ్ని-5లో రెండు కొత్త రకాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిసింది. వీటిలో ఒకటి భూమిపై ఉన్న లక్ష్యాల కోసం రూపొందిస్తుండగా.. మరొకటి భూగర్భంలోని లక్ష్యాలను ఛేదించేదిగా ఉండనుంది.

బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై అకృత్యం

ఢాకా, జూన్ 30: బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై ఒక వ్యక్తి అకృత్యానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి బాధితురాలిని వివస్త్రను చేసి, తీవ్రంగా కొట్టి, అత్యాచారానికి పాల్పడ్డాడు. కుమిల్లా జిల్లా మురాద్‌నగర్‌లో జూన్ 26న జరిగిందీ దారుణం. బాధితురాలి(21) భర్త దుబాయిలో పనిచేస్తున్నారు. 'హరిసేవ' పండుగ సందర్భంగా ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇటీవల మురాద్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చారు. స్థానికుడైన ఫజర్ అలీ(36) వద్ద ఆమె తండ్రి రూ.35 వేలు అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చాల్సిన గడువు ముగియడంతో గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో వారి ఇంటికి ఫజర్ అలీ వచ్చాడు. తలుపు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించాడు. ఆమెపై దాడి చేశాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫజర్ అలీని పోలీసులు అరెస్టు చేశారు. తనను కొట్టొద్దంటూ బాధితురాలు వేడుకొంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆదివారం దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి భారీ ప్రదర్శనలు నిర్వహించారు.

థార్ ఎడారిలో.. దాహంతో అలమటించి

పాకిస్థానీ హిందూ యువ జంట మృతి



జైసల్మేర్, జూన్ 30: పదిహేడేళ్ల రవికుమార్.. పదిహేనేళ్ల శాంతి బాయి.. పాకిస్థాన్‌కు చెందిన హిందువులు! వారికి ఈ మధ్యే సింధ్ ప్రావిన్సులోని మీర్‌పూర్‌లో పెళ్లయింది! ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్న పాక్‌లో బతకలేం అనుకున్నారో.. ఇంకే కష్టం వచ్చిందో.. ఆ యువ దంపతులు భారతదేశానికి వచ్చి స్థిరపడాలనుకున్నారు. అందుకు అవసరమైన వీసాల కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ.. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో వారి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో అక్రమంగానైనా భారత్‌లోకి ప్రవేశించాలనుకు థార్ ఎడారి బాట పట్టారు. దాహానికి తాళలేక.. ఎడారి మధ్యలోనే.. ప్రాణాలు కోల్పోయారు!! ఆ జంట నీటి కోసం ఎంత అలమటించిందో చెప్పడానికి.. ఎడారిలో పడి ఉన్న రవికుమార్ ముఖం మీద ఉన్న ఖాళీ నీటి డబ్బానే నిదర్శనం! ఆ జంట అసువులు బాసిన ఐదారు రోజుల తర్వాత.. శనివారంనాడు స్థానిక పశువుల కాపరులు గుర్తించి సరిహద్దు భద్రతా దళాలకు సమాచారం అందించారు. గుర్తింపు కార్డుల ఆధారంగా వారి సమాచారాన్ని పోలీసులు తెలుసుకోగలిగారు. ఇద్దరూ పాకిస్థాన్‌లోని సింధ్ జిల్లాకు చెందినవారని పోలీసులు తెలిపారు. వారి వద్ద పాకిస్థానీ సిమ్ కార్డు ఉందని.. నవ వధువులు ధరించే ఎరుపు, తెలుపు గాజులు శాంతిబాయి చేతికి ఉన్నాయని చెప్పారు. 'హిందూ పాకిస్థానీ డిస్‌ప్లేస్డ్ యూనియన్ అండ్ బోర్డర్ పీపుల్స్ ఆర్గనైజేషన్'కు చెందిన దిలీప్ సింగ్ ఆ జంట ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి వివరాలు కోరగా.. పాక్ నుంచి స్పందన వచ్చింది. ఆ వివరాల ప్రకారం.. వారిద్దరూ జూన్ 21వ తేదీన తమ ఇంటి నుంచి మోటార్‌సైకిల్‌పై బయల్దేరారు. ఆ బైక్‌ను ఇండో-పాక్ సరిహద్దుల్లోని నూర్‌పూర్ దర్గా వద్ద పార్క్ చేసి, అక్కణ్నుంచీ కాలినడకన సరిహద్దు దాటి రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోకి ప్రవేశించారు. అంతర్జాతీయ సరిహద్దు నుంచి 11 కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. అక్కడ ప్రాణాలు కోల్పోయారు.

జోహ్రాన్ గెలిస్తే న్యూయార్క్‌కు కష్టాలే!

- నగరానికి అందించే నిధుల్లో కోత వేస్తాం: ట్రంప్

వాషింగ్టన్, జూన్ 30: న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న డెమోక్రాట్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. డెమోక్రటిక్ సోషలిస్ట్ అయిన జోహ్రాన్ ప్రవర్తన సరిగా ఉండదని, నవంబరు 4న జరగనున్న ఎన్నికల్లో ఆయన గెలిస్తే న్యూయార్క్ నగరానికి అందించే ప్రభుత్వ నిధుల్లో కోత వేస్తామని బెదిరించారు. జోహ్రాన్ పక్కా కమ్యూనిస్టు అభ్యర్థి అని ట్రంప్ పేర్కొన్నారు. జోహ్రాన్ గెలిస్తే న్యూయార్క్ నగరానికి అంత మంచిది కాదని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూయార్క్ మేయర్‌గా ఎవరు గెలిచినా మర్యాదగా ప్రవర్తించాల్సిందేనని తేల్చిచెప్పారు. నగర కంప్ట్రోలర్ సమాచారం ప్రకారం న్యూయార్క్‌కు సమాఖ్య ప్రభుత్వం నుంచి 100 బిలియన్ డాలర్లకు పైగా నిధులు అందుతున్నాయి. కాగా, ట్రంప్ వ్యాఖ్యలపై భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ స్పందించారు. తాను కమ్యూనిస్టును కాదని చెప్పారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలు

» డిగ్రీ, పీజీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ.. 2025-26 యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి కల విద్యార్థులు చివరి తేది ఆగస్టు 13లోపు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని విద్యార్థి సేవ విభాగాధిపతి పేర్కొన్నారు. అర్హతలు, ఫీజులు, మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ www.braouonline.in, www.braou.ac.inలో పొందవచ్చని అధికారులు వెల్లడించారు. లేదా వర్సిటీ హెల్ప్‌డెస్క్ నంబర్లు 7382929570/580, 040-23680290/291/ 294/295, టోల్ ఫ్రీ నెం.18005990101లో సంప్రదించవచ్చని సూచించారు.

నేటి నుంచి ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

» 3 రోజుల్లో 64,190 స్లాట్ బుకింగ్‌లు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ యూజీ కళాశాలల్లో కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా సోమవారం వరకు 64,190 మంది ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమై జూలై7తో ముగుస్తుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు. జూలై13లోపు మాక్ సీట్ అలోకేషన్ చేసుకోవచ్చు. ఆప్షన్లలో ఏమైనా మార్పులుంటే జూలై 14, 15 తేదీల్లో చేసుకోవాలని, లేనిపక్షంలో మాక్ సీట్‌నే తుది నిర్ణయంగా భావిస్తామని కన్వీనర్ తెలిపారు. జూలై18న మొదటి జాబితా విడుదల చేస్తామని, ఎంపికైనవారు జూలై22లోపు ట్యూషన్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈసారి మూడు విడతల్లో జరగనున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 178 ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేయనున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటాలో మొత్తం 1,19,600 సీట్లున్నాయి.

భూమి పట్టా కావట్లేదని మనస్తాపంతో గిరిజన రైతు ఆత్మహత్య

» మహబూబాబాద్ జిల్లాలో ఘటన

గార్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం కొనుక్కున భూమి పట్టా కావడం లేదన్న మనస్తాపంతో ఓ గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్ద కృష్ణాపురంలో చోటు చేసుకుంది. గంగావత్ మోహన్ (38) అనే రైతు అదే గ్రామానికి చెందిన మహిళా రైతు వద్ద 29 గుంటల భూమి కొన్నారు. నాటి నుంచి భూమి పట్టా చేయడానికి ఆమె సహకరించట్లేదు. విక్రయించిన రైతు వస్తేనే భూమి పట్టా చేస్తామని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. దీనిపై మోహన్.. పెద్ద మనుషులకు తన గోడు వినిపించుకున్నా సదరు మహిళా రైతు కనికరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన మోహన్ శనివారం సాయంత్రం భూమి వద్దే గడ్డి మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంగతి గమనించిన తోటి రైతులు కుటుంబీకులకు సమాచారమిచ్చి.. మోహన్‌ను చికిత్స కోసం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. మృతుడు మోహన్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మోహన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గార్ల ఎస్ఐ రియాజ్ పాషా తెలిపారు.

పచ్చందనమే.. పచ్చదనమే!



భూమికి ఆకుపచ్చని రంగేసినట్లు.. ఎటు చూసినా నిండైన పచ్చదనంతో.. ఆహ్లాదపర్చే రమణీయ అందాలతో కనువిందు చేస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాలు ఇవి. తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కోసాయి అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఈ పల్లెలు.. వర్షాలతో కొత్త అందాలను అద్దుకుంటున్నాయి. చెట్టూపుట్టా పచ్చటి సొగసుతో ఆకట్టుకుంటున్నాయి. చుట్టూ కొండలు.. మధ్యలో దట్టమైన అడవుల మీదుగా ఆదిలాబాద్-నాందేడ్ మార్గంలో రైళ్లలో ప్రయాణించే వారు ఈ సుందర దృశ్యాలను చూస్తూ మైమరచిపోతున్నారు.

– తలమడుగు, ఆంధ్రజ్యోతి

తల్లికి బుక్కెడు బువ్వ పెట్టని కుమారులు

పంచి ఇచ్చిన ఆస్తి తిరిగి ఇవ్వాలని వినతి.. కలెక్టర్ ఎదుట గోడు వెళ్లబోసుకున్న తల్లి

» గద్వాల జిల్లా మల్దకల్‌లో ఘటన



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పాపమ్మ

గద్వాల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కొడుకులు పుడితే వృద్ధాప్యంలో అండగా ఉంటారు, జీవితాంతం తోడుంటారని ఆశపడతారు తల్లిదండ్రులు. కానీ ఓ తల్లి విషయంలో ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయి. కుమారులు ఆస్తులు తమ పేరిట రాయించుకుని, కనీసం బుక్కెడు బువ్వ పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో గత్యంతరం లేక జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది ఆ కన్నతల్లి. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రానికి చెందిన కుర్వ పాపమ్మ, ఎర్రన్న దంపతులకు తిమ్మప్ప, కిష్టన్న, గోవిందు, రామాంజనేయులు అనే నలుగురు కుమారులు ఉన్నారు. వీరిలో తిమ్మప్ప, కిష్టన్న, గోవిందులకు తమకున్న 2.37 ఎకరాల భూమిని కొంతకాలం క్రితం సమానంగా పంచి ఇచ్చారు. అయితే తండ్రి ఎర్రన్న మృతిచెందడంతో కొద్దిరోజులు కొడుకులు తల్లిని బాగానే చూసుకున్నారు. తర్వాత అన్నం పెట్టడం మానేశారు. "అందరం కలిసి రూ.50 వేలు ఇస్తాం. కానీ అన్నం మాత్రం పెట్టడం కుదరదు" అని కుమారులు పెద్దమనుషుల సమక్షంలో తెగేసి చెప్పారు. చివరకు ఏ ఆస్తి ఇవ్వని చిన్న కుమారుడు రామాంజనేయులు ఆమెకు ఆసరా అయ్యాడు. అయితే అతడికి కూడా పూటగడవడం కష్టమవడంతో తల్లికి అన్నం పెట్టలేకపోయాడు. నిస్సహాయురాలైన ఆ తల్లి చేసేది లేక సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. కుమారులకు పంచి ఇచ్చిన భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ సంతోష్ ఆదేశించారు.

వేధింపులతో రైల్వే ఎస్సై భార్య ఆత్మహత్య

» ఎస్సైతో పాటు ఆయన తండ్రికి రిమాండ్



రాజేశ్వరి (ఫైల్)

జూలూరుపాడు/ఖమ్మం క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో పాటు అదనపు కట్నం కోసం భర్త ఖమ్మం రైల్వే ఎస్సై బానోత్ రాణాప్రతాప్ ఆయన కుటుంబ సభ్యులు వేధించడంతో భార్య బానోత్ రాజేశ్వరి (34) ఆత్మహత్య చేసుకుంది. కొత్తగూడెం పట్టణానికి చెందిన రాజేశ్వరికి, ఖమ్మం జిల్లా రాములు తండాకు చెందిన ఎస్సై బానోత్ రాణాప్రతాప్‌కు 2018లో వివాహమైంది. వారికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొద్దికాలం తర్వాత రాజేశ్వరికి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తూ భర్త రాణాప్రతాప్, అత్తమామలు పుష్పరాణి, చంద్రంతో పాటు బావ మహబూబాబాద్ వీఆర్ ఎస్సై బానోత్ మహేశ్ వేధించడం ప్రారంభించారు. తాము చెప్పినట్లు వినకుంటే చచ్చిపోమని బెదిరించేవారు. వారి వేధింపులు భరించలేక రాజేశ్వరి ఈ నెల 25న జూలూరుపాడులో పురుగు మందు తాగి.. పుట్టింటి వారికి సమాచారమిచ్చింది. వారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె తండ్రి కేళోత్ సోమ్లా ఫిర్యాదు మేరకు నిందితులైన రైల్వే ఎస్సైని, ఆయన తండ్రిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు జూలూరుపాడు ఎస్సై రవి తెలిపారు.

యూరియా కోసం మహిళా రైతుల బారులు!

» వర్షాన్ని సైతం లెక్క చేయని వైనం

» పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ



కుమరంభీం జిల్లా సిర్పూర్(టి)లో యూరియా కోసం బారులు తీరిన మహిళా రైతులు

సిర్పూర్(టి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేసిన యూరియా కోసం మహిళా రైతులు సోమవారం బారులు తీరారు. మండలానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న మహిళా రైతులు పెద్దసంఖ్యలో పీఏసీఎస్ కార్యాలయానికి తరలివచ్చారు. ఒక వైపు వర్షం కురుస్తున్నా గొడుగులతో వరుసలో నిలబడ్డారు. పెద్ద సంఖ్యలో రైతులు పీఏసీఎస్ కార్యాలయానికి తరలిరావడంతో ఎస్సై కమలాకర్ పోలీసు సిబ్బందిని పంపించి బందోబస్తు నిర్వహించారు. నాలుగు లారీల యూరియానే రావడం, రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిర్పూర్(టి) మండలానికి గతంలో రెండు, ఈసారి నాలుగు లారీల యూరియా మాత్రమే వచ్చింది. మండలంలోని వెంపల్లి, లోనవెల్లి, హుడ్కిలి, సిర్పూర్(టి), చింతకుంట గ్రామాల్లో ఉన్న ఆగ్రో సెంటర్ల ద్వారా యూరియా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తెలంగాణ భవన్‌లో అసాంఘిక కార్యకలాపాలు

» ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి: సంపత్ కుమార్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో అసాంఘిక, అప్రజాస్వామిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యాలయంలో ఓ టీవీ చానల్‌ను అక్రమంగా నిర్వహిస్తున్నారని, ఆ చానల్‌లో పని చేసే యాంకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. మహాన్యూస్ చానల్ కార్యాలయంపై దాడి చేసిన వందలాది మంది.. తెలంగాణ భవన్‌లోకే వెళ్లి తలదాచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌ను వెంటనే స్వాధీనం చేసుకుని, సీసీ ఫుటేజీల ఆధారంగా అసాంఘిక శక్తులను గుర్తించాలన్నారు. ఆ పార్టీ ఖాతాల్లోకి రూ.వేల కోట్లు ఎలా వచ్చాయన్న దానిపైనా విచారణ జరపాలన్నారు. గత 20 ఏళ్లలో తెలంగాణ భవన్‌లో జరిగిన అక్రమాలపై ఫైలు తయారు చేశామని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తామని చెప్పారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి మైండు కరాబైందని, ఆయనకు రాజకీయ పరిజ్ఞానం లేదని దుయ్యబట్టారు.

బుద్ధవనం ప్రత్యేకాధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్య

బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విదేశీ యాత్రికులను సైతం ఆకట్టుకుంటున్న ఈ ప్రాజెక్టు అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించిన లక్ష్మయ్య రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సోమవారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పదో తరగతి గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

» ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్, మరో నలుగురిపై కేసు నమోదు

పరకాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరకాల మండలం మల్లక్కపేట గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీవాణి అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తన కుమార్తె ఆత్మహత్య చేసుకోవడానికి గురుకుల సిబ్బందే కారణమని బాలిక తండ్రి ఈశ్వర్ ఆరోపించారు. ఆయన ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, హౌస్ మాస్టర్ మీరాబాయితో పాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవాణి సోమవారం ఉదయం బాత్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకున్నట్లుగా బంధువులు తెలిపారు. పాప కళ్లు తిరిగి పడిపోతే పరకాలలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తీసుకొచ్చామని గురుకుల పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన వెళ్లిన తల్లిదండ్రులకు బాలిక శవమై కనిపించింది. కుటుంబ సభ్యులతో కలిసి గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏసీపీ సతీష్‌బాబు, సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు.

ఇద్దరు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కల్తీ ఆహారం తిని ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి సాంబార్‌తో భోజనం చేయగా తొమ్మిదో తరగతి విద్యార్థులు మణిచంద్, హర్షవర్ధన్‌కు కడుపు నొప్పి‌వాంతులు మొదలయ్యాయి. సోమవారం టీచర్లు.. పిల్లలను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాక కోలుకున్నారు.

త్వరలో వాట్సాప్ టికెటింగ్, డిజిటల్ బస్‌పాస్‌లు

» ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ (ఏఎఫ్‌సీఎస్)లో భాగంగా ప్రస్తుతం 'క్యూఆర్ కోడ్' టికెటింగ్ విధానం అందుబాటులో ఉందని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా వాట్సాప్ టికెటింగ్, డిజిటల్ బస్‌పాస్‌ల సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ డిపోను మంత్రి పొన్నం ప్రభాకర్, సజ్జనార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ యాప్‌లో డిజిటల్ బస్‌పాస్‌లను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వాట్సాప్, డిజిటల్ బస్‌పాస్‌లను కండక్టర్ల వద్ద ఉండే ఐటిమ్స్‌తో స్కాన్ చేసి ప్రయాణించవచ్చని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాల్య టీకాలు

ఒక మహా విపత్తు (కోవిడ్ మహమ్మారి) నుంచి అష్టకష్టాలతో బయటపడిన తరువాత కూడా నవజాత శిశువులు, బాల్యంలో ఉన్న పిల్లలు అందరికీ వ్యాధినిరోధక టీకాలు వేయడంలో సంపూర్ణ శ్రద్ధ చూపకపోవడాన్ని ఎలా గర్హించాలి? భారత్‌లో పిల్లల టీకా కవరేజీ తగ్గుతోందని 'ది లాన్సెట్' జర్నల్ తాజాగా వెల్లడించింది. ఏడాది వయస్సులోగా విధిగా వేయవలసిన టీకా మొదటి డోసుకు కూడా నోచుకోని పిల్లల (జీరో–డోస్ చిల్డ్రన్) సంఖ్యలో భారత్ ప్రపంచంలో ద్వితీయ స్థానంలో ఉన్నదని, అంతేకాకుండా పలు రాష్ట్రాలలోని అనేక జిల్లాలలో టీకా కవరేజీలో స్థానిక అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది.

మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ వ్యాధుల నుంచి మనలను కాపాడుతుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన ఐదు సంవత్సరాల దాకా ఆ రోగ నిరోధక శక్తి పూర్తి స్థాయిలో ఉండదు. ఈ దశలో విధిగా టీకాలు వేయవలసిన అవసరమున్నది. టీకాలతో మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ శక్తిమంతమై అనేక వ్యాధుల నుంచి మనకు రక్షణ కల్పిస్తుంది. బాల్యంలో వేసిన టీకాల కారణంగానే మశూచికం, పోలియో మొదలైన వ్యాధుల నుంచి మానవాళి విముక్తమయింది.

గత యాభై సంవత్సరాలలో 400 కోట్లకు పైగా బాలలకు టీకాలు వేయడం ద్వారా 15 కోట్లకు పైగా చిన్నారుల మరణాలను నివారించడం సాధ్యమయింది. వ్యాధులను వాటి వాటి హద్దుల్లో ఉంచుతున్న టీకాలను చిన్నపిల్లలకు సకాలంలో వేయడం తప్పనిసరి. కారణాలు ఏవైనా ఈ విషయంలో 2010 నుంచి జరుగుతోన్న జాప్యం ఆ వ్యాధుల పునర్ విజృంభణకు దారితీస్తోంది. ఆ ప్రమాదఘంటికలనే 'ది లాన్సెట్' మోగించింది.

2023లో భారత్‌లో రెండు కోట్ల మందికి పై కొత్త శిశువులు జన్మించగా వారిలో జీరో–డోస్ పిల్లలు 6.2 శాతం మేరకు ఉన్నారు. ఒక అధ్యయనం ప్రకారం 1992లో 33.4 శాతంగా ఉన్న జీరో–డోస్ బాలల శాతాన్ని 2016లో 10.1 శాతానికి తగ్గించడంలో భారత్ సఫలమయింది. కోవిడ్ విపత్తు పూర్వం 2019లో జీరో–డోస్ పిల్లల సంఖ్య 14 లక్షలుగా ఉన్నది. 2021లో ఈ సంఖ్య 27 లక్షలకు పెరిగి 2022లో 11 లక్షలకు తగ్గింది. 2023లో 14 లక్షలకు పైగా పెరిగింది. దీన్ని బట్టి పిల్లలకు సకాలంలో టీకాలు వేయడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా పుట్టిన ప్రతి బిడ్డకు టీకా వేయడమనే లక్ష్యసాధన అసంపూర్ణంగానే ఉండిపోయిందని స్పష్టమవుతోంది.

సకాలంలో టీకా పొందలేకపోతున్న చిన్నారులు పేద, అణగారిన వర్గాలకు చెందినవారై ఉండడం ఒక కఠోర సత్యం. మారుమూల గ్రామీణ ప్రాంతాలు, అందుబాటులో లేని అటవీ ప్రాంతాల నివాసితులు అయిన ఎంతో మంది టీకాను సకాలంలో వేయించుకోలేకపోతున్నారు. మాతృమూర్తుల అవగాహనారాహిత్యం వారి బిడ్డలకు శాపంగా పరిణమిస్తోంది. కొన్ని సామాజిక వర్గాలు ముఖ్యంగా ముస్లింలలో టీకాల పట్ల సంకోచం కూడా జీరో–డోస్ పిల్లల సంఖ్య గణనీయంగా ఉండేందుకు కారణమవుతోంది. పౌర సమాజం ఓర్పు, నేర్పుతో ఈ టీకా సంకోచాన్ని తొలగించేందుకు, టీకాల పట్ల నిరక్షరాస్యులైన తల్లులలో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలి. ఒక జిల్లాలోనే ఇరుగు పొరుగు ప్రాంతాల మధ్య వ్యాక్సినేషన్ అసమానతలను తొలగించేందుకు, పుట్టిన ప్రతి బిడ్డకు సకాలంలో టీకా సదుపాయం లభించేందుకు గ్రామ సర్పంచ్‌లు, మునిసిపల్ చైర్మన్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సహానుభూతితో కృషిచేయాలి.

భారత్‌లో పిల్లలకు టీకా కవరేజీపై ది లాన్సెట్ వెల్లడించిన గణాంకాలు వాస్తవమైనవి కావని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. జీరో–డోస్ పిల్లల శాతం 2023లో 0.11 శాతం నుంచి 2024లో 0.06 శాతానికి తగ్గినట్టు చెప్పింది. గణాంకాలు ఎలా ఉన్నప్పటికీ టీకా సౌకర్యం పొందలేకపోతోన్న చిన్నారుల సంఖ్య లక్షల్లో ఉందనేది కొట్టివేయలేని సత్యం. ఏది ఏమైనా ది లాన్సెట్ వెల్లడించిన విషయాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇమ్యూనైజేషన్ ఎజెండా–2030ను పరిపూర్తి చేయడంలో తమ కృషి లోపానికి ఆక్షేపణగా మన పాలకులు భావించనవసరం లేదు. అలాగే పాలకులను తప్పుపట్టేందుకు ది లాన్సెట్ నివేదికను ఆధారం చేసుకోవడమూ సహేతుకం కాదు. కొత్త వైరస్‌లు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజారోగ్యానికి ముంచుకొస్తున్న కోవిడ్ తరహా ముప్పును ది లాన్సెట్ నివేదిక వెలుగులో అర్థం చేసుకోవాలి. వ్యక్తులకు, ప్రజా సమూహాలకు ఆరోగ్యప్రదమైన భవిష్యత్తును నిర్మించేందుకు సంపూర్ణ శ్రద్ధ చూపని పక్షంలో రోగగ్రస్త భవిష్యత్తే మనకు దాపురిస్తుంది.

ఐటీకి దిక్సూచిగా తెలంగాణ

ఒకప్పుడు ఐటీ అనగానే అందరికీ ఠక్కున మహారాష్ట్ర, కర్ణాటక లాంటి రాష్ట్రాలు గుర్తుకొచ్చేవి. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశనంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో తెలంగాణే ఐటీకి దిక్సూచిగా ఎదిగింది. ముఖ్యంగా బెంగళూరు, పూణే, గుర్‌గావ్ లాంటి నగరాలను వెనక్కి నెట్టి 'గ్లోబల్ ఐటీ హబ్'గా టెక్ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ ఆహ్వానం పలుకుతోంది.

2023–24లో దేశవ్యాప్తంగా ఐటీ ఎగుమతుల విలువ రూ.9.43 లక్షల కోట్లు. ఇందులో తెలంగాణ వాటా రూ.2.7 లక్షల కోట్లు. 2022–23తో పోలిస్తే 11.3 శాతం వృద్ధి సాధించింది. దేశ సగటు కంటే ఇది నాలుగింతలు ఎక్కువ. ప్రస్తుతం తెలంగాణ ఐటీ రంగంలో 10 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 'తెలంగాణ సోషియో–ఎకనమిక్ అవుట్‌లుక్ 2025' నివేదిక ప్రకారం రాష్ట్ర గ్రాస్ స్టేట్ వాల్యూయాడెడ్(జీఎస్‌వీఏ)లో సేవా రంగం వాటా 66.3 శాతం. ఇందులో అధిక వాటా ఐటీ రంగానిదే.

ప్రస్తుతం హైదరాబాద్‌లో 1500కు పైగా ప్రముఖ ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలో 10 అత్యుత్తమ టెక్ దిగ్గజాల్లో ఏడు కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. వీటిలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, గూగుల్, సేల్స్ ఫోర్స్ లాంటివి ఉన్నాయి. ఐటీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ చాలా ముందంజలో ఉంది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలను చేసుకున్నారు. ఇందులో రూ.1.04 లక్షల కోట్లు ఐటీ, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి సంబంధించినవే. షాద్‌నగర్‌లో మైక్రోసాఫ్ట్ రూ.16వేల కోట్లతో డేటా క్లస్టర్‌ను నిర్మిస్తోంది. ప్రపంచంలో నాలుగోది, భారత్‌లో మొదటి సేఫ్టీ ఇంజినీరింగ్ కేంద్రాన్ని గూగుల్ ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించింది. 2023–24లో కొత్తగా 40వేల మందికి ఐటీ ఉద్యోగాలొచ్చినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



హైదరాబాద్‌లో 1500కు పైగా ప్రముఖ ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలో 10 అత్యుత్తమ టెక్ దిగ్గజాల్లో ఏడు కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. వీటిలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, గూగుల్, సేల్స్ ఫోర్స్ లాంటివి ఉన్నాయి. ఐటీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ చాలా ముందంజలో ఉంది.

హైదరాబాద్ ఇటీవల కాలంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హబ్‌గా మారింది. ప్రస్తుతం 355 జీసీసీలు సుమారు 3.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. వీటిలో 70 గతేడాదిలోనే ప్రారంభమయ్యాయి. దేశంలోని ఏ నగరం కూడా ఈ రికార్డును సాధించలేదు. ఇవన్నీ కేవలం బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు పరిమితం కావడం లేదు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, గ్లోబల్ ఉత్పత్తుల రూపకల్పన వంటి కీలక అంశాల్లో ఆర్ అండ్ డీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ జీసీసీలను గ్లోబల్ వాల్యూయాడెడ్(జీవీఏ) కేంద్రాలుగా, నూతన ఆవిష్కరణలకు అడ్డాగా మార్చాలని శ్రీధర్‌బాబు సంకల్పించి, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణను అమలు చేస్తున్నారు.

ప్రజా ప్రభుత్వం కేవలం ఐటీ రంగం అభివృద్ధిపైనే కాకుండా ఈ రంగానికి కావాల్సిన అత్యుత్తమ మానవ వనరులను అందించే బాధ్యతను తీసుకుంది. ఈ ప్రక్రియలో ఐటీ దిగ్గజ సంస్థలను భాగస్వామ్యం చేసి, వారికి కావాల్సిన కరిక్యులమ్‌ను రూపొందించి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ద్వారా సుమారు 10 లక్షల మందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పించారు. ఏఐ లాంటి అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానం చేసి డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) ద్వారా సుమారు 4 లక్షల మంది పట్టభద్రులకు ఐటీ రంగంలోని ఉపాధి, కోర్సులపై మార్గనిర్దేశం చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో గతేడాది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించి, దేశానికే మోడల్‌గా నిలిచే నైపుణ్య శిక్షణను అందిస్తున్నారు.

'ఐటీ అంటే హైదరాబాదే కాదు– తెలంగాణ మొత్తం' అనేట్టుగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ లాంటి పట్టణాలు, నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించడంపై దృష్టి సారించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తై ఖాళీగా ఉన్న ఐటీ టవర్లలో కొత్త కంపెనీలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. అసంపూర్తిగా నిలిచిపోయిన టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ కంపెనీలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తోంది.

ఐటీ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి, తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దేశంలో అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ 'టీ–హబ్', హార్డ్‌వేర్ ప్రోటోటైపింగ్‌కు దేశంలోనే అతిపెద్ద ల్యాబ్ 'టీ–వర్క్స్' మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 'వీ హబ్'ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బలోపేతం చేస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగాన్ని పెంచి, పౌర సేవలను సమర్థవంతంగా అందించేందుకు 'టీ–ఎయిమ్' పేరిట ప్రత్యేక మిషన్‌ను అమలు చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో టీ హబ్ మార్గనిర్దేశనంలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

సీఎం రేవంత్‌రెడ్డి సమర్థవంతమైన నాయకత్వం, మంత్రి శ్రీధర్‌బాబు పకడ్బందీ కార్యాచరణ ఐటీ రంగ విప్లవానికి తెలంగాణను కేంద్రంగా మార్చాయి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో ఐటీ రంగాన్ని కీలకం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం.

• పి. భానుచందర్‌రెడ్డి
తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి పీఆర్వో

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఇరాన్‌లో మనకు కనిపించని ఇంధనమూ ఉంది!



మానవ చరిత్రలో రాజ్యాలు మొదలైన దగ్గర నుంచి రెండు విషయాలు క్రమం తప్పకుండా కనపడతాయి. రాజ్యరక్షణ.. రాజ్యభక్షణలుగా వాటి గురించి చెప్పుకోవచ్చు. సందర్భానుసారం వీటిల్లో ఏదో ఒకదాంట్లో మునిగిపోయి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయటం పాలకవర్గాలకు పరిపాటి. ప్రజాస్వామ్యాలు, అంతర్జాతీయ చట్టాలు వచ్చిన తర్వాత కూడా ప్రజలకు ఇవి తప్పటంలేదు. రాజ్యరక్షణకు పొరుగు దేశాలను భక్షించక తప్పదనే చాణక్యనీతితో జరిగిన యుద్ధాలను తెలుసుకోటానికి గడిచిపోయిన చరిత్రల్లోకి వెళ్లాల్సిన పని లేదు. ఇప్పటికీ అవి ప్రబలంగానే ఉన్నాయి. యుద్ధాలకు సమర్థనలు మాత్రమే మారుతున్నాయి. రాజ్యం వీర భోజ్యం లాంటి ముతక సమర్థనలు పోయి జాతీయ ప్రయోజనాలు, స్వీయరక్షణ పేరుతో యుద్ధాలు పేట్రేగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికాలు కలిసికట్టుగా ఇరాన్‌పై 12 రోజుల పాటు చేసిన యుద్ధమే ఇందుకు నిదర్శనం.

ఇజ్రాయెల్‌కూ ఇరాన్‌కూ సరిహద్దు తగాదాలు లేవు. రెండిటికీ మధ్య వందల కిలోమీటర్ల దూరం ఉంది. ఇరు దేశాల రాజధానుల మధ్య దూరమే 1770 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు యుద్ధాల చరిత్ర ఉంది. 1948 నుంచి ఏదో ఒక కారణంతో ఆ దేశాలతో తలపడి వాటి భూభాగాలను ఆక్రమించటం, వైదొలగటం ఇజ్రాయెల్‌కు మామూలే. అరబ్–ఇజ్రాయెల్ యుద్ధాల్లో ఇరాన్ ప్రత్యక్ష భాగస్వామి కాదు. మరి ఇరాన్‌తో ఇజ్రాయెల్‌కు ఎందుకు ఇంత శత్రుత్వం? వందలాది యుద్ధ విమానాలతో దాడిచేయటమే కాకుండా, అమెరికాను కూడా రంగంలోకి దించి అణుశుద్ధి కేంద్రాలపై భీకరమైన బంకర్ల విధ్వంసక బాంబులతో విరుచుకుపడటానికి వినిపిస్తున్న సమర్థనల వెనుక అసలు నిజాలు ఏమిటి? ఇరాన్ అణుకార్యక్రమానికి ఒకనాడు పాశ్చాత్యదేశాల ప్రాపకం లేదా? అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఎందుకు తీవ్రశత్రువుగా మారిపోయింది? ముస్లిం దేశాల నడిబొడ్డున తిష్టవేసుకుని తన ఆధిపత్యాన్నీ ఆక్రమణలనూ ఆ దేశాలు కిక్కురుమనకుండా ఆమోదించటానికి ఇజ్రాయెల్ సాగిస్తున్న రణతంత్రం ఎటు దారి తీస్తుంది? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం చరిత్రను వెతికితే అమెరికానే బోనులో నిలబడుతుంది. పాశ్చాత్యదేశాలు చేసిన పాపపు చరిత్రే కనపడుతుంది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీర్మానం ప్రకారం ఇజ్రాయెల్‌తో పాటు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడాలి. రెండిటికీ సరిహద్దులూ అప్పట్లో స్పష్టంగానే నిర్దేశితమయ్యాయి. ఆ తీర్మానం అమలయ్యేలోపలే బలప్రయోగంతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాలను సైతం ఆక్రమించుకోవటంతోనే అసలు సమస్య మొదలైంది. అరబ్ దేశాలు ఆనాడు ఇజ్రాయెల్ ఏర్పాటును మొండిగా వ్యతిరేకించటం ఇప్పటి దృష్టితో చూస్తే వ్యూహాత్మక తప్పిదంగా అనిపిస్తుంది. దానికి మూల్యం మాత్రం పాలస్తీనా ప్రజలు చెల్లించాల్సి వచ్చింది. ఒకటి మాత్రం నిజం. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ఏర్పాటు కాకుండా చూడాలనే వ్యూహంతోనే యూదు ఆధిపత్యవాదులు మొదటి నుంచి పావులు కదిపారు. చివరికి గాజా, వెస్ట్‌బ్యాంక్ భూభాగాలతో పరిమిత పాలస్తీనాను ఏర్పాటు చేయటానికి కూడా ఇజ్రాయెల్ అంగీకరించటం లేదు. గతంలో పాలస్తీనాగా గుర్తించిన భూభాగంలో ఏ ముక్కనూ ఒదులుకోటానికి ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు. నెతన్యాహు సారథ్యంలోని ఇజ్రాయెల్ ప్రభుత్వం.. స్వతంత్ర పాలస్తీనా అన్న భావననే లేకుండా చేయటానికి ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుంటోంది. గాజాలో నరమేధమూ అందుకే సాగుతోంది. మధ్య ప్రాచ్యంలో తిరుగులేని ఆధిపత్యం ఇజ్రాయెల్‌కు ఏర్పడేలా నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు ఇరాన్ శక్తి అడ్డంకిగా కనపడుతోంది. 12 రోజుల యుద్ధమూ అందులో భాగమే.

మతపరంగానో, ఇతర భావజాలంపరంగానో అమెరికా, ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని అంగీకరించని ఏ దేశాన్నైనా అస్థిరం చేయటం దశాబ్దాలుగా అమలవుతోంది. చమురు, సహజవాయువులు సమృద్ధిగా ఉన్న దేశాలను నయానభయాన గుప్పిట్లో పెట్టుకోవటం ఒకప్పుడు బ్రిటన్ చేస్తే రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా ఆ పనిని మొదలుపెట్టింది. మధ్యప్రాచ్య దేశాల మధ్య విభేదాలను ఎగదోయటం, సందర్భానుసారం కొన్నిటిని మిత్రపక్షాలుగా, మరికొన్నిటిని వైరిపక్షాలుగా భావించటం, వాటి రక్షణ పేరుతో యుద్ధాలు చేయటం, తిరుగుబాట్లను ప్రోత్సహించటం అమెరికా విదేశాంగ విధానంలో కీలక వ్యూహంగా మారింది.

ఇరాన్ ఎప్పుడూ పూర్తిగా వలసపాలన కిందలేదు. పూర్తి స్వాతంత్ర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. 2500 సంవత్సరాలుగా పర్షియన్లుగా ఘనచరిత్రను నిత్యం గుర్తుచేసుకునే జాతీయభావన, ఎన్నో దేశాలను ప్రభావితం చేసిన పారశీక సంస్కృతీ సాహిత్యమూ, పదికోట్ల జనాభా, ఫ్రాన్స్‌కంటే మూడింతలున్న భూభాగం, చమురు– సహజ వాయువు ఉత్పత్తిలో మూడో స్థానం, బలమైన రాజ్యవ్యవస్థ ఉన్న ఇరాన్‌ని ఆయుధశక్తితో లొంగదీసుకోవటం తేలికకాదు! మతగురువుల ప్రభావానికి ఎదురొడ్డి నిలిచే పౌరసమాజం అక్కడ ఉంది. వర్సిటీ విద్యార్థుల్లో 63శాతం, కాలేజీ విద్యార్థుల్లో 54శాతం, వైద్యుల్లో 47శాతం, ప్రభుత్వ ఉద్యోగుల్లో 28శాతం, శ్రామికశక్తిలో 33శాతం మహిళలు ఉన్న ఇరానీ సమాజంలో అంతగా ప్రచారంకాని విషయాలు చాలానే ఉన్నాయి.

అణువిద్యుత్తు పేరుతో అణ్వస్త్రాలు తయారుచేయగలిగే స్థాయికి యురేనియాన్ని ఇరాన్ శుద్ధిచేస్తోందని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆరోపిస్తున్నాయి. నిజానికి ఇరాన్ అణుకార్యక్రమం ఈనాటిది కాదు. అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు అన్ని విధాలుగా అనుకూలంగా వ్యవహరించిన ఒకనాటి ఇరాన్ పాలకుడు ముహమ్మద్ రెజాషా పహ్లవి (1941–1979) కాలంలోనే అది పెద్దఎత్తున మొదలైంది. అమెరికా ఆశీస్సులతో రెజాషా 23 పౌర అణు విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ప్రణాళిక రూపొందించారు. సొంత అవసరాలకే కాకుండా చుట్టుపక్కల దేశాలకు కూడా విద్యుత్తు సరఫరా చేయాలనే ఉద్దేశంతో వాటిని ఏర్పాటు చేయబోతున్నట్లు రెజాషా ప్రకటించారు. రెండు కేంద్రాలకు సంబంధించి అప్పట్లోనే పనులు మొదలయ్యాయి. ఇరాన్ లాంటి చిన్న దేశంలో ఒక్కసారిగా 23 అణువిద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు అంగీకరించటం అప్పట్లో అమెరికాకు అసంబద్ధంగా అనిపించలేదు. ఇరాన్ దగ్గర త్వరలో అణ్వస్త్రాలు కూడా ఉంటాయని అమెరికన్ జర్నలిస్టుతో రెజాషా గర్వంగా కూడా చెప్పారు. ఇటీవల ఇజ్రాయెల్ వైమానిక దాడుల సందర్భంగా దెబ్బతిన్నట్లు వార్తల్లోకి ఎక్కిన బుషెహర్ అణువిద్యుత్తు కేంద్రం రెజాషా ప్రకటించిన 23 కేంద్రాల్లో ఒకటి. అపార చమురు, సహజవాయువు నిల్వలున్న ఇరాన్‌కు అణువిద్యుత్తే అవసరం లేదన్న వాదనలు అమెరికా మేధావులు ఇప్పుడు చేస్తున్నారు కానీ ఒకనాడు ఆ ఆలోచనే వాళ్లకి తట్టలేదు. 1970ల్లో అమెరికా విదేశాంగమంత్రిగా హెన్రీ కిసింజర్ ఇరాన్ అణుకేంద్రాల ఏర్పాటుపై తాను ఎలాంటి అభ్యంతరాలూ తెలపలేదనీ, అక్కడ అణ్వస్త్రవ్యాప్తి గురించిన ఆలోచనే తమకు రాలేదనీ ఒక ఇంటర్వ్యూలో చాలా స్పష్టంగా చెప్పారు.

'శాంతి కోసం అణువులు' అంటూ ఎంతో ఆర్భాటంగా ఇరాన్ అణుకార్యక్రమాన్ని అమెరికా, బ్రిటన్‌లు ప్రారంభించాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా, బ్రిటన్ ప్రయోజనాల పరిరక్షకుడిగా రెజాషాకి ఇచ్చిన గుర్తింపు, చేసిన సహాయం అంతా ఇంతా కాదు. 1978 నాటికి ఇరాన్‌లో అమెరికా సైనిక సలహాదారులు, పౌరులు 50 వేలమందికి పైగా ఉండేవారు. వీళ్లందరికీ స్థానిక చట్టాలు వర్తించకుండా ప్రత్యేకహక్కులు కల్పించారు. ఇరాన్ సైనిక వ్యయం 1977 నాటికి 9.5 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పటి భారత్ సైనిక వ్యయం 3.46 బిలియన్ డాలర్లతో పోల్చితే ఇరాన్ వ్యయం ఏ స్థాయిలో ఉండేదో తేలికగా అర్థం అవుతుంది. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలు వ్యయం 1977లో 6 బిలియన్ డాలర్లకు చేరింది. సైనికదళాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. 4,10,000 మంది సైన్యంలో ఉండేవారు. బలమైన సైనిక రాజ్యంగా ఇరాన్ మారటం అమెరికాకు అప్పుడు అవసరమైంది.

ఒక సైనిక రంగంలోనే కాదు ఇతరత్రా కూడా రెజాషా పహ్లవి కాలంలో ప్రభుత్వ కార్యకలాపాలు, సంస్థలూ విపరీతంగా విస్తరించాయి. రాజ్య కేంద్రీకరణ ఉచ్చ స్థాయికి చేరింది. అన్నిటినీ పైనుంచి రుద్దటం ఎక్కువైంది. ఆర్థికపరమైన మార్పులూ చాలా వచ్చాయి. మధ్యతరగతి బాగా పెరిగింది. పట్టణీకరణా వేగం పుంజుకుంది. అణుకేంద్రాలతో పాటు భారీ డ్యాంలూ ప్రాజెక్టులకూ ప్రాధాన్యం పెరిగింది. కొంత మేరకూ భూసంస్కరణలూ అమలయ్యాయి. మరోవైపూ అసమానతలూ పెరిగాయి. రాజకీయ ప్రజస్వామ్యమూ భిన్నాభిప్రాయగళం లేకపోయినా.. ఆర్థికాభివృద్ధి జరిగిపోతే సమాజం ఆధునికమై తన అదుపులో ఉంటుందని రెజాషా భావించారు. ఆ అదుపు లభించకపోవటంతో అసమ్మతిపై ఉక్కుపాదం మోపారు. మరోవైపు ఆధునిక విద్యతో సాంస్కృతిక జీవితంపై మత గురువుల పట్టు బలహీనమయ్యే క్రమం మొదలైంది. పాశ్చాత్య అభివృద్ధిని అనుకరించటంలో మత విశిష్టత అంతరించిపోతుందన్న భయం షియా మత నేతల్లో ఎక్కువైంది.



■ రాహుల్ కుమార్

ఇస్లామిక్ విప్లవం (1979) తదనంతరం పాశ్చాత్య దేశాలు సాగించిన ప్రచారంతో ఇరాన్ ప్రజల ప్రజాస్వామిక ఆందోళనలు, ఉద్యమాలు, ఆధునికత కోసం పడిన తపనలు బాగా మరుగున పడిపోయాయి. 1905–1909 మధ్య ఇరాన్‌లో వచ్చిన రాజ్యాంగ విప్లవం అనేక రాజకీయ మార్పులను తీసుకువచ్చింది. ప్రాతినిధ్య శాసనసభ, అధికారాల విభజన, ఎన్నికలు లాంటివి అప్పుడే వచ్చాయి. ఆసియాలోనే అదొక అరుదైన విప్లవం. రాజ్యాంగబద్ధ రాచరికం పేరుతో రాజు అధికారాలను పరిమితం చేసి జాతీయ అసెంబ్లీకి వాటిని కట్టబెట్టారు. 1921లో కల్నల్ రెజాఖాన్ సైనిక కుట్రతో అధికారాన్ని చేజిక్కించుకుని పహ్లవి పేరుతో రాచరికాన్ని స్థాపించుకున్నా రాజ్యాంగ విప్లవస్ఫూర్తి ఇరానీలకూ అవసరమైనప్పుడల్లా ప్రేరణ శక్తిగానే ఉంది. వామపక్ష భావజాలం, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం ప్రబలంగా ఉండేవి. 1951లో నేషనల్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయిన మొసాదేఖ్.. పెట్రోల్ పరిశ్రమపై గుత్తాధిపత్యం వహిస్తున్న బ్రిటిషు కంపెనీని జాతీయం చేశారు. ఆగ్రహించిన అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు ఇరానీ సైనికాధికారులతో కుమ్మక్కై మొసాదేఖ్‌ను పదవీచ్యుతుడిని చేసి రెజాషాకు సంపూర్ణాధికారాలు కట్టబెట్టారు. ఇరానీ రాజకీయాలను ఆ సంఘటన తీవ్రంగా ప్రభావితం చేసింది. అప్పటి నుంచి అమెరికన్ వ్యతిరేకత ఇరానీల్లో పాతుకుపోయింది. స్వతంత్రత, స్వీయనిర్ణయాధికారం కోసం అగ్రరాజ్యాలను ఎదుర్కోవటం ఇరానీ రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది. అణు కార్యక్రమం కొనసాగించటానికి పట్టుబట్టటం కూడా కొంతమేరకు ఆ సంస్కృతిలో భాగంగానే సాగుతోంది.

స్వతంత్రత, స్వీయనిర్ణయాధికారం కోసం అగ్రరాజ్యాలను ఎదుర్కోవటం ఇరానీ రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది. అణు కార్యక్రమం కొనసాగించటానికి పట్టుబట్టటం కూడా కొంతమేరకు ఆ సంస్కృతిలో భాగంగానే సాగుతోంది.

ఇరాన్ ఎప్పుడూ పూర్తిగా వలసపాలన కిందలేదు. పూర్తి స్వాతంత్ర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. 2500 సంవత్సరాలుగా పర్షియన్లుగా ఘనచరిత్రను నిత్యం గుర్తుచేసుకునే జాతీయభావన, ఎన్నో దేశాలను ప్రభావితం చేసిన పారశీక సంస్కృతీ సాహిత్యమూ, పదికోట్ల జనాభా, ఫ్రాన్స్‌కంటే మూడింతలున్న భూభాగం, చమురు–సహజ వాయువు ఉత్పత్తిలో మూడో స్థానం, బలమైన రాజ్య వ్యవస్థ ఉన్న ఇరాన్‌ని ఆయుధశక్తితో లొంగదీసుకోవటం తేలికకాదు! చరిత్ర స్పృహతో ఇరానీయుల్లో ఉండే సామాజిక చైతన్యం ఒక ఇంధనంలా సమరశీలతను మండిస్తూనే ఉంటుంది. మతగురువుల ప్రభావానికి ఎదురొడ్డి నిలిచే పౌరసమాజం అక్కడ ఉంది. మత రాజ్యాన్నే అదెన్నో మార్పులకు లోనుచేస్తోంది. వర్సిటీ విద్యార్థుల్లో 63శాతం, కాలేజీ విద్యార్థుల్లో 54శాతం, వైద్యుల్లో 47శాతం, ప్రభుత్వ ఉద్యోగుల్లో 28శాతం, శ్రామిక శక్తిలో 33శాతం మహిళలు ఉన్న ఇరానీ సమాజంలో అంతగా ప్రచారంకాని విషయాలు చాలానే ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

కనుమరుగవుతున్న కుటుంబ వైద్యం

భారతరత్న గ్రహీత, ప్రముఖ వైద్యులు, దాత, విద్యావేత్త, చాలాకాలం పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ బి.సి. రాయ్ సేవలను స్మరించేందుకు ప్రతి ఏటా జూలై 1ని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుతారు. ఈ రోజు నాకు వ్యక్తిగతంగా కూడా ముఖ్యమైన రోజు. ఎందుకంటే సరిగ్గా 34 ఏళ్ల క్రితం (1991లో), ఇదే రోజున నేను వైద్యుడిగా పట్టభద్రుడిని అయ్యాను. అంతేగాక తొమ్మిదేళ్ల క్రితం (2016లో), భారతదేశంలో వైద్యులకు లభించే అత్యున్నత గౌరవమైన డాక్టర్ బి.సి. రాయ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నాను. అందువల్ల, ఈ రోజు నాకు ఎంతో ప్రత్యేకం. ప్రస్తుతం మన దేశంలో సమర్థవంతమైన ఆరోగ్య సేవలు ఎంతో కీలకమైనప్పటికీ, ఎంతో నిర్లక్ష్యానికి గురవుతున్న 'ఫ్యామిలీ మెడిసిన్' గురించి నా ఆలోచనలను పంచుకోవాలనుకుంటున్నాను.


ఒకానొక కాలంలో కుటుంబంలో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా మొదట 'ఫ్యామిలీ డాక్టర్' దగ్గరకే వెళ్ళేవారు. కానీ ఇప్పుడు ఈ 'ఫ్యామిలీ డాక్టర్' అనే భావన క్రమక్రమంగా అదృశ్యమవుతున్నది. దాంతో రోగులు చిన్నపాటి సమస్యలకు కూడా నేరుగా ఆసుపత్రులకే పరుగులు పెడుతున్నారు. తద్వారా ఇప్పటికే రోగులతో నిండిపోయిన ఆసుపత్రులపై మరింత భారం పడుతున్నది.

అనేక అభివృద్ధి చెందిన దేశాలలో 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఒక ప్రత్యేక వైద్యశాఖగా పరిగణిస్తారు. అక్కడ ప్రత్యేకమైన పోస్టు గ్రాడ్యుయేట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్స్ ద్వారా ఇందులో శిక్షణనూ అందిస్తున్నారు. భారతదేశంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను ప్రోత్సహించడంతో పాటు, 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఒక ప్రత్యేక స్పెషాలిటీగా అభివృద్ధి చేయాలన్న దిశగా కృషి చేస్తోంది. అయితే ఇప్పటికీ 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఎంబీబీఎస్ స్థాయిలో అండర్ గ్రాడ్యుయేట్ శిక్షణలో భాగంగా చేర్చలేకపోయింది.

భారతదేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌లో మొట్టమొదటి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు 2011లో కేరళ రాష్ట్రం, కొజికోడ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రారంభమైంది. అయితే, ఇప్పుడు 2025లోకి వచ్చేసరికి, దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఫ్యామిలీ మెడిసిన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో అందుబాటులో ఉన్న సీట్లు 150కంటే తక్కువ ఉన్నాయి. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఇది ఆశ్చర్యపరిచే సంఖ్య!

ప్రస్తుతం భారతదేశంలో అందుబాటులో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లలో మెజారిటీ వైద్యులను కొన్ని విభాగాల్లో స్పెషలిస్టులుగా మార్చే దిశగానే కేటాయించబడ్డాయి. ఫలితంగా, పీజీ సీటు పొందలేకపోయిన చాలామంది వైద్యులు విదేశాలకు వెళ్లి ఉన్నతమైన స్పెషలిస్టు శిక్షణ తీసుకుంటున్నారు. మరోవైపు, 'ఫ్యామిలీ మెడిసిన్' పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు దరఖాస్తు చేసేవాళ్ల సంఖ్య తక్కువగా ఉంటున్నది.

ఒకానొక కాలంలో కుటుంబంలో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా మొదట 'ఫ్యామిలీ డాక్టర్' దగ్గరకే వెళ్ళేవారు. కానీ ఇప్పుడు ఈ ఫ్యామిలీ డాక్టర్ అనే భావన క్రమక్రమంగా అదృశ్యమవుతున్నది. దాంతో రోగులు చిన్నపాటి సమస్యలకు కూడా నేరుగా ఆసుపత్రులకే పరుగులు పెడుతున్నారు. భారతదేశానికి స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కానీ, ఫ్యామిలీ డాక్టర్ల సంఖ్యను పెంచడం ఇంతకన్నా ముఖ్యం.




భారతదేశ జనాభాలో 70శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నప్పటికీ, వైద్యులలో 25శాతం కంటే తక్కువమంది మాత్రమే ఈ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. మెట్రో ప్రాంతాల వెలుపల, ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కు సగటున 7,500 మంది రోగులు ఉండగా, అత్యంత దుర్భర ప్రాంతాల్లో ఈ నిష్పత్తి ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కు సగటున 25,000 మందికి పడిపోతున్నది. ఇలా ఫ్యామిలీ డాక్టర్ల కొరత భారతదేశ ఆరోగ్య వ్యవస్థలోని అతి ముఖ్యమైన లోటుగా తయారైంది.

దీనికి పరిష్కారంగా ఈ ఐదు పాయింట్ల అజెండాపై పాలకులు, విధాన నిర్ణేతలు దృష్టి పెట్టాలి: 1. 'ఫ్యామిలీ మెడిసిన్'ను అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతదేశం అంతటా ప్రతి వైద్య కళాశాలలో ఫ్యామిలీ మెడిసిన్ కోసం విభాగాలను ఏర్పాటు చేయాలి. ఈ విభాగంలో శిక్షణను అందించే వైద్య కళాశాలల సంఖ్యను పెంచాలి. 2. భారతదేశానికి స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కానీ, ఫ్యామిలీ డాక్టర్ల సంఖ్యను పెంచడం ఇంతకన్నా ముఖ్యం. ఫ్యామిలీ డాక్టర్ల శిక్షణపై మన దేశం పెట్టుబడులు పెంచాలి. అదే సమయంలో, ఎంబీబీఎస్ కోర్సులో చేరిన యువ విద్యార్థులకు ఫ్యామిలీ మెడిసిన్ భావనపై అవగాహన కలిగిస్తూ, దీనిపై ప్రజాదరణనూ పెంచాలి. 3. భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సదుపాయాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలి. అప్పుడే స్థానికంగా ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు రోగులకు అందుతాయి. దాంతో పాటు, పరీక్షలు చేయించుకోవడం లేదా చికిత్స పొందడానికి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. 4. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం– భారతదేశంలో 1.2 బిలియన్లకు పైగా మొబైల్ ఫోన్ వినియోగదారులు, 850 మిలియన్లకు పైగా స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఉన్నారు. 2026 నాటికి దేశంలో 1 బిలియన్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉంటారని అంచనా. డిజిటల్ టెక్నాలజీలలో భారతదేశం ఇలా ప్రపంచాన్ని ముందుండి నడిపిస్తున్నప్పటికీ, దేశ వైద్యశాలల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రయోజనం వినియోగంలోకి రావటం లేదు. ఈ లోటు తీరేలా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో సాంకేతిక పురోగతులను తీసుకురావాలి. 5. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) మోడల్‌ను మనం భారతదేశంలోనూ అనుసరించవచ్చు. భారతదేశంలో ఎక్కువ శాతం ఆరోగ్య సేవలు ప్రైవేట్ రంగం ద్వారానే అందుతున్నాయి. కనుక, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేయటంలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామిగా తీసుకోవటానికి ఇక్కడ అనుకూలమైన పరిస్థితి ఉన్నది.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకొని 75 సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడేళ్లు గడిచాయి. 'అమృత కాలం'లోకి అడుగుపెట్టిన సందర్భంగా, 2047 నాటికి, అంటే స్వాతంత్ర్యపు 100వ సంవత్సరం నాటికైనా, 'ఫ్యామిలీ డాక్టర్' భావనను బలమైనదిగా, ప్రభావవంతమైనదిగా మార్చాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకుని, ఆ దిశగా స్ఫూర్తిదాయకమైన, అమలు చేయగలిగే, స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకు ఇదే తగిన సమయం.

వైద్య నీతిని, ఆచరణను నిర్దేశించే గ్రీకుల కాలం నాటి హిపోక్రటిక్ ప్రతిజ్ఞలో కీలకమైన అంశం: "రోగికి మేలు చేకూర్చటమే వైద్యుడి అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలి" అన్నది. ఈ మార్గదర్శక నియమాన్ని చిత్తశుద్ధితో పాటించినప్పుడే భారతదేశ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని సమర్థవంతంగా పునర్నిర్మించేందుకు మార్గం సుగమం అవుతుంది.



■ డా. పి. రఘురామ్
సంస్థాపక డైరెక్టర్, కిమ్స్–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్
సంస్థాపకులు & చైర్మన్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్

(నేడు జాతీయ వైద్యుల దినోత్సవం)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA

మంగళవారం 1 జూలై 2025

హలో డాక్టర్...

- కనిపించే దేవుడు వైద్యుడు
- అలుపెరగని సేవలతో ప్రజలకు ప్రాణబిక్ష
- మారుతున్న కాలంలో కత్తిమీద సాముగా మారిన వృత్తి

నేడు డాక్టర్స్ డే

7



శ్రీవాణి (ఫైల్)

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- వాష్‌రూమ్‌లో ఉరి వేసుకున్న వైనం
- తన బిడ్డను దూషించారని పాఠశాల సిబ్బందిపై తండ్రి ఫిర్యాదు
- ప్రిన్సిపాల్ కృష్ణకుమారి సహా ఆరుగురిపై కేసు నమోదు
- ఉదయం ఘటన జరిగితే మధ్యాహ్నం వరకు సమాచారం ఇవ్వని వైనం

పరకాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరకాల మండలం మల్లక్కపేట గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటం విషాదాన్ని మిగిల్చింది. తన బిడ్డ ఆత్మహత్య చేసుకోవడానికి గురుకుల సిబ్బందే కారణమని తండ్రి ఆరోపించడం సంచలనం రేపుతోంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, హౌస్ మాస్టర్ మీరాబాయితో పాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే... పరకాలకు చెందిన ఏకు ఈశ్వర్-మమత దంపతులకు శ్రీవాణి(15), రాజు అనే పిల్లలున్నారు. పదేళ్ల క్రితం మమత మృతి చెందగా, ఈశ్వర్ మరో వివాహం చేసుకున్నాడు. 2020లో మల్లక్కపేట శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శ్రీవాణి 5వ తరగతిలో చేరింది. అప్పటి నుంచి అక్కడే చదువుకుంటోంది. చదువులో చురుకైన విద్యార్థిగా పేరుపొందింది. అయితే సోమవారం ఉదయం 9గంటలకు టిఫిన్ సమయంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో

మిగతా 8వ పేజీలో...

శాయంపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- సొంత భవనాలకు రూ.18.24 కోట్ల నిధులు విడుదల
- ఒక్కో మండలంలో రెండు నిర్మించేలా ప్రణాళిక
- ఉమ్మడి జిల్లాలో 152 అంగన్‌వాడీ భవనాలు
- పూర్తయిన స్థల సేకరణ... త్వరలో పనులు ప్రారంభం

హనుమకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సేవలను మరింత విస్తృత పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో, మరి కొన్ని పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఈ కేంద్రాలన్నింటికి సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. భవనాల నిర్మాణానికి సత్వరమే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని జిల్లా కలెక్టర్లకు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరుకు ఆ ప్రక్రియ పూర్తి చేసి శంకుస్థాపనలకు సిద్ధం చేయాలని సూచించింది. కలెక్టర్ల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు స్థల సేకరణలో నిమగ్నమయ్యారు. ఆయా జిల్లాల పరిధిలో సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. అన్ని జిల్లాల ఐసీడీఎస్ అధికారులు కసరత్తు చేసి ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందనే అంచనాకు వచ్చారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడైతే అన్ని రకాలుగా నిర్మాణానికి వీలుంటుందో అక్కడ నిర్మిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.



మండలానికి రెండు...

ప్రతీ మండలానికి రెండు చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 76 మండలాల్లో 152 అంగన్‌వాడీ భవనాలను నిర్మించనున్నారు. హనుమకొండ జిల్లాలో 28, వరంగల్ జిల్లాలో 26, ములుగు జిల్లాలో 18, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 22, జనగామ జిల్లాలో 26, మహబూబాబాద్ జిల్లాలో 32 కేంద్రాలకు భవనాలను నిర్మిస్తారు. ఒక్కో భవనానికి రూ. 12 లక్షల చొప్పున మంజూరు చేశారు. 152 భవనాలకు రూ.18.24 కోట్లు విడుదల చేసింది. వీటిని ఉపాధి హామీ, స్త్రీశిశు సంక్షేమశాఖ, 15వ ఆర్థిక సంఘం ద్వారా కేటాయించింది. ఈ నెలాఖరులోగా స్థల సేకరణ పూర్తయితే పనులు మొదలు పెడతారు. కొత్త భవనాల్లో పిల్లలకు అనుకూలంగా టాయిలెట్లు, ఆట స్థలాలు, సురక్షితమైన తాగునీటి సౌకర్యం వంటి వసతులు కల్పిస్తారు. స్థల సేకరణ పూర్తయిన చోట స్థానిక ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభింప చేస్తున్నారు.

అద్దె భవనాల్లో...

ఉమ్మడి జిల్లాలో మొత్తం 5121 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 60 శాతం సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలకు అవస్థలు తప్పడం లేదు. చిన్నారులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, పౌష్టికాహారం పంపిణీకి, ఆట వస్తువులు, దస్త్రాలు భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల మధ్య ఇరుకుగా ఉన్న భవనాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. కనీసం బయట వంట వండేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నచోట ఆ భవనాలు

మిగతా 8వ పేజీలో...

స్థలాలను సేకరిస్తున్నాం

జయంతి, డీడబ్ల్యుఓ, హనుమకొండ జిల్లా

భవనాల నిర్మాణానికి గ్రామాల్లో స్థలాలను సేకరిస్తున్నాం. ఎక్కడెక్కడ నిర్మించాలనేది ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చాం. సమస్య తీవ్రత, ప్రభుత్వ భూమి లభ్యత ఆధారంగా నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల స్థల సేకరణ కూడా పూర్తయింది. భవనాల నిర్మాణానికి భూమి పూజలు కూడా జరుగుతున్నాయి. వీలైనంత మేరకు భవనాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 4169 మంది గర్భిణులు, 3424 మంది పాలిచ్చే తల్లులతో పాటు 0-6 నెలల మధ్య వయసుగల పిల్లలు 3100 మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల మధ్య వయసు పిల్లలు 20030, 3 - 6 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పిల్లలు 18515 మంది అంగన్‌వాడీ సేవలను పొందుతున్నారు.

పంపిణీ ముగిసింది...

- లబ్దిదారులకు అందిన మూడు నెలల రేషన్.. ఇక మళ్లీ సెప్టెంబరు కోటానే
- నెల రోజులుగా కిటకిటలాడిన రేషన్ షాపులు
- నిత్యావసర సరుకులు కూడా అందుతాయనే ఆశలు

7



‘మల్చింగ్’ సాగు.. ఎంతో బాగు

7

మిరప, కూరగాయల సాగుకు ఎంతో అనుకూలం

- రైతులకు ఆర్థికంగా లాభదాయకం
- చీడపీడలు, కలుపు నివారణ

విరోధిని వహ్నివాసిని...

శాకంబరీ వేడుకల్లో భద్రకాళి అలంకారం



విరోధిని వహ్నివాసిని అలంకారంలో భద్రకాళి దేవి

వరంగల్ కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఐదో రోజు పూజలో భాగంగా ఉదయం 4గంటలకు సుప్రభాత సేవ అనంతరం అమ్మవారిని కాళీ క్రమాన్ని అనుసరించి విరోధినిగా, శోడషీక్రమాన్ని అనుసరించి వహ్నివాసినిగా అలంకరించారు. విరోధిని అమ్మవారు భక్తులకు శత్రువులపై విజయాన్ని సాధించే విధంగా అనుగ్రహిస్తుందని, వహ్నివాసిని అమ్మవారు కర్మ ఫల ప్రాప్తి కలిగించడమేగాకుండా ఐశ్వర్యాభివృద్ధి కలిగిస్తుందని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. ఆషాఢ శుద్ధ పంచమిని పురస్కరించుకొని శ్రీమాత లలితాంబిక సేవా సమితి వారి ఆధ్వర్యంలో సుమారు 200 మంది మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, వివిధ రకాల ప్రసాదాలు సమర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నెముక

- యువత రాజకీయాల్లోకి రావాలి
- యువజన కాంగ్రెస్ సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక, పార్టీ పటిష్ఠతలో ఈ విభాగానికి కీలక పాత్ర అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని కోడెం కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ సమావేశం

మిగతా 8వ పేజీలో...



ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి

- ఏకగ్రీవంగా 9వ సారి ఎన్నిక
- ఉపాధ్యక్షుడిగా గజ్జ వీరయ్య
- ఘనంగా సత్కరించిన రైతులు

7

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం..

- అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- ఇందిరమ్మ కలలు సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- రాయపర్తిలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్‌దేనని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాయపర్తి మండల కేంద్రంలో రూ.14.17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులను వరంగల్ ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్యశారదలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రూ.8లక్షల కోట్ల అప్పులకు వడ్డీ చెల్లిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఉచిత విద్యుత్, వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ, విద్యార్థుల కోసం డైట్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా సన్న బియ్యం ఇస్తున్నది మన ప్రభుత్వమని, అర్హులందరికీ రేషన్ కార్డులు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతోపాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కూడా ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.

ఈ కార్యక్రమంలో గిడ్డంగుల శాఖ చైర్మన్ నాగేశ్వర్‌రావు, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, జాటోతు హమ్యానాయక్, సత్యనారాయణ, సురేశ్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బొగతకు మాత్రమే అనుమతి ..

వాజేడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి లోని బొగత జలపాతం సందర్శనకు మాత్రమే అనుమతి ఉందని, మిగతా జలపాతాలకు లేదని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని దుసపాటి లొద్ది, వెంకటాపురం మండలంలోని మహితాపురం, ముత్యంధార జలపాతాల సందర్శనకు పర్యాటకులు రావద్దని పేర్కొన్నారు. నీటి లోతు అంచనా లేక సందర్శకులు ప్రాణాలు విడుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

భక్తుల కోసం ఆరు క్వింటాళ్ల ప్రసాదం

శాకంబరీ ఉత్సవాల ముగింపు రోజున పంపిణీకి ఏర్పాట్లు

వరంగల్ కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల ఆరాధ్య దేవత భద్రకాళి ఆలయంలో భారీ ఎత్తున ప్రసాదం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శాకంబరీ ఉత్సవాల ముగింపు రోజున (ఆషాఢ శుద్ధ పౌర్ణమి 10వ తేదీ) ఆలయానికి వచ్చే భక్త కోటికి ఈ ఉచిత ప్రసాదం అందించనున్నారు. 25 సంవత్సరాలుగా ఆషాఢ మాసం శాకంబరీ వేడుకల్లో పౌర్ణమి రోజున భద్రకాళి సేవా సమితి సభ్యులు ఈ మహత్కార్యాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10న 600 కిలోల ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు అందించనున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 30 వేల మంది భక్తులకు ఈ ప్రసాదం అందిస్తామని సమితి నిర్వాహకులు అయిత గోపీనాథ్ తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి బానోతు రూపాదేవి

దేవరుప్పుల. జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దర్తీ అప బగీదారి అభియాన్ పథకంలో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని హన్మకొండ, జనగామ జిల్లా అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి బానోతు రూపాదేవి సూచించారు. సోమవారం ధర్మాపురం జీపీ వద్ద మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడేపు అండాలు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ తరుణ్, మెడికల్ ఆఫీసర్ రవితేజ, ఏఈఓ సంతోష్, సీఎఫ్ఎల్ బ్యాంక్ కౌన్సిలర్ రవివర్మ, పంచాయతీ కార్యదర్శులు అమరేందర్, వెంకటేశ్వర్లు, సంతోషిని, ఉపేందర్, మధు పాల్గొన్నారు.

భూమి పట్టా కావడం లేదని గిరిజన రైతు ఆత్మహత్య

గార్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్ద కృష్ణాపురంలో భూమి పట్టా కావడం లేదని గడ్డిమందు తాగి గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గార్ల ఎస్సై రియాజ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద కృష్ణాపురం చెందిన గంగావత్ మోహన్ (38) అదే గ్రామంలో మహిళా రైతు వద్ద ఆరేళ్ల కిందట 29 గుంటల భూమి కొనుగోలు చేశారు. నాటి నుంచి భూమి పట్టా చేయడానికి అమ్మిన ఆమె సహకరించడం లేదు. అటు రెవెన్యూ అధికారులు అమ్మిన రైతు వస్తేనే పట్టా చేస్తామని ఆఫీస్ చుట్టూ తిప్పుకోసాగారు. ఈ విషయంలో తనకు భూమి పట్టా ఇప్పించాలని బాధితుడైన మోహన్ పెద్ద మనుషులకు విన్నవించుకున్నప్పటికీ ఆ భూమి అమ్మిన మహిళా రైతు ససేమిరా వినకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన గంగావత్ మోహన్ శనివారం సాయంత్రం ఆ భూమి వద్దే గడ్డి మందును తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో రైతు మోహన్‌ను మహబూ బాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు మోహన్‌కు భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై రియాజ్ పాషా తెలిపారు.

హైదరాబాద్ సభకు తరలి రావాలి

గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్టతే లక్ష్యం

వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిట్ల సత్యనారాయణ

దిశా నిర్దేశం చేసే సభ

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిట్ల సత్యనారాయణ

హనుమకొండ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జూలై 4న జరిగే రాష్ట్ర కాంగ్రెస్ సభకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు అధికంగా తరలి రావాలని వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిట్ల సత్యనారాయణ కోరారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి మాట్లాడారు.

గ్రామ స్థాయి శ్రేణులతో మమేకం కావాలనే ఉద్దేశంతో పార్టీ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తదితర అధినేతలు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 500 మంది తరలి రావాలని సూచించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి సభ ఉద్దేశాన్ని, తరలింపు చర్యలు చేపట్టేందుకు వరంగల్‌కు వచ్చినట్లు పేర్కొన్నారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్టత, నాయకత్వ బాధ్యతల నిర్వహణ, పార్టీ గుర్తింపు అంశాలతో సాగే సభ శ్రేణులకు దిశా, నిర్దేశం చేయనుందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభలో సవివరంగా వెల్లడిస్తారన్నారు. పార్టీ కోసం కష్టించి పని చేసే వారికి భరోసా ఇస్తారని తెలిపారు.

సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ పార్లమెంట్ కో-ఇన్‌చార్జీలు దుద్దిళ్ల శ్రీను, శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, టీపీసీసీ నాయకుడు పులి అనిల్‌కుమార్, వీసం సురేందర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు డీపీఎంలు బదిలీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఇద్దరు డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)లు బదిలీపై వెళ్లారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నళిని నారాయణ జనగామ జిల్లాకు, రాజు ములుగు జిల్లాకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో వరంగల్ నుంచి డీపీఎంగా శ్రీకాంత్, ఖమ్మం నుంచి బానోత్ దర్గయ్యలు బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు వస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

మట్టెవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మచిలీబజార్ ప్రాంతానికి చెందిన ఎండీ రహబ్ అలీఖాన్ (19) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆదివారం రాత్రి వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ గేటు సమీపంలో తన మిత్రులతో కలిసి టీ తాగుతుండగా వర్షం కారణంగా టీ డబ్బాకు విద్యుత్ సరఫరా అయి అలీఖాన్ పడిపోయాడు. మిత్రులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. టీ షాపు యజమాని ఎండి.అజీమ్ నిర్లక్ష్యం వల్లే అలీఖాన్ మృతి చెందాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తండ్రి ఇస్మాయిల్ అమన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టెవాడ సీఐ గోపి కేసు నమోదు చేశారు.

పాత, కొత్త తారతమ్యాలు లేవు

అందరం కాంగ్రెస్ కుటుంబ సభ్యులమే..

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పాత కొత్త అనే తారతమ్యాలు లేవని, అందరు కాంగ్రెస్ కుటుంబ సభ్యులేనని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. సోమ వారం మండల కేంద్రంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సమావేశానికి ప్రతీ మండలం నుంచి 50మంది చొప్పున తరలివెళ్లాలన్నారు. ప్రతీ గ్రామం నుంచి పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని, పార్టీ ఎవరిని ఎంపిక చేసిన కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నావన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల్లో ఉంటూ విజయావకాశాలు ఉన్న వారికే సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పీసీసీ పరిశీలకులు చీట్ల సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, ధర్మారావు, మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ రాంబాబు, పార్టీ మండలాధ్యక్షులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, నాయకులు బెలిదె వెంకన్న పాల్గొన్నారు

డబ్బులివ్వలేదనే కోపంతోనే..

తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు

కుంటపల్లి ఘటనలో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

వివరాలు వెల్లడించిన పర్వతగిరి సీఐ రాజగోపాల్



విలేకరుల ఎదుట సతీశ్‌ను ప్రవేశ పెట్టిన పోలీసులు

సంగెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అడిగిన డబ్బులు ఇవ్వలేదనే కోపంతోనే కొడుకు తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడని పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 28 అర్ధరాత్రి సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో ముత్తినేని వినోదపై ఆమె కుమారుడు సతీశ్ పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈ కేసు వివరాలను సోమవారం సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాకు వెల్లడించారు. బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.5లక్షలను విడిపించి ఇవ్వాలని కొంత కాలంగా తల్లి వినోద, తండ్రి సాంబయ్యలను సతీశ్ వేధిస్తున్నాడు. ఇతని బాధ పడలేక పెద్దలను ఆశ్రయించడంతో సతీష్‌ను వేరే చోట నివాసం ఉండాలని సూచించారు. దీంతో సతీష్ కుటుంబంతో గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో ఉంటున్నాడు. తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని మనసులో కక్ష పెంచుకున్న సతీష్ శుక్రవారం రాత్రి బాటిల్‌లో పెట్రోల్ నింపుకొని వెళ్లి ఆరుబయట నిద్రిస్తున్న తల్లిపై పోసి నిప్పటించి పారిపోయాడు. దీంతో తండ్రి సాంబయ్య చుట్టుపక్కన గల వారిని పిలిచి వినోదను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం చింతలపల్లి రైల్వే గేటు సమీపంలో సతీష్‌ను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సంగెం ఎస్సై నరేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏలకు పెరుగుతున్న డిమాండ్

వ్యాపార లావాదేవీల్లో చార్టర్డ్ అకౌంటెంట్లదే కీలక పాత్ర - నేడు చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం చార్టర్డ్ అకౌంటెంట్ డేను జూలై 1వ తేదీన నిర్వహిస్తారు. మన దేశంలో చార్టర్డ్ అకౌంటెంట్ల కోసం కోర్సులు, పరీక్షలను నిర్వహించి సీఏల రిజిస్ట్రేషన్ చేసే ఐసీఏఐను 1949వ సంవత్సరంలో జూలై 1న ఏర్పాటు చేశారు. అందుకే జూలై 1న సీఏ డేగా సెలబ్రేట్ చేసుకుంటారు. అన్ని వ్యాపారాలను ఆడిటింగ్‌ను సీఏలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కాలంలో సీఏలకు బోలెడన్ని ఉపాధి అవకాశాలు ఉన్నాయి. సీఏ ద్వారా అకౌంట్స్, ట్యాక్స్ ఆర్థిక రంగాల్లో నిష్ణాతులైన వారు తయారు అవుతున్నారు. గతంలో కంటే నేడు చాలా మంది సీఏ కోర్సు వైపు మొగ్గుచూపుతున్నారు. సీఏగా గుర్తింపు పొందిన వారికి ఈ రంగంలో విస్తృతంగా ఉపాధి దొరుకుతుంది. దేశ, విదేశాల్లో అత్యధిక వేతనంతో సీఏలకు డిమాండ్ ఉంది. మల్టీనేషనల్ కంపెనీల్లో సీఏలకు లక్షల రూపాయలు వేతనంగా చెల్లిస్తున్నారు. వరంగల్ నగరంలోని ఐసీఏఐ బ్రాంచి ఏర్పాటుతో జిల్లాకు చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులకు కూడా సీఏ కోర్సులో చేరేందుకు అవకాశం ఏర్పడింది. హైదరాబాద్ తరువాత ఉత్తర తెలంగాణ తలమానికంగా ఉన్న వరంగల్ నగరంలో ఐసీఏఐ బ్రాంచిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

చార్టర్డ్ అకౌంటెంట్లదే కీలక పాత్ర

ప్రాజెక్టు నివేదికలు తయారు చేయడం, ఖర్చులను నియంత్రించడం, వివిధ సంస్థల్లో ఆర్థిక మోసాలను కనిపెట్టి వాటి నివారణకు చర్యలు సూచించడం సీఏల బాధ్యతలు, ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో కీలకపాత్ర పోషిస్తున్న సీఏలు చాలా మందే ఉన్నారు. స్వతంత్రంగా ఫర్మ్ ప్రారంభించి ఆడిటింగ్, టాక్స్ ఫైలింగ్, ఫైనాన్షియల్ కన్సల్టేన్సీ సేవలు అందించవచ్చు. ఇదే కాకుండా కార్పొరేట్ కంపెనీల్లో సీఎఫ్‌వో, ఫైనాన్స్ మేనేజర్, ఇర్నల్ ఆడిటర్ వంటి హయ్యర్ పోస్టుల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

చార్టర్డ్ అకౌంటెన్సీ గౌరవప్రదమైంది

తిప్పర్తి రాఘవరెడ్డి, చార్టర్డ్ అకౌంటెంట్



చార్టర్డ్ అకౌంటెన్సీ అనేది అత్యంత గౌరవప్రద, విశ్వసనీయమైన వృత్తులలో ఒకటి. ఈ కోర్సు విద్యార్థికి కేవలం లెక్కల శాస్త్రన్నే కాదు వ్యాపార నైపుణ్యం, ఆడిట్, పన్నులు, కార్పొరేట్ లా వంటి విభిన్న రంగాల్లో జ్ఞానాన్ని అందిస్తుంది. చిన్న వ్యాపారాల నుంచి మల్టీనేషనల్ కంపెనీల వరకు ప్రతీ స్థాయిలో ఆర్థిక పరిపాలనకు సీఏల అవసరం ఉంది. సీఏ కోర్సు సాధనలో క్రమశిక్షణ, పట్టుదల, పరిశ్రమ అవసరం. కానీ ఒక్కసారిగా కోర్సు పూర్తయిన తరువాత జీవితాంతం గుర్తింపు ఇచ్చే స్థాయి ఉంటుంది.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

కేయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల నిరసన



బైఠాయించిన నిరసన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ భూములను ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించవద్దని, వర్సిటీ భూములను అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మించి కాపాడాలని సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థి సంఘాల నేతృత్వంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లలో కూడిన వినతి పత్రాన్ని వర్సిటీ అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు వర్సిటీ భూములను కేటాయిస్తూ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అన్యాక్రాంతం అవుతున్న భూముల హద్దులను గుర్తించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో కబ్జాలకు గురైన భూములను కాపాడాలని అన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు నాగార్జున, కామగోని శ్రావణ్, మర్రి మహేశ్, జెట్టి రాజేందర్, జయసూర్య, శివప, మధు, సాయి, సావిత్రి, అనిల్, రోహిత్, రాజు,శివాజీ, శ్రీజిత్ పాల్గొన్నారు.

ఎంఏ తెలుగు ప్రవేశాల గడువు 7 వరకు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం 2025-26 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి ఆలస్య రుసుముతో ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9989139136, 9989417299 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఎంఏ తెలుగు తరగతులు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం 2024-25 సంవత్సరానికి సెకండ్ ఇయర్ ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు మూడో సెమిస్టర్ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తరగతులకు తప్పనసరిగా హాజరు కావాల్సిందిగా సూచించారు.

సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం

గుడిసెవాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

న్యూశాయంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఐ హనుమకొండ ఉత్తర మండల 2వ మహాసభ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భిక్షపతి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తుందని, ప్రజా, కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లిం మైనారిటీ వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ ముస్లింలపై, రైతులపై, దళితులపై దాడులు కొనసాగిస్తూ ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ పేరిట మారణహోమం సృష్టిస్తుందన్నారు. పేదలకు, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమకొండ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ఏ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, నాయకులు దామెర సుదర్శన్, అలువాల రాజు, రాంగోపాలచారి, జూకంటి పద్మ, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ఉత్తర మండల సమితి ఎన్నిక

హనుమకొండ ఉత్తర మండల సమితి నూతన కార్యదర్శిగా ఎన్ఏ స్టాలిన్, సహాయ కార్యదర్శులుగా గుంటి రాజేందర్, దామెర సుదర్శన్, కోశాధికారిగా అలువాల రాజులతో పాటు 25 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మరో అండర్ రైల్వే బ్రిడ్జీని నిర్మించాలి

రైల్వే అధికారులకు ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి



డీఆర్ఎంకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మూడో రైల్వే లైన్ పనుల నేపథ్యంలో రైల్వే గేటు మూసి వేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అందుకు శాశ్వత పరిష్కార మార్గంగా ఆప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జీ నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే నిలయంలో డీఆర్ఎం భారతీష్‌కుమార్‌జైన్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి నిత్యం రైళ్లలో అనేక మంది దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని ప్రయాణికుల సౌకర్యార్థం జీటీ, ఏపీ, వందేభారత్, రప్తిసాగర్, హిమసాగర్, సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మానుకోట రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కేసముద్రం మండలం అన్నారం గ్రామంలో అండర్ బ్రిడ్జీ మరమ్మత్తులకు సంబంధించిన పనులు చేయాలని చెప్పారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు తెలిపారు.

కేయూ సోషల్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ సురేశ్‌లాల్

కేయూ క్యాంపస్ జూన్ 30, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సురేశ్‌లాల్‌ను డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సురేశ్‌లాల్ రెండేళ్ళ పాటు డీన్‌గా కొనసాగుతారు. ప్రస్తుతం డీన్‌గా వ్యవహరిస్తున్న హిస్టరీ విభాగం ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ పదవీకాలం పూర్తికావడంతో సురేశ్‌లాల్‌ను నియామించారు. సురేశ్‌లాల్ ఆర్ట్స్ విభాగాల ఇన్‌చార్జి డీన్‌గానూ కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు సురేశ్‌లాల్‌కు వర్సిటీ పరిపాలన భవనంలో ఉత్తర్వులను అందచేసి అభినందించారు. డీన్‌గా ప్రొఫెసర్ సురేశ్‌లాల్ నియామితులు కావడం పట్ల వర్సిటీ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, స్కాలర్స్ అభినందనలు తెలిపారు.

ఇంగ్లీష్ విభాగం హెడ్‌గా మేఘనరావు..

కేయూ ఇంగ్లీష్ విభాగం హెడ్‌గా డాక్టర్ ఆర్. మేఘనరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ విభాగం హెడ్‌గా పనిచేసిన డాక్టర్ బి.దీపాజ్యోతి పదవీకాలం పూర్తికావడంతో ఆ స్థానంలో మేఘనరావును నియమించారు.. కాగా మేఘనరావు రెండేళ్ళపాటు పదవీలో కొనసాగుతారు. పలువురు అభినందలు తెలిపారు.



హలో.. డాక్టర్

- కనిపించే దేవుడు వైద్యుడు
- అలుపెరగని సేవలతో ప్రజలకు ప్రాణబిక్ష
- మారుతున్న కాలంలో కత్తిమీద సాముగా మారిన వృత్తి
- నేడు డాక్టర్స్ డే

వైద్యో నారాయణో హరి.. అనగా వైద్యుడు దేవుడి తో సమానమని అర్థం. కనిపించే దేవుడు రోగికి ప్రాణం పోసి నిండుజీవితం ప్రసాదిస్తాడు. రోగి పరేషాన్‌కు ఏ ఆపరేషన్ చేయాలో అతడికే తెలుస్తుంది. నాడి పట్టి గుండె గుబులును గుర్తించి దిగుళ్లను దూరం చేసే కనిపించే దేవుడు వైద్యుడు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ప్రమాదాల్లో పడిన జీవితాలకు పునర్జన్మ ఇస్తాడు. మంగళవారం (జూలై 1) జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..


మహబూబాబాద్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది

మహబూబాబాద్ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన వృత్తిలో విశేష సేవలు అందిస్తున్న వైద్యులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుంది. భయంకరమైన వ్యాధులు వచ్చినా వారివద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే భయపడుతుంటారు. అలాంటి రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేసేది కేవలం వైద్యులు మాత్రమే. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చివరకు కూలీలకు సెలవులు ఉంటాయేమో కానీ.. వైద్యులకు మాత్రం తీరికే ఉండదు. పిల్లాపాపలతో గడిపేందుకు, కుటుంబ సభ్యులకు సమయం వెచ్చించేందుకు అవకాశాలు తక్కువ.

మానసిక ఒత్తిడి ఎక్కువే..

డాక్టర్లు వ్యక్తిగత జీవితాల్లో మానసిక ఒత్తిళ్లు ఎక్కువే ఉంటున్నాయి. వృత్తిలోని సాదకబాదకాలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో వైద్యులు అదే వృత్తిలో ఉన్న వారినే జీవిత భాగస్వామిగా ఎంచుకుంటున్నారు. రోజంతా రోగుల సేవలో కనిపించే వీరు వేడుకలు, పండుగల్లో కనిపించడం చాలా అరుదు. అన్నిటిని త్యజించి వైద్య వృత్తిని ఎంచుకుంటారు. అందులో ఇబ్బందులైనా ఎదుర్కొంటారు. కానీ ఇతరులకు ఎక్కడ చెప్పిన దాఖలాలు లేవు. అలాంటి వైద్యులను గౌరవించాల్సి బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉంది.

విస్తరిస్తున్న వైద్య సేవలు

ఒకప్పుడు వైద్య సేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేది. కానీ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కేవలం సాధారణ వైద్యులే కాకుండా వైద్య నిపుణులు సైతం మండల కేంద్రాలకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా అన్ని సదుపాయాలున్న ఆస్పత్రులు క్రమంగా విస్తరిస్తున్నాయి. హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన మల్టీ స్పెషాలిటీ సేవలు నేడు గ్రామీణ చెంతకు చేరాయి. ప్రభుత్వ ఆస్పత్రులు సైతం ఆధునికతను సంతరించుకుంటున్నాయి. మెరుగైన సేవలు అందిస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారు.

డాక్టర్స్‌డే నేపథ్యం

ప్రముఖ వైద్యుడు పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బాదన్ చంద్రామ్ పుట్టినరోజున దేశంలో డాక్టర్స్ డేగా నిర్వహిస్తున్నారు. రాయ్ 1882 జులై 1న జన్మించారు. కోల్‌కత్తా మెడికల్ కాలేజీలో వైద్యం డిగ్రీ పొందిన ఆయన, లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్యసేవలు ప్రారంభించారు. కోలకత్తా మెడికల్ కాలేజీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్య వృత్తిలో విశేష సేవలు అందించిన ఆయన 1962 జులై 1వ తేదీనే కన్నుమూశారు. దీంతో ఆయన సేవలకు గుర్తింపుగా 1961 భారతరత్న అవార్డుతో సత్కరించిన ప్రభుత్వం బాదన్‌చంద్రామ్ జయంతి, వర్థంతిని డాక్టర్స్ డేగా జరుపుకోవాలని సూచించింది. అలా 1961 నుంచి మన దేశంలో ప్రతీ జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

చేదు అనుభవాలు..

డాక్టర్లకు ఆదివారం అనేదే లేదు.. ఆనందాలు లేవు.. ఎమర్జన్సీ కేసు వచ్చిందంటే ఎక్కడ ఉన్నా సరే పరిగెత్తుకుంటూ వెళ్లాల్సిందే. రోగి ప్రాణాలను కాపాడేందుకు వ్యక్తిగత జీవితాలు త్యాగం చేస్తుంటారు. అలాంటి వారు ఒక్కోసారి చేదు అనుభవాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఆరోగ్య పరిస్థితి విషమించో.. మరే కారణాల వల్ల రోగి మృతి చెందితే బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేయడం, దాడులకు దిగడం అక్కడక్కడ జరుగుతాయి. ఫలితంగా వైద్య సేవలకు త్యాగాలకు గుర్తింపు లభించకుండా పోతుంది.



రోగి ప్రాణాలు కాపాడటమే ముఖ్యం

లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, సీనియర్ వైద్యుడు

వైద్య వృత్తిలో ఉన్న ఏ వైద్యుడైనా రోగి ప్రాణాలు కాపాడేందుకే ప్రయత్నం చేస్తాడు. కొన్ని సందర్భాల్లో చిన్నచిన్న తప్పిదాల వల్ల రోగి మృతి చెందితే.. బంధువులు క్షణికావేశంలో వైద్యులపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదు. నాలుగు దశాబ్దాల నుంచి వేలాది మంది రోగులకు చికిత్స అందించాను. ప్రజలకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

వైద్య వృత్తిలో ఎంతో తృప్తి..

- రాంరెడ్డి, ఎంఎస్ జనరల్ ఫిజీషియన్



వైద్య వృత్తిలో తృప్తి లభిస్తోంది. రోగులకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇష్టంగా ఎంచుకున్న వైద్య వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. ఒక్కోసారి కొందరు రోగులు కొన ఊపిరితో వస్తుంటారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా ప్రాణం గాలిలో కలిసిన ఘటనలు ఉన్నాయి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ గ్రామీణ ప్రజలకు సేవలు అందించడం గర్వంగా భావిస్తున్నాను.


నర్సంపేట మండలం మాధన్నపేట శివారులో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట

పంటలకు ఊపిరి

- వర్షపు జల్లులతో అన్నదాతలకు ఊరట
- పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు జీవం
- ఇంకా మొదలుకాని వరి నారుమళ్లు

నర్సంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట కలిగించగా పంటలకు ఊపిరిపోసినట్లయింది. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు నర్సంపేట డివిజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర వాణిజ్యపంటలకు జీవం పోసినట్లయింది.గత కొద్ది రోజులుగా వర్షాలు కురియక ఎండలు మండిపోవడంతో తొలకరి వర్షాలకు పులకరించి విత్తిన పత్తి, మొక్కజొన్న, వేరుశనగ విత్తనాలు మొలకెత్తుతాయోలేదోనని కొంతమంది రైతులు మొలకెత్తిన వాణిజ్యపంటల మొక్కలు వాడిపోతాయేమోనని రైతులు ఆందోన చెందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షపు జల్లులు, ఒక మోస్తారు వర్షాలు గత మూడు రోజులుగా కురుస్తుండడంతో రైతులకు పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. మొలకెత్తిన వివిధ రకాల పంటల మొక్కలకు వర్షాలు ఊపిరి పోయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ మొదటి వారంతో వర్షాలు కురియగంతో దుక్కులు దున్ని విత్తనాలు విత్తుకునే పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. తదుపరి వరుణుడు ముఖం చాటేయడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తుతాయోలేదోనని, మొలకెత్తిన మొక్కలు ఎండిపోతాయోనని ఆందోళన చెందుతున్న తరుణంలో వర్షపు జల్లులు కురుస్తుండడంతో ఈ సారి పత్తి, మొక్కజొన్న వేరుశనగ తదితర పంటలు గట్టెక్కుతాయని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో లక్షా 34 వేల 800 ఎకరాల్లో పత్తి సాగువతుండగా నర్సంపేట డివిజన్‌లో 54 వేల ఎకరాల్లో సాగవుతుంది.

మొక్కజొన్న జిల్లాలో సుమారు పదివేల ఎకరాల్లో సాగవుతుండగా నర్సంపేట డివిజన్‌లో 4వేల 800 ఎకరాల్లో సాగవుతుంది. వేరుశనగ 899 ఎకరాల్లో సాగవుతుంది వరి ఇతర పంటలు 70వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. కురుస్తున్నా వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరి నారుమళ్లు ఆలస్యం

చెరువుల్లోకి ఆశించిన మేరకు నీరు చేరుకోక పోవడంతో వరి నారుమళ్ళు ఆలస్యమయే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై 15 వరకు వరినారుమళ్ళు పోసుకునే పనులు 70 శాతం పూర్తికావాల్సి ఉండేది, వర్షాల లేమి కారణంలో ఆలస్యమవుతుంది. జూలై నెలాఖరు వరకు నారుమల్లు పోసుకునే అవకాశాలు ఏర్పడుతాయని రైతులు ఆశిస్తున్నారు.

పంపిణీ ముగిసింది

- లబ్ధిదారులకు అందిన మూడు నెలల రేషన్
- ఇక మళ్లీ సెప్టెంబరు కోటానే..
- నెల రోజులుగా కిటకిటలాడిన రేషన్ షాపులు
- నిత్యావసర సరుకులు కూడా అందుతాయనే ఆశలు


రేషన్ షాపుల వద్ద బారులు తీరిన జనం (ఫైల్)

హనుమకొండ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల ద్వారా మూడు నెలల సన్న బియ్యం పంపిణీ ముగిసింది. తెల రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న సంగతి విధితమే. వర్షాకాలం, వరదలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కోటాను ఒకేసారిగా జూన్ నుంచి ఆగస్టు రేషన్ బియ్యాన్ని లబ్దిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుంచి లబ్ధిదారులకు బియ్యాన్ని సరఫరా చేయడం, 30వ తేదీతో ముగియడం జరిగింది. మొత్తంగా నెల రోజుల పాటు మూడు నెలల కోటాగా జిల్లాలో 13165.681 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసింది.

నెల రోజులుగా కిటకిట

మూడు నెలల సన్న బియ్యం కోటా పంపిణీ జరగడంతో లబ్ధిదారులతో రేషన్ షాపులు కిటకిటలాడాయి. గతానికి భిన్నంగా రేషన్ షాపుల వద్ద లబ్దిదారులు బారులు తీరారు. జూన్ మాసం ప్రథమార్థంలో అయితే జనం ఉదయం 6 గంటలకే రేషన్ షాపుల వద్ద క్యూ కట్టారు. అంతే కాదు లబ్ధిదారులు సూర్యోదయానికి ముందే రేషన్ షాపుల వద్దకు చేరుకొని వరుసలో ఉన్నట్లుగా సంచులు, ఇతర గుర్తులు పెట్టి వెళ్లారు. ఎప్పుడూ లేని రీతిలో రేషన్ షాపుల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయడం గమనార్హం. జూన్ 20వ తేదీ నుంచి లబ్ధిదారుల సందడి క్రమంగా తగ్గింది. మొత్తంగా లబ్ధిదారులకు మూడు నెలల బియ్యం సరఫరా ముగియడంతో అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. అయితే ఈకెవైసీ, ఇతరాత్ర సాంకేతిక సమస్యలు నెలకొనడంతో డీలర్లు, లబ్ధిదారులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తగా నమోదైన లబ్ధిదారులకు బియ్యం అందకుండా ఇబ్బందులు ఏర్పడ్డాయి. మరోసారి పంపిణీ సమయానికి సాంకేతిక సమస్యలు తొలుగుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇక మళ్లీ సెప్టెంబర్‌లోనే..

రేషన్ షాపులు మళ్లీ సెప్టెంబరు మాసంలోనే బియ్యాన్ని పంపిణీ చేయనున్నాయి. మళ్లీ రేషన్ షాపులకు ఆగస్టు 20వ తేదీ నుంచి సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు బియ్యాన్ని సరఫరా చేయడం ఆ తరువాత సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగనుంది. దేశ చరిత్రలోనే మూడు నెలల బియ్యం పంపిణీ ఒకేసారి చేపట్టడం తొలిసారిగా నిలిచింది. గతంలో వరదలు, వర్షాలు దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపుల కొన్ని రోజులు ఎక్కువగా తెరవడం జరిగిందే కానీ బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయడం మాత్రం ఇదే ప్రథమం కావడం విశేషం.

నిత్యావసర సరుకులపై ఆశలు

సెప్టెంబరు నాటికి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు కూడా అందుతాయనే ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయంలో అమ్మహస్తం ద్వారా 9 నిత్యావసర సరుకులు తెల్ల రేషన్ కార్డుదారులకు అందాయి. కొద్ది నెలల క్రితం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు అధికారులతో సమీక్ష జరిపారు. ఈ క్రమంలో సెప్టెంబరు నాటికి సన్న బియ్యంతో పాటు 9 నిత్యావసర సరుకులు మళ్లీ తీసుకోవచ్చనే ఆశలు లబ్ధిదారుల్లో నెలకొన్నాయి.

సీపీని కలిసిన ఏఎస్పీ శుభం ప్రకాశ్

వరంగల్ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శుభం ప్రకాశ్ సోమవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరుపేదలకు సత్వరమే న్యాయం అందించే విధంగా కింది స్థాయి అధికారులపై పర్యవేక్షణ ఉండాలని ఏఎస్పీకి సూచించారు.


సీపీకి మొక్కను ఇస్తున్న ఏఎస్పీ

'మల్చింగ్' సాగు.. ఎంతో బాగు

- మిరప, కూరగాయల సాగుకు ఎంతో అనుకూలం
- రైతులకు ఆర్థికంగా లాభదాయకం
- చీడపీడలు, కలుపు నివారణ

నర్మెట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడులు తగ్గి మిగులు ఏర్పడేలా నూతన వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం ప్రవేశ పెడుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను రైతులు ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగానే పలువురు రైతులు పంటల సాగులో మల్చింగ్ పద్ధతిని ఉపయోగించి పంటలు సాగు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా మిర్చి పంట సాగులో మల్చింగ్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. మల్చింగ్ విధానంతో మిరప తోటలు గాలికి, వర్షాలకు దెబ్బతినకుండా ఉండడమే కాకుండా మొక్కలు ఏపుగా వెడల్పుగా పెరుగుతాయని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. మిరప పంటలకు, కూరగాయల సాగుకు ఈ పద్ధతి చాలా అనుకూలంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

కలుపు నియంత్రణ

మల్చింగ్ పద్ధతి ద్వారా కలుపు మొలకెత్తడానికి అవసరమైన కాంతిని నిరోధించడం ద్వారా కలుపు ఎక్కువగా పడకుండా ఉంటుంది. దీంతో కూలీల ఖర్చు తగ్గడంతో పాటు కలుపు మందులు పిచికారి చేయకపోవడంతో పర్యావరణం కూడా కాలుష్యంగా మారకుండా ఉంటుంది.


నర్మెటలో మల్చింగ్ ఏర్పాటుతో సాగు చేస్తున్న మిరప తోట

అనేక ప్రయోజనాలు

మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేస్తే కూలీల ఖర్చు తగ్గడంతో పాటు పెట్టుబడి భారం తగ్గి దిగుబడి పెరుగుతుంది. మల్చింగ్ కవర్ కింద డ్రిప్ పైపులను ఏర్పాటు చేయడంతో మొక్కకు సక్రమంగా సరియైన సమయంలో నీటిని అందించడానికి అవకాశం ఉంటుంది. భూమిలోని తేమ ఆరిపోకుండా ఉంటుంది. దీని ద్వారా నీటిని ఆదా చేసుకోవచ్చు. కలుపు మొక్కలు బెడద తగ్గుతుంది. వేరు వ్యవస్థ దృఢంగా మారి మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. వర్షపు నీటికి భూమిపై కోతకు గురికాదు. సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన పంటలు ఎరువులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటాయి. గాలి వెలుతురు సరిగా అందడం వల్ల నేలలో దాగి ఉన్న క్రిమికీటకాలు, తెగుళ్ల వ్యాప్తికి కారణమైన సూక్ష్మజీవులు నశిస్తాయి.

పంట వ్యాధుల తగ్గింపు

పంటలను మల్చింగ్ కవర్‌లు అమర్చడం ద్వారా పంటలకు వ్యాధులు వచ్చే అవకాశం తగ్గుతుంది. నేల తేమ స్థాయిలను స్థిరంగా ఉంచడం వలన మొక్కలకు ఒత్తిడిని తగ్గిస్తుంది. హనికరమైన వ్యాధికారకాలను సమర్థవంతంగా నిరోధిస్తుంది.

మల్చింగ్ షీట్‌కు యాభై శాతం సబ్సిడీ

మల్చింగ్ విధానంలో సాగు చేస్తే మల్చింగ్ షీట్ కోసం ఒక ఎకరానికి రూ. 16 వేలు ఖర్చు అవుతుండగా అందులో రూ. 8వేలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. యాభై శాతం సబ్సిడీ ఉండడంతో రైతులకు ఆర్థిక సాయం కూడా అందుతుంది.

కలుపు బాధ తప్పింది

ప్రజ్ఞాపురం శ్రీనివాస్ రైతు నర్మెట



రెండెకరాల్లో మల్చింగ్ చేసి మిర్చి పంటను సాగు చేస్తున్నాను. డ్రిప్ పైపులు ఏర్పాటు చేసి మల్చింగ్ పేపర్ పరచి మొక్కలను నాటాను. సాధారణ సాగుకు మల్చింగ్ సాగుకు తేడా ఉంది. కలుపు బాధ తప్పింది. నేను చేసిన మల్చింగ్ విధానాన్ని చాలా మంది రైతులు చూసి వెళ్తున్నారు.

ఆలయాల కంట్రిబ్యూషన్ జమ చేయాలి

- డీడీఎన్ అర్చకులకు వేతనాలు చెల్లించాలి
- తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ
- ఈవో భాస్కర్ పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సభ


భాస్కర్‌ను సత్కరిస్తున్న ఉపేంద్రశర్మ, ఏసీ సునీత

హనుమకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ధూప దీప నైవేద్య అర్చకులకు వేతనాలు చెల్లించేందుకు వీలుగా కార్యనిర్వహణ అధికారులు (ఈవో) త్వరగా తమ దేవాలయాల నుంచి కంట్రిబ్యూషన్ రూపంలో నిధులను దేవాదాయశాఖకు అందజేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు. సోమవారం దేవాదాయ శాఖ వరంగల్ జోన్ కార్యాలయంలో లష్కర్ బజార్ రామ్ మందిర్ ఈవో మిట్టపెల్లి భాస్కర్ పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ డీడీఎన్ అర్చకులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనాన్ని ప్రస్తావించారు. 6 ఏబీసీ దేవాలయాల నుంచి కాంట్రిబ్యూషన్‌ను దేవాదాయ శాఖ వసూలు చేసి అర్చక వెల్ఫేర్‌లో జమ చేస్తేనే ధూప దీప నైవేద్య అర్చకులకు వేతనాలు వస్తాయనీ, మార్చి తర్వాత బడ్జెట్‌లో పొందుపరిచినట్లు వివిధ దేవాలయాల నుంచి నిధులు రావాల్సి ఉందనీ, అయితే ఈ నిధులను అందజేయడంలో ఈవోలు జాప్యం చేయడం వల్ల దాని ప్రభావం డీడీఎన్ అర్చకుల వేతనాల చెల్లింపుపై పడుతోందని గుర్తు చేశారు. భాస్కర్ ఈవోగా వివిధ ఆలయాల్లో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఈవోలు రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నారన్నారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత మాట్లాడుతూ కొంతమంది ఆలయ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వీటిని కాపాడేందుకు దేవాదాయ శాఖ న్యాయపోరాటం చేస్తోందన్నారు. ఈ భూముల కేసుల విషయంలో ఈవోలు లోకాయుక్త, హైకోర్టు, ట్రిబ్యునల్ చుట్టూ తిరగడంతోనే సరిపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్చక జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, డీసీ ఆఫీసు సూపర్‌వైజర్ గౌరీ శంకర్, సహాయ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్ కుమారస్వామి, డీఈ రమేష్, వేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఇరుకుల్ల రమేష్, దేవాదాయశాఖ డివిజన్ పరిశీలకుడు డి. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి

- ఏకగ్రీవంగా 9వ సారి ఎన్నిక
- ఘనంగా సత్కరించిన రైతులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సహకార బ్యాంకులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ఏకగ్రీవంగా 9వ సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1987 నుంచి ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి పేరు ఏకగ్రీవం కావడంతో ఎన్నికల అధికారి కోదండరాములు.. ప్రవీణ్‌రెడ్డిని అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో ప్రవీణ్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. రైతు మరణిస్తే ఆయనకు ఉన్న వ్యవసాయ అప్పును మాఫీ చేస్తున్నామన్నారు. రైతులకు కంటి ఆపరేషన్లు, శస్త్ర చికిత్సలు, రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, వచ్చిన లాభాల్లో నుంచి రైతులకు బోనస్ ఇలా 35 రకాల సంక్షేమ కార్యక్రమాలు రైతుల కోసం చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, సహకార శాఖ అధికారులు, బ్యాంకు సిబ్బంది ప్రవీణ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ముందుగా కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, బొల్లంపల్లి కుమారస్వామి, గణవేన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్‌రెడ్డి, కాసిరెడ్డి వసంతలతో ఎన్నికల అధికారి కోదండరాములు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, లోన్ మేనేజర్ రాజమౌళి, వెంకటేశ్వర్‌రావు, సతీష్, బ్యాంకు ఉపాధ్యక్షుడు గజ్జి వీరయ్య, డైరెక్టర్లు ఈర్ల మూగయ్య, అంబాల రాములు, బేల కనకమ్మ, కంది రవీందర్‌రెడ్డి, చెవ్వాల బుచ్చయ్య, అన్న శ్రీనివాస్, కర్రె మహేందర్, గుగ్గులోత్ బాషు, బొల్లపల్లి వీరారెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా గజ్జి వీరయ్య



ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా గజ్జి వీరయ్య సోమవారం ఎన్నికయ్యారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన వీరయ్యను బ్యాంకు ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కోదండరాములు... ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.

కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసంలో దాస్యం వినయ్ భాస్కర్ సమావేశమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో సమావేశమైనట్లు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు వేగవంతంగా జరిగేలా కార్యాచరణకు సిద్ధం కావాలని కోరామన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎంపీ నిధుల నుంచి కేటాయించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందించినట్లు వినయ్ భాస్కర్ తెలిపారు.


ఎంపీ రవిచంద్రకు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్, ముదిరాజ్ నేతలు

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమే

బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్‌గౌడ్

వడ్డెపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమేనని జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్‌గౌడ్ అన్నారు. జీడబ్ల్యూఎంసీలో వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్న చుంచు మోహన్ సోమవారం పదవీ విరమణ చేశారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో మోహన్‌కు పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ చుంచు మోహన్ తన శేష జీవితాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఆర్‌వో యూసుఫుద్దీన్, ఆర్‌ఐలు భరత్, సురేష్, శ్రీకాంత్, నవనీత్, దేవరాజ్, రజిని, రజితతో పాటు వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



వార్డు ఆఫీసర్ మోహన్‌ను సన్మానిస్తున్న రవీందర్ గౌడ్

సంక్షిప్త సమాచారం

స్టింగ్ ఆపరేషన్ నిర్వహిస్తాం

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ - ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ మెడికల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా థియేటర్ అసిస్టెంట్లు సర్జరీలు చేస్తున్న తీరుపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చట్టబద్ధ సంస్థలతో కలిసి స్టింగ్ ఆపరేషన్ నిర్వహిస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజా సంబంధాల కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్ వేములపల్లి తెలిపారు. 'కోతల రాయుళ్లు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మెడికల్ కౌన్సిల్ జాతీయ వైద్య కమిటీ నైతిక నియమాల ప్రకారం ఈ తరహా సర్జరీలు పూర్తిగా అనైతికమని పేర్కొన్నారు. అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలు అందించడంతోపాటు అలాంటి వారిని ప్రోత్సహించడం కూడా పూర్తి నిషిద్ధమని పేర్కొన్నారు. అనైతిక చర్యలకు పాల్పడితే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అయన సూచించారు. ఈ తరహా శస్త్ర చికిత్సలు ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేయడమే కాకుండా వైద్య వృత్తిపట్ల నమ్మకాన్ని క్షీణింపజేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. థియేటర్ అసిస్టెంట్లు శస్త్ర చికిత్సలు చేస్తున్న మాట వాస్తవమేనని సీనియర్ సర్జన్లు స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలను తాము కూడా ఖండిస్తున్నట్లు సర్జన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ బాధ్యులు డాక్టర్ కూరపాటి రమేశ్ తెలిపారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య సర్జన్లను అందించేందుకు ఓరియంటేషన్ తరగతులను కూడా త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఆంధ్రజ్యోతి కథనం వైద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మున్నూరుకాపు పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి టీచర్స్ కాలనీ-2లో మున్నూరుకాపు పరపతి సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెంతుల శ్రీనివాస్, కార్యదర్శిగా నీలారపు శ్రీనివాస్, కోశాధికారిగా పొన్నాల రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ఎస్.శంకర్‌రావు, జి.సత్యనారాయణ, జారతి రమేష్, జంగిలి దేవేందర్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో తోట పూర్ణయ్య, నీలారపు భిక్షపతి, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

రేపు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి

హనుమకొండ చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల శ్రమను అవమానపరుస్తూ, రోజులో 4 సార్లు బయోమెట్రిక్ తంబు పెట్టించి ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ జూలై 2న వరంగల్ జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టి ధర్నను విజయవంతం చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. ఉప్పలయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు యాస బాబు, మాతంగి నవనీత, రొంటాల కోటి, ఎర్ర నరేష్, ఎం. అనీల్ ఎస్. రాజు, రంజిత్, కుమార్ రమేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వరంగల్‌లో అక్టోబరులో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వరంగల్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్(డబ్ల్యూడీడబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షురాలు దివ్యజరాజ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందు కోసం తగిన శిక్షణ ఇవ్వడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ డాక్టర్ యేలే శిరీష్మ, ఫిజికల్ డైరెక్టర్ ఎండ్ల సురేందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్క్ వద్ద శాంతియుత నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నందగిరి రజినీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు మోహన్, జ య, రమేష్, శ్యామ్, కృష్ణ, గణేష్, సంధ్యారెడ్డి, సదానందం, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో వరంగల్ చిన్నారుల నృత్య ప్రదర్శన

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరిగిన శాస్త్రీయ నృత్యంలో హనుమకొండ కొత్తూరుజెండాకు చెందిన తాడిశెట్టి మనస్విని, నలబోల శ్రీకారుణ్యలు ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. జూన్ 28న నిర్వహించిన కూచిపూడి సోలో, బృంద నృత్యాల్లో ఇద్దరు చిన్నారు వ్యక్తిగత ప్రతిభ కనబరిచి ఓరుగల్లు ప్రత్యేకతను చాటారు. వీరు భద్రకాళి నృత్యప్రదర్శనశాలలో డాక్టర్ సుభాషిని వద్ద కూచిపూడిలో శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం మనస్విని - హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో, శ్రీకారుణ్య తేజస్వి స్కూల్‌లో చదువుతున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన చిన్నారులను వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు తాడిశెట్టి విద్యాసాగర్‌తో పాటు వారి తల్లి దండ్రులు అభినందించారు.

కల్తీ పురుగుమందులు పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి అబ్బనికుంటలోని బాలాజీ ఆగ్రో ఏజెన్సీలో విక్రయిస్తున్న రూ. 38,267 విలువ చేసే కల్తీ పురుగుమందులను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తెలిపారు. షాపు నిర్వహకుడు కంది రమేశ్‌తో పాటు స్వాధీనం చేసుకున్న పురుగుమందులను తదపరి చర్యలు కోసం స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ మృతి



నల్లబెల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నల్లబెల్లి డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌ఖన్నా(50) అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో సోమవారం ఉద యం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద హనుమకొండ ప్రశాంత్ నగర్‌లోని మృతుడు రాజేష్ ఖన్నా ఇంటికి చేరుకొని మృతదేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే రాజేష్ ఖన్నా డిప్యూటీ తహసీల్దార్‌గా చేసిన సేవలను గుర్తు చేసుకొని డిపార్ట్‌మెంట్ అంతా ఒక్కసారిగా కంటతడి పెట్టుకున్నారు. రాజేష్ ఖన్నా కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఆర్‌ఐ కార్తీక్, జూనియర్ అసిస్టెంట్‌లు కల్పన, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల నూతన ధరల పట్టిక ఆవిష్కరణ

రెడ్డికాలనీ (ఆంధ్రజ్యోతి): కృషి నాయీబ్రాహ్మణ సేవా సంఘం చౌరస్తా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన ధరల పట్టికను ఆవిష్కరించి మాట్లాడారు. కాలానుగుణంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సెలూన్ షాపు రేట్లు పెంచడం జరిగిందన్నారు. కస్టమర్లు సహకరించాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కృషి నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సింగారపు శ్యామ్, జంపాల వేణుగోపాల్, శ్రీరాముల సుదర్శన్, తక్కెళ్లపల్లి గంగాధర్, మొగిలిచర్ల ప్రసాద్, ఏనగందుల సతీష్, నిడిగొండ రమేశ్, మురహరి రాకేశ్, ముత్యాల వీరేంద్రనాథ్, జంపాల రాజయ్య, ఎలకంటి వెంకన్న, పుట్టపాక పవన్, ఎనగందుల రఘు తదితరులు పాల్గొన్నారు.



ధరల పట్టికను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణులు

ప్రజావాణికి వినతుల వెల్లువ

» వివిధ సమస్యలపై 176 వినతులు

» బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 176 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా జీడబ్ల్యూఎంసీకి 26, హౌసింగ్ పీడీకి 12, హనుమకొండ ఆర్డీకు 19, భీమదేవరపల్లి తహసీల్దార్ కార్యాలయానికి 11 రాగా మిగతావి వివిధ సమస్యలపై వచ్చాయి. బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ స్నేహ శబరీష్ ఓపికగా వింటూ సంబంధిత అధికారిని పిలిచి ఎంక్వైరీ చేసి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణికి రాని మండల స్థాయి అధికారులైన తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, అగ్రికల్చర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ బాధితుల సమస్యల గురించి అడిగి తెలుసుకుని వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బాధితుల సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం ఉంటుందన్నారు. అధికారులు సీరియస్‌గా డ్యూటీ చేస్తూ ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, జిల్లా పరకాల, హనుమకొండ ఆర్డీఓలు డాక్టర్ నారాయణ, రాథోడ్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించిన కలెక్టర్

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో గత సంవత్సరం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ సోమవారం నాటికి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. మహిళలు విజయవంతంగా క్యాంటీన్ నిర్వహిస్తూ ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మెప్మా కోఆర్డినేటర్ రజితారాణి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులు ఉన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వండి

» నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

» 109 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుల పరిష్కారానికి ముందస్తుగా ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై గతంలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కాగా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 109 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. మడికొండలో రోడ్డుపై అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని స్థానికులు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఇన్‌చార్జి ఎస్‌ఈ బి. మహేందర్, ఎంహెచ్‌వో మల్లం రాజేశ్, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు

ఇంజనీరింగ్ - 26, హెల్త్, శానిటేషన్ - 14, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 13, టౌన్‌ప్లానింగ్ - 49, తాగునీటి సరఫరా - 6, హార్టికల్చర్ - 1. మొత్తం 109 దరఖాస్తులు.

- హనుమకొండ 2వ డివిజన్ గుండ్లసింగారం శ్రీలక్ష్మీనగర్ కాలనీ ఏర్పడి సుమారు 20 సంవత్సరాలు గడుస్తున్నా సీసీరోడ్లు, డ్రైనేజీలు, కరెంట్ పోల్స్ వేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.
- మడికొండ సమీపంలోని హిల్స్‌కాలనీలో కొందరు భూ కబ్జాదారులు ప్రభుత్వ రహదారిని ఆక్రమించి కట్టడాలు జరుపుతున్నారు. వెంటనే అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని స్థానికులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- 42వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన ఆనందవాణి పురా తన ఇంటి ప్రాంతంలో ఖాళీ స్థలం ఉండడం వల్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 45వ డివిజన్ కుమ్మరిగూడెంలో గతంలో 13 ఫీట్ల రోడ్డు ఉండేది. ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం రోడ్డును 2 ఫీట్ల వరకు తవ్వి పైపులు వేసి వదిలి వేశారు. కానీ కొందరు సీసీ రోడ్డుపై ప్రహరీ, డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నారని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

సొంతింటి కల నెరవేర్చుతున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో 800 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు, సంక్షేమ పథకాలు చేరని గడప లేదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతీ నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లను కేటాయించగా, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కఠినమై ఉన్నందున ఇప్పటి వరకు 2వేల మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతీ పేద కుటుంబానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, విజయశ్రీ రజాలి, పోతుల శ్రీమాన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళసంపత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సతీష్ యాదవ్, తాళ్లపెల్లి విజయ్, ఎనుకొంటి పున్నంచందర్, తాళ్లపెల్లి సుధాకర్, కొండా నాగరాజు, బేతి సబితారెడ్డి, తాళ్లపెల్లి రవీందర్, మేరి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

» వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

» కమిషనర్‌తో కలిసి సమీక్షా సమావేశం

టోల్‌ఫ్రీ నెంబర్లు 1800 425 1980, 97019 99645

వరంగల్ కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం మేయర్ చాంబర్‌లో గ్రేటర్ వరంగల్ కమిషనర్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. నగరంలో ప్రజలు వరద ప్రమాదాలకు గురవుతే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 1980, 97019 99645కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఇక ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో తరుచుగా కురిసే వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల కాలనీలో ఇండ్లలోకి నీరు వచ్చే అవకాశాలు ఉంటాయని, ముందస్తుగా అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అన్నారు. వర్షాల కారణంగా ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూడాలని అన్నారు. నీట మునిగే కాలనీల ప్రజలకు ప్రతీ రోజు భోజన సౌకర్యం కల్పించే విధంగా శానిటేషన్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. నగరంలో గతంలో జరిగిన పొరపాట్లు జరుగుకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఇంచార్జీ ఎస్ఈ బి. మహేందర్, ఈఈ రవికుమార్, శ్రీనివాస్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ సీపీ రవింద్ర రాడేకర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం పాల్గొన్నారు.

పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నెముక

(5వ పేజీ తరువాయి)

జరిగింది. హనుమకొండ, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్, కొరివి పరమేశ్ సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తొలి నుంచి కూడా పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాజీవ్‌గాంధీ 18 ఏళ్లకే ఓటు కల్పించిన సంగతి గుర్తు చేశారు.

పార్టీ కోసం యూత్ కాంగ్రెస్ నిరంతరం పని చేయాలని సూచించారు. యువత రాజకీయాల్లోకి రావాలని ఈ మేరకు యూత్ కాంగ్రెస్ కృషి చేయాలని సూచించారు.

యువతే సమాజానికి దిక్సూచి : ఎమ్మెల్యే నాగరాజు

యువతే సమాజానికి దిక్సూచి అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నుంచి పార్టీ నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఎందరో మహా నేతలు యూత్ కాంగ్రెస్ నుంచే ఎదిగి గొప్ప పదవులు చేపట్టారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ చేసిన కృషి గొప్పదన్నారు. అధినేత రాహుల్‌గాంధీ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ భవిష్యత్తు యూత్ కాంగ్రెస్ పైనే ఆధారపడి ఉందనే ప్రగాఢ విశ్వాసం రాహుల్‌గాంధీలో ఉందన్నారు. అందుకే ఆయన యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు యువతను స్వార్థం కోసం వినియోగిస్తూ పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. యువత ఈ ఉచ్చులో పడకుండా ఉండాలని ఈ మేరకు యూత్ కాంగ్రెస్ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ సమావేశాలు విరివిరిగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచించారు. సమావేశంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఖలీద్ భాయ్, జాతీయ నాయకులు తక్కలపల్లి సాగరికరావు, పగడాల రాహుల్, అశ్విన్ రాథోడ్ తదితర జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

పాతపడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరమ్మతులు లేక అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

వాటిలో కనీస వసతుల లేక పిల్లలతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. చాలా కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తుండడం వల్ల అవి కూడా సరైన స్థితిలో లేవు. అద్దె చెల్లించాల్సిన అవసరం లేకుండా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో, ఇతర ప్రభుత్వ కార్యాలయాలల్లో ఒక గదిలో ఏర్పాటు చేశారు. ఇవి కూడా తగిన విధంగా లేకపోవడంతో వాటి నిర్వహణ కష్టంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగానే ఒక్కో అంగన్‌వాడీ కేంద్రాన్ని రూ 12 లక్షల వ్యయంతో నిర్మించేందుకు అవసరమైన నిధులను కేటాయించింది. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం వల్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాల వారీగా ఇలా..

జనగామ జిల్లాలో మొత్తం 695 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 232కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 463 కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కూనారిల్లుతున్నాయి.వీటిలో 280 రెంట్ ఫ్రీ భవనాల్లో, 183 అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 644 అంగన్‌వాడీ కేంద్రాల్లో 198 మాత్రమే సొంత భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 466 అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ములుగు జిల్లాలో 640 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 276 సొంత భవనాలు కలిగి ఉండగా 211 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 625 రెం ట్ ఫ్రీభవనాల్లో మగ్గుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 1435 అంగన్‌వాడీ కేంద్రాల్లో 330 మాత్రమే సొంత భవనాలకు నోచుకున్నాయి. 480 కేంద్రాలకు అద్దెభవనాలే దిక్కయ్యాయి. 625 కేంద్రాలను రెంట్ ఫ్రీ భవనాల్లో అతికష్టం మీద నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లాలో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం 191 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 427 భవనాలు అద్దెభవనాల్లో సాగుతుండగా మిగతా 301 కేంద్రాలు రెంట్ ఫ్రీ భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో మొత్తం 788 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 200 కేంద్రాలకు మాత్రమే స్వంతభవనాల్లో నడుస్తున్నాయి. మిగతావన్నీ అద్దెభవనాల్లో నడుస్తున్నాయి.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ఉరి వేసుకుంది. ఈ విషయాన్ని గురుకుల పాఠశాల నిర్వాహకులు మధ్యాహ్నం ఒంటిగంట కు తండ్రి ఈశ్వర్‌కు ఫోన్ చేశారు. మీ పాప కళ్లు తిరిగి పడిపోతే పరకాలలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తీసుకొచ్చామని సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వెళ్లిన తల్లిదండ్రులకు శ్రీవాణి విగతజీవిగా కనిపించింది.

బిడ్డ మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబసభ్యులతో కలిసి గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ కూతురు ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఏసీపీ సతీష్‌బాబు, సీఐ క్రాంతికుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే పూర్తి విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని వెల్లడించారు. ఈ ఘటనపై వారు పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

అయితే శ్రీవాణి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడింది అనేది తెలియరాలేదు. ఆమె ఏమైనా సూసైడ్ నోట్ రాసిందా.. అనేది కూడా ఎవరూ చెప్పడం లేదు. శ్రీవాణి మరణం మిస్టరీగా మారడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ గురుకులంలో 5వ తరగతి ఇంటర్ వరకు దాదాపు 500 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

తన బిడ్డ చావుకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏకు శ్రీవాణి తండ్రి ఈశ్వర్ పరకాల పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. గురుకుల పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, హౌస్ మాస్టర్ మీరాబాయి, పీఈటీ, పీఈడీ, అసిస్టెంట్ కేర్, స్వీపింగ్, శానిటేషన్ కాంట్రాక్టు సిబ్బంది బెదిరించి తిట్టిన కారణంగా తాను ఉరివేసుకొని మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై స్థానిక సీఐ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా ఈశ్వర్ ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, హౌస్ మాస్టర్ మీరాబాయితోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేద పిల్లల ప్రాణాలతో చెలగాటం

పేద పిల్లల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరకాల మండలం మల్లక్కపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థిని శ్రీవాణి బలవన్మరణం చెందడం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడి ఇలాంటి ఘటనలకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్‌బాబును కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. వర్సిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాల ఆయన దృష్టికి తెచ్చినట్లు వీసీ తెలిపారు. రుసా నిధులతో ఏర్పాటు చేసిన కెహబ్ పనితీరు, నూతన ఆవిష్కరణలు, ఇంక్యూబేషన్, అంకుర, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని టీ-హబ్‌తో ఎంవోయూకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. జియాలజీ విభాగం పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకునే విషయాన్ని మంత్రికి వివరించినట్లు తెలిపారు. కేయూ లైఫ్‌సైన్సెస్‌కు కేంద్రంగా ఉండేట్లుగా పనిచేస్తోందని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఫలించింది: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు కేంద్ర నిపుణుల కమిటీ నిరాకరించడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఫలించిందని, ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తాను తీవ్రంగా ప్రయత్నాలు చేయడంతోనే అది సాధ్యమైందన్నారు.

అనుమతుల నిలిపివేత బీఆర్ఎస్ విజయం: హరీశ్

బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వమని నిపుణుల కమిటీ తిరస్కరించడం బీఆర్ఎస్ విజయం అని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం, గోదావరి ట్రైబ్యునల్ పరిశీలించకుండా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తేల్చి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం అని, తెలంగాణ ప్రజల విజయమని పేర్కొన్నారు.

కేంద్రం నిర్ణయాన్ని వారి విజయంగా చెప్పుకోవడం సిగ్గు చేటు: బండి సంజయ్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడినవన్నీ డ్రామాలేనని మరోసారి స్పష్టమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీలు కలిసి విష ప్రచారం చేశాయని ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. 'బనకచర్ల విషయంలో తెలంగాణకు బీజేపీ అన్యాయం చేస్తోందని నిన్నటిదాకా గగ్గోలు పెట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్.. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో యూటర్న్ తీసుకున్నాయి. కేంద్రం నిర్ణయాన్ని వారి విజయంగా ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటు. మంచి జరిగితే తమదే క్రెడిట్ అంటూ జబ్బలు చరుచుకునే ఈ పార్టీల నేతలు.. చెడు జరిగితే ఇతరులపై నెట్టేయడం అలవాటుగా మారింది' అని విమర్శించారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని.. కేంద్రం నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తోందనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలంటూ ప్రశ్నించారు.

గ్రూప్-1పై వాదనలు త్వరగా ముగించండి

» అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు: హైకోర్టు

గ్రూప్-1 పరీక్షల పిటిషన్లపై వాదనలను త్వరగా ముగించాలని హైకోర్టు సంబంధిత న్యాయవాదులను సూచించింది. నియామకపత్రాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేసింది. సమాధాన పత్రాలు సరిగా దిద్దలేదని, మూల్యాంకనంలో అక్రమాలు, తుది అభ్యర్థుల సంఖ్యలో తేడాలు సహా అనేక లోపాలున్నాయని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నందున నియామక పత్రాలు ఇవ్వరాదని స్టే విధించింది. ఆ స్టే ఎత్తేయాలని కోరుతూ టీజీపీఎస్సీ మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసింది. వీటిన్నింటిపై సోమవారం జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు జీ విద్యాసాగర్, సురేందర్‌రావు వాదనలు కొనసాగించారు. కోర్టు సమయం ముగియడంతో వాదనలు మంగళవారానికి వాయిదాపడ్డాయి.

చానల్‌పై దాడి కేసు.. బీఆర్ఎస్వీ నేతలకు బెయిల్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహాన్యూస్ కార్యాలయంపై దాడి కేసులో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురికి బెయిల్ మంజూరైంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై అసభ్యకరమైన వార్తలు ప్రసారం చేయడంపై ఆగ్రహించిన బీఆర్ఎస్వీ నాయకులు మహాన్యూస్ కార్యాలయంపై దాడి చేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఇరువైపులా వాదనలు విన్న నాంపల్లి క్రిమినల్ కోర్టు బీఆర్ఎస్వీ నేతలకు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది.

బనకచర్లకు బ్రేక్!

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. దీనిపై విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ ప్రాజెక్టుకు టీవోఆర్‌ను జారీ చేయలేమని నిర్ణయిస్తూ సోమవారం సమావేశపు మినిట్స్‌ను విడుదల చేసింది. పోలవరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇప్పటికే లభించినా.. ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ముంపునకు సంబంధించిన అంశాలతో అది న్యాయ పరిధిలో ఉందని, గోదావరి నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్ నిబంధనలను బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘించవచ్చంటూ తమకు ఈ మెయిల్ ద్వారా పలు ఫిర్యాదులు వచ్చాయని, ఈ నేపథ్యంలో వరద జలాల లభ్యతకు సంబంధించి సీడబ్ల్యూసీతో సంప్రదించి సమగ్రంగా అంచనా వేయవలసి ఉంటుందని ఈఏసీ అభిప్రాయపడింది. అంతర్రాష్ట్ర అంశాలను పరిశీలించేందుకు, అవసరమైన అనుమతులు మంజూరు చేసేందుకు కేంద్ర జల సంఘాన్ని సంప్రదించాలని, సీడబ్ల్యూసీ ఆమోదం తర్వాతే పర్యావరణ అంచనా కోసం టీవోఆర్‌ను రూపొందించే విషయంలో తమను సంప్రదించాలని నిపుణుల కమిటీ ఆంధ్రప్రదేశ్ సర్కారుకు సూచించింది. నిజానికి, కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించడానికి వీలుగా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు సమాంతరంగా మరో కాల్వను తవ్వి.. 90-120 రోజుల్లో 200 టీఎంసీల నీటిని తరలించడం ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఈ కాల్వ ద్వారా తొలుత నీటిని పోలవరం నుంచి కాల్వ ద్వారా ప్రకాశం బ్యారేజీకి తీసుకొస్తారు. అక్కడి నుంచి నాగార్జున సాగర్ కుడి కాల్వ మీదుగా పల్నాడు జిల్లాలో 173 టీఎంసీలతో నిర్మించతలపెట్టిన బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తీసుకెళతారు. అక్కడి నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీకి తరలించాలనేది ప్రాజెక్టు ప్రతిపాదన. రూ.81,900 కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీరు అందించడం, 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరీకరించడం, 80 లక్షల మందికి తాగునీటితోపాటు 20 టీఎంసీలను పారిశ్రామిక అవసరాలకు అందించాలని ప్రతిపాదించారు. అయితే, బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణలో అధికార, విపక్షాల మధ్య యుద్ధమే జరిగింది. దాంతో, ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనికి పర్యావరణ అనుమతికి ఉద్దేశించిన టీవోఆర్‌ను జారీ చేయరాదని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు లేఖ రాశారు. ఢిల్లీకి వెళ్లి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి కూడా లేఖ ఇచ్చారు. కేంద్ర పర్యావరణ శాఖకు పలు విజ్ఞప్తులు చేశారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణ గత కొన్ని రోజులుగా అనేక రూపాల్లో పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే, ఈఏసీ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. గోదావరి బేసిన్‌లోని వరద జలాలను అదే రాష్ట్రంలోని కరువు పీడిత బేసిన్లకు తరలించడానికి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారని, కానీ, నీటి లభ్యతపై అంతర్రాష్ట్ర అభ్యంతరాలు ఉండటంతో కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి తగిన అనుమతులు తీసుకోవాలని ఈఏసీ స్పష్టం చేసింది.

మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు!

మురికివాడలు, వలస కార్మికులుండే ప్రాంతాల్లో ఏర్పాటు.. అక్కడి పిల్లలకు పౌష్టికాహారం: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే.. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఐదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యనందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై ముఖ్యమంత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణం అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని, పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయించాలని సూచించారు. సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాకప్‌తో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

పౌష్టికాహారం అందజేతలో ఎన్జీవోల సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి చిన్నారికీ పౌష్టికాహారం అందించాలని, ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. బాలామృతం ప్లస్‌ను పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నారని, పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టి సారించాలని అన్నారు. తెలంగాణ ఫుడ్స్, విజయా డెయిరీ ఉత్పత్తులను అంగన్‌వాడీలకు అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీల పర్యవేక్షణ, నిర్వహణ, పౌష్టికాహారం అందజేతపై వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలన్నారు. ఇక అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నారని, అదే సమయంలో ఏటీసీల్లోనూ వాళ్లకు ప్రవేశాలు కల్పించాలని నిర్దేశించారు. మన పిల్లలను సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే ఒప్పందం చేసుకున్నామని, అక్కడికి పంపే వారిలో అనాథ పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఉద్యోగాలు చేస్తున్న పలువురు.. తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, అలాంటి వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారితల్లిదండ్రులకు ఖాతాలకు 10-15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ అంశంపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. దివ్యాంగుల వివాహాలు, వివిధ పథకాల్లో వారికి ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై వచ్చే క్యాబినెట్ సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని, వారి సేవలను ఇతర శాఖల్లోనూ వినియోగించుకునేలా చూడాలన్నారు.

క్యాబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం

» బ్యారేజీలపై నిర్ణయం తీసుకొని, నిర్మాణం ప్రారంభించిన తర్వాతనే మంత్రివర్గంలో ఆమోదింపజేసుకున్నారు

» గుర్తించిన ప్రభుత్వం.. జస్టిస్ ఘోష్ కమిషన్‌కు లేఖ సిద్ధం

» నిరూపించే అన్ని వివరాలతో నేడు సీల్డ్ కవర్‌లో సమర్పణ!

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల నిర్మాణానికి తొలుత మంత్రివర్గం ఆమోదం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. బ్యారేజీల నిర్మాణాల కోసం నిర్ణయం తీసుకున్న ఏడాది తర్వాత, బ్యారేజీల నిర్మాణం ప్రారంభించి, డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో సమర్పించి.. ఆ తర్వాత మంత్రివర్గంలో ఆ నిర్ణయాన్ని ఆమోదింపజేసుకున్నారని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు లేఖను సిద్ధం చేసింది. దీనికి అనుబంధంగా మంత్రివర్గ నిర్ణయాలకు సంబంధించిన వివరాలను కాలానుక్రమంగా జతచేసింది. ఈ వివరాలన్నింటినీ మంగళవారం సీల్డ్ కవర్‌లో కమిషన్‌కు అందించనుంది. జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు ఈ నెల 11న హాజరైన మాజీ సీఎం కేసీఆర్.. బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తానొక్కడినే తీసుకోలేదని, ఆ నిర్ణయం మొత్తం మంత్రివర్గానిదని తెలిపారు. అంతకు ముందు ఈ నెల 6న ఈటల రాజేందర్, 9న హరీశ్‌రావు కూడా ఇదే చెప్పారు. బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవడానికి వీలుగా అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్ సభ్యులుగా వేసిన మంత్రివర్గ ఉపసంఘం బ్యారేజీల నిర్మాణాలపై సిఫారసు చేసిందని కూడా విచారణలో వివరించారు. కానీ, వారు చెప్పింది అబద్ధమని ప్రస్తుత మంత్రి తుమ్మల ఖండించారు. మరోవైపు, ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ.. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి రూ.2,591 కోట్లతో పరిపాలనపరమైన అనుమతినివ్వాలని అప్పటి ఈఎన్‌సీ(ఇరిగేషన్) మురళీధర్ 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా... ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీకి అనుమతినిస్తూ 2016 మార్చి 1న జీవో నెం.231 జారీ చేసినట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. జీవో విడుదలైన 14 రోజుల తర్వాత అంటే 2016 మార్చి 15న హరీశ్‌రావు చైర్మన్‌గా, ఈటల రాజేందర్, తుమ్మలనాగేశ్వరరావులను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ జీవో నెం.655 జారీ చేసినట్లు ప్రభుత్వం గుర్తించింది. కాగా, ఈనెల 26వ తేదీలోపు జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు ఏర్పాటు చేయండి

» ఇసుక విక్రయ కేంద్రాలను పెంచాలి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

» ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నేపథ్యంలో సామాన్యులకు సిమెంటు, స్టీల్, ఇటుకలు, ఇసుక ధరలు అందుబాటులో ఉండేందుకు మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారమే.. సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా 20 ఇసుక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. కాగా... మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో మరిన్ని ఇసుక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రుల బృందం చర్చించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను రింగ్ రోడ్డు వెలుపలకు తరలించే కార్యక్రమంపై పారిశ్రామిక వాడల వారీగా అధికారులతో మంత్రులు సమీక్షించారు. వాణిజ్య పన్నుల శాఖపై సమీక్షిస్తూ.. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ పరిస్థితి మెరుగ్గా ఉందని సబ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల ముఖ్యకార్యదర్శి రిజ్వీ, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల వివరాలు పంపండి

» గురుకుల సెక్రటరీలను అడిగిన సీఎంవో కార్యాలయ వర్గాలు

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

» మంత్రులు పొన్నం, అడ్లూరితో సమావేశం

» నిధుల సేకరణకు నేడు ఉప ముఖ్యమంత్రితో భేటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యా సంస్థలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఏయే సొసైటీకి ఎంతెంత బకాయిలు ఉన్నాయి... వాటికి ఎంతమేరకు నిధులు అవసరం అనే అంశంపైన వివరాలు అడిగినట్లు తెలిసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి తన నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఆయా శాఖల కార్యదర్శులతో సమావేశమయ్యారు. గురుకులాలకు అవసరమైన నిధులు, సెంట్రలైజ్డ్ టెండర్ల విషయంపై చర్చించినట్లు సమాచారం. పెండింగ్ బిల్లులపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎంవో కార్యాలయ వర్గాలు ఏయే గురుకుల సొసైటీకి ఎంత మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను పంపాలని ఆయా సొసైటీల సెక్రటరీలను కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు బకాయిల వివరాలు సోమవారం రాత్రి పంపారు. గురుకులాల్లో విద్యార్థులకు గుడ్లు, మాంసం, పండ్లు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను సరఫరా చేస్తున్న గుత్తేదారులకు జనవరి నుంచి బిల్లులు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో చాలాచోట్ల గుడ్లు, చికెన్, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయింది. అదేవిధంగా అద్దె బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం ఉచితంగా అందించే ఏకరూప దుస్తులు, టై, బెల్ట్, షూల వంటివి ఏటా సరఫరా కాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో గురుకులాల్లో ఇబ్బందులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గురుకులాల గోడు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. సీరియస్‌గా తీసుకున్న సీఎం నిధుల విడుదలపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో సంబంధిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా అప్రమత్తమయ్యారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్ బిల్లుల పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులాల ఆర్థిక సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆయా శాఖల ఉన్నతాధికారులు కలిసి మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలవాలని నిర్ణయించినట్లు సమాచారం. పెండింగ్ బిల్లుల వివరాలు తెలియజేసి నిధులు విడుదల చేసేలా కోరనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ముందుంటుంది:సీఎం

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీపీఐ నేతలు సోమవారం జూబ్లీహిల్స్‌లో సీఎంని ఆయన నివాసంలో కలిశారు.అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, వరంగల్, భూపాలపల్లి, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, పంచాయతీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు.



వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాల అమలు

» ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్: పొంగులేటి

» వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాయపర్తి, హైదరాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్‌దేనన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో రూ.14.17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి, నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంతో సమస్యలన్నీ తీరుస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే గెలుపని పొంగులేటి చెప్పారు. కాగా, నిరుపేదలకు గృహవసతి కల్పనలో దేశంలోనే తెలంగాణ తలమానికంగా నిలిచిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న తమ ప్రభుత్వం ఇప్పటికే 3 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాటిలో 1.23 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణంతో రాష్ట్రంలో గుడిసెల్లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న పొంగులేటి.. సీఎం ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు చేయూత

» కొత్తగా మరో 14,084 మందికి పెన్షన్లు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్‌ఐవీ బారిన పడ్డ వారికి అండగా నిలిచేందుకు చేయూత పథకం కింద పెన్షన్లు అందజేస్తున్న ప్రభుత్వం.. కొత్తగా మరో 14,084 మంది హెచ్‌ఐవీ బాధితులకు పెన్షన్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఫైలుపై మంత్రి సీతక్క సోమవారం సంతకం చేశారు. ఈ పెన్షన్లు జూలై నుంచి లబ్ధిదారులకు అందనున్నాయి. హెచ్‌ఐవీ బాధితులు పూర్తిస్థాయిలో పనిచేయలేని స్థితిలో ఉండటంతోపాటు నెల నెలా అధిక వైద్య ఖర్చులు సైతం భరించాల్సిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పెన్షన్లు అందజేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 34,421 మంది హెచ్‌ఐవీ బాధితులకు నెలకు రూ.2010 చొప్పున పెన్షన్ అందిస్తున్నారు.

మీసేవలో మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్లు

» కొత్త సేవలను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మీసేవల్లో రెండు కొత్త సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక నుంచి మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్లను మీసేవ ద్వారా పొందవచ్చు. ఈసేవలు తక్షణం అమల్లోకి వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన ఈ సేవలను ఆవిష్కరించారు. పౌరులకు మరింత వేగంగా, పారదర్శక సేవలను అందించాలన్న లక్ష్యంతోనే కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కొత్త సేవలతో ప్రజలు సంబంధిత కార్యాలయాలకు వెళ్లకుండానే మీసేవ ద్వారా మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్లను పొందవచ్చన్నారు. మీసేవ సెంటర్ లేదా ఆన్‌లైన్‌లో జిల్లా, గ్రామం వంటి వివరాలను సమర్పించి భూమికి సంబంధించిన తాజా మార్కెట్ విలువను పొందవచ్చు. ఈ దరఖాస్తులను సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం త్వరితగతిన పరిశీలించి నిర్ణయిస్తుంది. ఇందులో స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దరఖాస్తుదారులు పెళ్లి ఫొటోలు, చిరునామా రుజువు, వయస్సు ధృవీకరణ పత్రాలను సమర్పించాలి. ఆమోదం అనంతరం సర్టిఫికెట్‌ను ప్రత్యక్షంగా సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి జారీ చేస్తారు.



వైద్యులు... ప్రాణ దాతలు

నేషనల్ డాక్టర్స్ డే

82 ఏళ్ల మహిళకు గుండె సర్జరీ



వృద్ధుల్లో గుండె జబ్బుల చికిత్సలు క్లిష్టతరం. సర్జరీకి వాళ్ల శరీరాలు సహకరించవు. కాబట్టి సాధ్యమైనంత మేరకు ఇన్వేసివ్ చికిత్సలనే ఎంచుకుంటూ ఉంటాం! కానీ కొన్ని సందర్భాల్లో అది కూడా సాధ్యపడకపోవచ్చు. కొంత కాలం క్రితం అలాంటి ఒక క్లిష్టమైన పరిస్థితి ఎదురైంది. ఆమెకు 82 ఏళ్లు. కళ్లు తిరిగి పడిపోతున్న ఆమెను స్థానిక వైద్యులకు చూపిస్తే, వాళ్లు గుండె జబ్బుగా నిర్ధారించారు. పెద్ద వయస్కుల్లో గుండె దగ్గర బృహద్ధమని సన్నబడిపోతూ ఉంటుంది. దాంతో మెదడుకు సరిపడా రక్తం అందక కళ్లు తిరిగి పడిపోతూ ఉందామె. అయితే ఆమెది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా రక్తనాళం గుండా బృహద్ధమనికి చేరుకుని దాన్ని మార్చే పద్ధతిని అనుసరిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రక్రియకు ముందు రక్తనాళాల్లో అడ్డంకులను కనిపెట్టడం కోసం కరొనరీ యాంజియోగ్రామ్ కూడా చేయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో ఆమె మూడు రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నట్టు తెలిసింది. అయితే ఆవిడది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా కవాటాన్ని మార్చడానికి వైద్యులు వెనకాడారు. అలాగని ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే ధైర్యం కూడా చేయలేకపోయారు. అలా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో నా దగ్గరకు వచ్చిన ఆ వృద్ధురాలికి అత్యవసరంగా 3 బైపాస్‌లతో పాటు ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా విజయవంతంగా కవాటాన్ని కూడా మార్చగలిగాను. సర్జరీ జరిగిన ఐదో రోజునే డిశ్చార్జ్ అయిపోయిందామె. ఏడాది తర్వాత వచ్చి నన్ను కలిసి, పనులన్నీ స్వయంగా చేసుకోగలుగుతున్నట్టు చెప్పినప్పుడు నాకెంతో సంతృప్తి కలిగింది.

ఇప్పటివరకూ దాదాపు 20 వేల గుండె సర్జరీలు చేశాను. కాబట్టి నేను తీసుకున్న శిక్షణ, సుదీర్ఘ అనుభవాలు ఈ సర్జరీకి అక్కరకొచ్చాయని అనుకోవచ్చు. పి.వి నరసింహా రావు, ఎన్‌టి రామారావు, జైల్ సింగ్ లాంటి ప్రముఖులకు గుండె సర్జరీలు చేసిన అమెరికాలోని టెక్సాస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లోనే నేను కూడా శిక్షణ పొందాను. అక్కడ 90, 100 ఏళ్ల రోగులకు కూడా గుండె సర్జరీలు చేసిన సందర్భాలున్నాయి. అలాగే మన దేశం లో గుండె సర్జరీలకు సంబంధించి కొన్ని ప్రొటోకాల్స్ ఉంటాయి. వాటిని నేనే రూపొందించాను. రక్తం పలచబడే మందులను జీవితాంతం వాడుకోవలసిన అవసరం లేని కృత్రిమ గుండె కవాటాన్ని కూడా రూపొందించాను. ప్రస్తుతం అది ప్రయోగ దశలో ఉంది. ఇలా గుండె సమస్యలు, చికిత్సల పట్ల నాకున్న లోతైన పరిజ్ఞానంతో క్లిష్టమైన సర్జరీలను సవాలుగా తీసుకుని, విజయవంతంగా పూర్తి చేయగలుగుతున్నాను.



డాక్టర్ లోకేశ్వర రావు సజ్జ
సీనియర్ కన్సల్టెంట్
కార్డియోథొరాసిక్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్

మరణం అంచు నుంచి వెనక్కి



రోగులకే కాదు కొన్ని సందర్భాల్లో వైద్యుల చేతిలో కూడా సమయం ఉండదు. మరీ ముఖ్యంగా అత్యవసరంగా రోగి ప్రాణాలు కాపాడవలసిన సందర్భాల్లో వైద్యులు చురుగ్గా ఆలోచించి, చకచకా నిర్ణయాలు తీసుకోవలసి వస్తూ ఉంటుంది. అలాంటి ఒక సందర్భం కొవిడ్‌కు ముందు ఎదురైంది. ఒక రోజు ఉదయాన్నే 32 ఏళ్ల మహిళను వాళ్ల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే కామెర్లతో కాలేయం పూర్తిగా దెబ్బతిని, కోమాలోకి వెళ్లిపోయిందామె. వాళ్లు మార్వాడీలు. వ్యాపారస్తులు. పెద్దగా చదువు లేదు కాబట్టి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాళ్లకెలాంటి అవగాహనా లేదు. దాంతో పరిస్థితి తీవ్రతను అంచనా వేయలేకపోయారు. ఆమెను పరీక్షించిన వెంటనే అత్యవసరంగా కాలేయ మార్పిడి చేయకపోతే, ప్రాణాలు దక్కవనే విషయాన్ని నేను అర్థం చేసుకున్నాను. అందుకు ఎక్కువ సమయం లేదు. 24 గంటల్లో కాలేయ మార్పిడి జరిగిపోవాలి. ఓ పక్క పరిస్థితిని తీవ్రతను కుటుంబ సభ్యులకు వివరించడంతో పాటు, మరోపక్క సర్జరీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. అంతా యుద్ధప్రాతికపదికన జరిగిపోవాలి. ఆ సమయంలో ప్రతి క్షణం విలువైనదే! మొదట కుటుంబ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పి, కాలేయ మార్పిడికి ఒప్పించిన తర్వాత, రోగి తమ్ముడి నుంచి కాలేయాన్ని సేకరించాలని నిర్ణయించుకున్నాం. ఆ తర్వాత అతనికి పరీక్షలన్నీ చేసి కాలేయాన్ని దానం చేయడానికి అన్ని విధాలా అర్హుడని నిర్ధారించుకున్నాం. తర్వాత అనుమతులన్నీ తీసుకుని, సర్జరీకి సిద్ధపడ్డాం. అలా రోగి ఆస్పత్రికి చేరుకున్న 24 గంటల్లోపే తెల్లవారుఝామును 3 గంటలకు సర్జరీ మొదలుపెట్టాం. రెండు ఆపరేషన్ టేబుళ్ల మీద అక్కా తమ్ముళ్లకు ఏకకాలంలో సర్జరీ చేసి, తమ్ముడి నుంచి సేకరించిన 60% కాలేయాన్ని అక్కకు అమర్చాం. సర్జరీ నూరు శాతం విజయవంతమైంది. ఆరు వారాలకు ఇద్దరి కాలేయాలూ పూర్తి పరిమాణం మేరకు పెరుగుతాయి కాబట్టి అప్పటికి వాళ్లిద్దరూ పూర్తిగా కోలుకున్నారు. తర్వాత కొంత కాలానికి ఆమె గర్భం దాల్చిందని తెలిసింది. ఇప్పటికీ అప్పుడప్పుడూ ఆమె ఆస్పత్రికి వచ్చి నన్ను కలుస్తూ ఉంటుంది. మరణం అంచుల వరకూ వెళ్లి, కాలేయ మార్పిడితో ప్రాణాలు దక్కించుకుని, పూర్తి ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న ఆమెను చూసిన ప్రతిసారీ నాకెంతో సంతృప్తి కలుగుతూ ఉంటుంది.

ప్రతి సర్జరీలో ముప్పులు ఉన్నట్టే, కాలేయ మార్పిడి సర్జరీలో కూడా కొన్ని ముప్పులుంటాయి. సర్జరీ కచ్చితంగా విజయవంతమవుతుందని చెప్పలేం! విఫలమయ్యే అవకాశాలు 30% ఉంటాయి. కాబట్టి కుటుంబానికి కౌన్సిలింగ్ ఇవ్వడం ఇక్కడెంతో కీలకంగా మారుతూ ఉంటుంది. సర్జరీ సమయంలో తలెత్తే సమస్యలు, సర్జరీ తదనంతర పరిణామాలను కుటుంబానికి వివరించడం ఒక ఎత్తైతే, సర్జరీ విఫలమై రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉంటుందని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పడం మరొక ఎత్తు. అలా కౌన్సెలింగ్ ముగించుకుని, మిగతా లాంఛనాలన్నీ పూర్తి చేసుకుని, తెల్లవారుఝామున 3 గంటలకు, తమ్ముడికీ, అక్కకూ ఏకకాలంలో సర్జరీలు మొదలుపెట్టాం. అవి ఉదయం పది గంటల వరకూ కొనసాగాయి. నిజానికి ఇలాంటి సందర్భాల్లో వైద్యులమైన మాలో కూడా ఎంతో కొంత ఆందోళన ఉంటూ ఉంటుంది. అలాగే సర్జరీ ఎలాగైనా సక్సెస్ కావాలనే బలమైన కోరిక కూడా ఉంటుంది. కాబట్టే సర్జరీ పూర్తి చేసి ఇంటికెళ్లిపోయినా, మా ఆలోచలన్నీ ఆస్పత్రి చుట్టూరా, రోగి ఆరోగ్యం చుట్టూరా తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి. వైద్యులు భావోద్వేగపరంగా రోగులతో, పరిస్థితులతో కొంత డిటాచ్‌గా ఉండక తప్పదు. ఒకవేళ సర్జరీ విఫలమై, రోగి ప్రాణాలు కోల్పోవడం లాంటిది జరిగితే, బాధపడుతూ, నిరాశలో కూరుకుపోతే మేం మా వృత్తికి న్యాయం చేయలేం! కాబట్టి సాధ్యమైనంత మెరుగైన చికిత్సను అందించడం, సత్ఫలితాన్ని సాధించడం కోసం శాయశక్తులా కృషి చేయడమే లక్ష్యంగా పని చేస్తాం! ఇలా సర్జరీ నుంచి పూర్తిగా కోలుకుని నిండు ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న వాళ్లను చూసినప్పుడు ఎంతో ఆనందాన్ని పొందుతూ ఉంటాం!

డాక్టర్ నవీన్ పోలవరపు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్



ప్రసవం ఆమెకు ప్రాణాంతకం

ప్రసవం మహిళలకు పునర్జన్మ లాంటిదని ఊరికే అనలేదు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత మహిళల ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టే పరిస్థితులు అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటాయి. సాధారణంగా గర్భిణిగా ఉన్నప్పుడే, సదరు మహిళది క్లిష్ట ప్రసవం కాబోతోందని ముందుగానే కనిపెట్టేస్తూ ఉంటాం. దాంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రసవానికి అన్ని విధాలా సన్నద్ధమవుతూ ఉంటాం. కానీ అరుదుగా కొన్ని సందర్భాల్లో ప్రసవం తర్వాత సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. అలాంటి సమస్యలో రక్తస్రావం ప్రధానమైనది.

ఒక సందర్భంలో సుఖ ప్రసవం జరిగిన ఒక మహిళకు ఆగకుండా రక్తస్రావం జరిగిపోవడం మొదలైంది. దాంతో ఉన్నపళాన ఆస్పత్రికి రమ్మని నాకు కబురొచ్చింది. అప్పటికే ఎంతో రక్తం ఎక్కించారు. అయినా ఆమె పరిస్థితి మెరుగుపడలేదు. ఆ సమయంలో అందరూ ఏం చేయాలో, రక్తస్రావాన్ని ఎలా ఆపాలో తెలియని అయోమయంలో పడిపోయారు. దాంతో ఆ క్షణమే నాకొక ఆలోచన తట్టింది. గర్భాశయం నుంచి రక్తస్రావం అవుతోంది. కాబట్టి




గర్భాశయానికి రక్తాన్ని చేరవేసే రక్తనాళాన్ని మూసేయడం ద్వారా రక్తస్రావాన్ని ఆపవచ్చని నాకు అనిపించింది. నిజానికి ఆ చికిత్సను వైద్యులు ముందు నుంచే అనుసరిస్తూ ఉండి ఉండవచ్చు. కానీ నాకు అది కొత్త. ఆ పనిని ఎండోస్కోపీ ద్వారా చేయవచ్చని నాకు అనిపించింది. నిజానికి ప్రసవం జరిగిన వెంటనే ల్యాప్రోస్కోపీ చేయరు. కాబట్టి పొట్ట కోసి రక్తస్రావాన్ని ఆపే సర్జరీని ఎంచుకోవాలి. కానీ అంత పెద్ద సర్జరీకి బదులుగా ల్యాప్రోస్కోపీతోనే ఆ పనిని పూర్తి చేయవచ్చన్నది నా ఆలోచన, అలా మొదటిసారిగా ఒక ప్రయోగాత్మకమైన చికిత్సకు పూనుకున్నాను. అంతకంటే ముందు ఆ చికిత్స ఫలితం, పరిణామాల గురించి ఆమె కుటుంబ సభ్యులకు వివరించాను. ఎండోస్కోపీ మధ్యలో అవసరమైతే, ఓపెన్ సర్జరీ కూడా చేయవలసి రావచ్చు. సర్జరీ సఫలం కావచ్చు. లేదంటే విఫలమై గర్భసంచిని కూడా తొలగించవలసి రావచ్చు. ఆ విషయం కుటుంబ సభ్యులతో చర్చించి ఆ ప్రయోగాత్మకమైన సర్జరీకి పూనుకున్నాను. విజయవంతంగా రక్తనాళాన్ని కనిపెట్టి, దాన్ని మూసేయడం ద్వారా రక్తస్రావాన్ని ఆపగలిగాను. దాంతో ఆ క్షణమే రోగి రక్తపోటు సాధారణ స్థితికి చేరుకుంది. మరుసటి రోజే చురుగ్గా నడవడం మొదలుపెట్టింది. ఇలాంటి సందర్భాల్లో రక్తస్రావాన్ని ఆపి, మహిళతో పాటు ఆమె గర్భాశయాన్ని కూడా కాపాడగలిగినప్పుడు ఎంతో సంతోషం కలుగుతూ ఉంటుంది.

డాక్టర్ రాధిక రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్ అబ్‌స్ట్రెటీషియన్ అండ్ గైనకాలజిస్ట్, ల్యాప్రోస్కోపీ సర్జన్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
హైదరాబాద్



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

20 మంది దుర్మరణం

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించాం

- క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రుల్లో చేర్పించాం
- సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్
- మంత్రులు దామోదర, వివేక్ వెంకటస్వామి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రులు దామోదర, వివేక్

పటాన్‌చెరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి అన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు సంగారెడ్డి కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం దామోదర విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం తర్వాత ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించిందన్నారు. క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించేందుకు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు పంపించామన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వెనకడుగు వేయదన్నారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు చేయడం తగదన్నారు. బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి వివేక్ తెలిపారు. పరిశ్రమ భద్రతపై కార్మిక శాఖ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతుందన్నారు. పేలుడుకు గల కారణాలను అన్వేషిస్తున్నామన్నారు. ప్రాథమిక దర్యాప్తులో పరిశ్రమలో రియాక్టర్ పేలలేదని తేలిందని చెప్పారు. కార్మికుల భద్రత కోసం పరిశ్రమ తీసుకున్న చర్యలను పరిశీలిస్తున్నామన్నారు. కాగా, సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు మరణించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


గాయపడినవారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

- క్షతగాత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలి: హరీశ్

పటాన్‌చెరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం వచ్చిన కార్మికులు బలికావడం ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పేలుడు జరిగిన పరిశ్రమను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరిగి ఐదు గంటలైనా ఇంకా ఎంతమంది చనిపోయారో చెప్పకపోవడం దారుణమన్నారు. 40-70శాతం కాలిన గాయాల బారిన పడ్డ వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించకుండా కాలయాపన చేయడమేంటని మండిపడ్డారు. గోల్డెన్ అవర్(మొదటి గంట)లోనే ఆధునిక చికిత్స అందిస్తే కాలిన గాయాలతో ఉన్న కార్మికుల ప్రాణాలు కాపాడుకోగలమన్నారు. గల్లంతైన వారి సమాచారం ఇచ్చేందుకు కనీసం హెల్ప్‌డెస్క్, టోల్‌ఫ్రీ అత్యవసర కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు: మోదీ

సహాయక చర్యలకు సహకారం: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనలో పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా అందిస్తాం' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి కార్మికులు చనిపోవడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు సంపూర్ణ సహకారం అందించాలని కేంద్ర సంస్థలను ఆదేశించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

కాలిపోతున్న బతుకులు!

పదేళ్లలో జరిగిన అగ్నిప్రమాదాల్లో 600 మందికిపైగా సజీవ దహనం

- మృతుల్లో ఎక్కువగా వలస కూలీలే

హైదరాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం పొట్టచేతబట్టుకుని వస్తున్న వలస కూలీలు.. అనుకోని ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిశ్రమలు, గోదాముల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారు కొందరైతే... కాళ్లు, చేతులు కోల్పోయి దివ్యాంగులుగా మారుతున్న వారు మరికొందరు. సాధారణంగా వలస కూలీల్లో చాలా మంది హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని పరిశ్రమలు, గోదాముల్లో కూలీలుగా చేరుతుంటారు. అలాంటి చోట్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు... మరణించే వారిలో వలస కూలీలే ఎక్కువగా ఉంటున్నారు. గతంలో షాద్‌నగర్‌లో, జీడిమెట్ల పారిశ్రామిక వాడలో, హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లి ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదాల్లోనూ వలస కూలీలే ఎక్కువగా మృతి చెందారు. తాజాగా పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో జరిగిన పేలుడులో మృతులు, గాయపడ్డ వారు, ఆచూకీ లేకుండా పోయిన వారిలోనూ అత్యధికులు వలస కూలీలే. 2014 నుంచి 2024 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అగ్నిప్రమాదాల్లో 600మందిపైగా మృతి చెందినట్లు అగ్నిమాపక శాఖ వద్ద లెక్కలు ఉన్నాయి. మృతుల్లో బిహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉండడం గమనార్హం. పరిశ్రమలు, గోదాముల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సమాచారం అందుకుని అగ్నిమాపక శాఖ శకటాలు ఘటనా స్థలానికి చేరుకున్నా... మంటల్ని అదుపు చేసే పరిస్థితి లేకుండా పోతుంది. ప్రమాణాల మేరకు నిర్మాణాలు లేకపోవడంతో సహాయక చర్యల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు అక్కడ పనిచేసే సిబ్బందికి మంటల్ని అదుపు చేయడంపై అవగాహన లేకపోవడం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతోంది. దీనికితోడు అగ్నిమాపక శాఖ తనిఖీలు లోపించడం.. ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. నిబంధనల ప్రకారం 15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉండే భవనాల్లో అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరి. కానీ హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉన్న పరిశ్రమలు, గోదాములు ఎత్తు 15మీటర్ల కంటే తక్కువగా ఉండటంతో అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. దీని ఫలితంగా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం భారీగా జరుగుతోంది


పేలుడు ధాటికి దెబ్బతిన్న ఫ్యాక్టరీ పరిసరాలు


కారు వద్ద అగ్నికీలల్లో మాడిపోయిన మృతదేహం


సిగాచి పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తులో ఎయిర్‌వాక్స్ పేలినట్లు పేర్కొన్నారు. సాయంత్రానికి అది డయ్యర్ పేలుడు అయ్యి ఉండొచ్చని, రియాక్టర్ కాకపోవచ్చని వెల్లడించారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారంలో కొనసాగుతున్న సిగాచి పరిశ్రమలో.. ఉదయం షిఫ్ట్‌లో 6 గంటలకు పలువురు కార్మికులు విధులకు హాజరయ్యారు. జనరల్ షిఫ్ట్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి పలువురు కార్మికులు, సూపర్‌వైజర్లు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, అధికారులు లోనికి వచ్చారు. సరిగ్గా 9.10 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతతో 2 కిలోమీటర్ల వరకు భూమి కంపించింది. భారీ శబ్దం వినబడింది. పరిసర పరిశ్రమల్లోని కార్మికులు భూకంపం వచ్చిందంటూ బయటకు పరుగులు పెట్టారు. రోడ్డుపైన, పరిశ్రమల్లో పార్క్ చేసిన పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నారని సమాచారం. ఈ ప్రమాదంలో హాజరు రికార్డు కూడా బుగ్గిపాలైందని తెలిసింది. పేలుడు సంభవించగానే.. అగ్నికీలలు వేగంగా వ్యాప్తిచెందాయి. పరిశ్రమలోని పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు సైతం నిప్పంటుకోవడాన్ని బట్టి, తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆ వెంటనే పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. దీంతో అక్కడున్నవారికి ఏం జరిగింది? ఏం జరుగుతోంది? అనేది అర్థం కాలేదు. లోపల బాధితుల హాహాకారాలతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లుతున్నా.. లోనికి వెళ్లలేనంతగా పొగ వ్యాప్తి చెందింది. దీంతో స్థానికులు డయల్-100కు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులతోపాటు.. రిజర్వ్ బలగాలు, 11 ఫైరింజన్లు, అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా లోపల ఏంజరిగింది? కార్మికుల పరిస్థితి ఏమిటి? అనే వివరాలు బయటకు రాలేదు. నాలుగు మృతదేహాలను గుర్తించామని పోలీసులు పేర్కొన్నా.. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఈ ప్రమాదంలో 8 మంది చనిపోయినట్లు ధ్రువీకరించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో మృతుల సంఖ్య 12.. రాత్రి 9 గంటలకు.. 15కు చేరినట్లు ప్రకటించారు. అర్ధరాత్రికి మృతుల సంఖ్యను 19గా నిర్ధారించారు. పేలుడు ధాటికి మూడంతస్తుల గెస్ట్‌హౌస్ భవనం కూలిపోవడంతో.. అందులో ఉన్న జనరల్ మేనేజర్ ఎలాన్‌గోవన్ దుర్మరణంపాలయ్యారు. రాత్రి కడపటి వార్తలందే సరికి.. శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. వర్షం అడ్డంకిగా మారినట్లు అధికారులు చెబుతున్నారు.

తమిళనాడు నుంచి వచ్చిన రోజే మృతి

ఈ ప్రమాదంలో మృతిచెందిన సిగాచి పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎలాన్‌గోవన్ అనారోగ్యంతో బాధపడుతూ.. తన స్వరాష్ట్రమైన తమిళనాడులో నెలరోజులపాటు చికిత్స పొందారు. సోమవారమే ఆయన తిరిగి విధుల్లో చేరారు. ప్రమాదంలో పేలుడు ధాటికి మూడంతస్తుల భవనం కుప్పకూలగా.. ఆ భవనం మొదటి అంతస్తులో ఉన్న ఎలాన్‌గోవన్ దుర్మరణం పాలయ్యారు. కారిడార్‌లో పార్క్ చేసిన ఆయన కారు కూడా శిథిలాల కింద పడి నుజ్జునుజ్జయింది.


గాయాలపాలైన కార్మికుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

భారీ శబ్దంతో ఉలిక్కిపడ్డాం

నేను జనరల్ షిఫ్ట్‌లో పరిశ్రమకు వచ్చాను. ఈ-మెయిల్స్‌ను పరిశీలిస్తతండగా.. పెద్దగా పేలుడు శబ్దం వినిపించింది. అంతా ఉలిక్కిపడ్డాం. అంతలోనే మంటలు ఎగిసిపడ్డాయి. నేనున్న భవనానికి బీటలు రావడంతో.. పక్కనే విరిగిపోయిన ఉన్న పిల్లర్‌ను ఆసరాగా చేసుకుని, బయటకు దూకాను. అంతలోనే పక్కనే ఉన్న భవనం కుప్పకూలిపోయింది. అంతే.. ఏం జరిగిందో గుర్తులేదు. కళ్లు తెరిచేసరికి అంబులెన్స్‌లో ఉన్నా.

- రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఆర్, అసిస్టెంట్ మేనేజర్

ఏ జరిగిందో అర్థం కాలేదు

నేను ఉదయం షిఫ్ట్‌లో వచ్చాను. స్టోర్‌లో సామగ్రిని సర్దుతుండగా పెద్ద శబ్దం వినిపించింది. అంతలోనే కళ్ల ముందు దట్టమైన మంటలు.. పొగ కనిపించాయి. ఏం జరిగిందో అర్థం కాలేదు. నాతో ఉన్న నలుగురు కార్మికులను అప్రమత్తం చేసి, బయటకు పరుగులు తీశాను. నా కళ్ల ముందే.. తోటి కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. వారిని కాపాడలేక.. కుప్పకూలిపోయాను.

- యశ్వంత్, కార్మికుడు

ఆస్పత్రుల్లో హాహాకారాలు

క్షతగాత్రుల్లో 40-80 శాతం కాలిన గాయాలైన వారిని ఇస్నాపూర్ ఆస్పత్రి, 80శాతానికి పైగా కాలిన గాయాలైన వారిని తొలుత పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రి.. ఆ తర్వాత చందానగర్, మియాపూర్‌లలోని ప్రైవేటు ఆస్పత్రులకు, అపోలోకు తరలించారు. ఇప్పటి వరకు గుర్తించిన క్షతగాత్రుల్లో ఒడిసాకు చెందిన నాక్నాజిత్ బారి(20), రామ్‌సింగ్(50), సంజయ్‌కుమార్ యాదవ్(28), బిహార్‌కు చెందిన రాంరాజ్(25), సంజయ్‌ముఖయా(25), ధన్‌బీర్ కుమార్‌దాస్(28), నీలాంబర్(19), గణేశ్‌కుమార్(26), దేవ్‌చంద్(30), యశ్వంత్(30), అభిషేక్‌కుమార్, నాగజిత్ తివారీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి(40)గా గుర్తించారు. నాక్నాజిత్, అభిషేక్‌లు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రుల ప్రాంగణాలు క్షతగాత్రుల హాహాకారాలతో మార్మోగిపోయాయి. కాలిన గాయాలతో మంటలకు తాళలేక వారు బోరున విలపించారు. పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి వద్ద తగినన్ని ఫ్రీజర్లు లేకపోవడంతో.. మృతదేహాలను నేలపైనే పెట్టడం గమనార్హం..!

డ్రయ్యర్ పేలుడే కారణమా?

ప్రమాదానికి ఎయిర్‌వాక్స్ పేలుడే కారణమని చెబుతున్న అధికారులు.. డ్రయ్యర్ పేలి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర దర్యాప్తు తర్వాతే.. పేలుడుకు కారణాలు తెలుస్తాయని చెబుతున్నారు. సెల్యులోజ్ పౌడర్ తయారీకి ఇటీవలే ఈ పరిశ్రమలో డయ్యర్లను తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. వీటిలో టన్నుకు పైగా సెల్యులోజ్ పౌడర్ ఉత్పత్తి అవుతుందని సమాచారం. ఇందులో వేడి తీవ్రతను స్థిరంగా ఉంచేందుకు ఫర్నేస్ ఆయిల్‌ను వాడుతారు. సెల్యులోజ్ పౌడర్ డ్రైయింగ్ సమయంలో 'డస్ట్ కాంపాక్ట్' కారణంగా వేడి తీవ్రమై.. వెంటిలేషన్ లోపంతో పేలుడు జరిగి ఉంటుందని పారిశ్రామిక నిపుణులు అనుమానిస్తున్నారు.

బూడిద దొరకడం కూడా కష్టమే..

చనిపోయిన వారి సంఖ్యపై అస్పష్టత నెలకొంది. ఇటు నిర్వాహకులు, అటు అధికారుల నుంచి సరైన ప్రకటన రావడం లేదు. ఫ్యాక్టరీలో ఇప్పటి వరకు మంటల్లో చిక్కుకొని చనిపోయినవారు కొందరైతే.. పేలుడు ధాటికి గోడలు కూలి మృతిచెందినవారు ఇంకొందరు. అయితే పేలిన ఎయిర్‌వాక్స్/డయ్యర్ సమీపంలో విధులు నిర్వహించేవారు చనిపోతే.. వారి బూడిద కూడా దొరకదని అధికారులు అంచనా వేస్తున్నారు. పేలుడు ధాటికి ఎముకలతో సహా సజీవ దహనం అవుతారని చెప్పుకొస్తున్నారు.

మంత్రుల పరామర్శ

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఘటనాస్థలికి చేరుకుని, సహాయక చర్యలను పర్యవేక్షించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్ సైతం అక్కడే ఉన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐజీ సత్యనారాయణ కూడా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీహెచ్ ప్రభాకర్, మాణిక్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మంత్రులు వివేక్, దామోదర.. ఆయా ఆస్పత్రుల్లో క్షతగాత్రులను పరామర్శించారు.

మృతులంతా ఇతర రాష్ట్రాల వారే..

ఇప్పటి వరకు 20 మంది మృతిచెందినట్లు పేర్కొన్న అధికారులు.. వీరిలో ఎక్కువగా బిహార్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నట్లు చెబుతున్నారు. మృతులు, క్షతగాత్రులంతా ఉదయం షిఫ్టులో పనికి వచ్చిన వారేనని వెల్లడించారు. ఇప్పటి వరకు ముగ్గురు మృతులను గుర్తించినట్లు వెల్లడించారు.


గాయపడిన వారిని తరలిస్తూ...

డీఎన్ఏ పరీక్షలతోనే గుర్తించాలి..

ప్రమాద తీవ్రతకు కార్మికుల మృతదేహాలు కాలిన ముద్దలుగా మారాయి. పలు మృతదేహాల విషయంలో కనీస ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఒంటిపైన దుస్తులు పూర్తిగా కాలిపోయి.. చేతులు, కాళ్లు, తల, పొట్టభాగం ఉడికించినట్లుగా మారిపోయాయి. డీఎన్ఏ పరీక్షతోనే మృతులను గుర్తించాల్సి ఉంటుందని పోలీసులు వివరించారు. పరిశ్రమలోని హాజరు రిజిస్టర్ కూడా అగ్నికి ఆహుతైంది. దీంతో.. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరెవరున్నారు? అనేది తెలుసుకోవడం కష్టంగా ఉందని చెబుతున్నారు. అయితే.. పరిశ్రమకు చెందిన ఓ వ్యక్తి ఎక్సల్ షీట్‌ను విడుదల చేశారు. దాన్ని బట్టి.. ప్రమాదం జరిగినప్పుడు 163 మంది ఆ పరిశ్రమలో ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ లెక్కన.. 20 మంది మృతిచెందగా.. 30 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా 114 మంది జాడ తెలియరావడం లేదు. పలువురు కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. వారిని మినహాయిస్తే.. శిథిలాల కింద మరో 14 మంది వరకు ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహాయక చర్యలకు వర్షం ఆటంకం కలిగిస్తోందని రెస్క్యూ బృందాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి.

3 నెలలు యూనిట్ మూసివేత

పాశమైలారంలోని తమ యూనిట్‌లో 90 రోజుల పాటు ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు, ప్లాంట్‌ను మూసివేస్తున్నట్లు సిగాచి కెమికల్స్ యాజమాన్యం ప్రకటించింది. 90 రోజుల తర్వాత ఉత్పత్తిని పునఃప్రారంభించనున్నట్లు తెలిపింది. తమ పరిశ్రమకు పూర్తిస్థాయిలో బీమా ఉందని, మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందుతుందని పేర్కొంది. క్లెయిమ్‌ల ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపింది. తమ పరిశ్రమలో మైక్రోక్రిస్టలీన్ సెల్యులోజ్(ఎంసీసీ) ఉత్పత్తి అవుతుందని వివరించింది. దేశవ్యాప్తంగా ఉన్న మూడు యూనిట్లలో తాము ఏడాదికి 21,700 మెట్రిక్ టన్నుల(ఎంటీపీఏ) ఎంసీసీని ఉత్పత్తి చేస్తుండగా.. పాశమైలారంలోని పరిశ్రమలో 6 వేల ఎంటీపీఏల సెల్యులోజ్ తయారవుతుందని వెల్లడించింది.

బస్సు ఆలస్యం.. బతికించింది!

సిగాచి పరిశ్రమ కార్మికులను తీసుకువచ్చే బస్సు సోమవారం 10 నిమిషాలు ఆలస్యంగా నడిచింది. 20 మంది కార్మికులతో వచ్చిన ఆ బస్సు పరిశ్రమలోకి ప్రవేశిస్తుండగా.. పేలుడు సంభవించింది. ఆ ధాటికి బస్సు అద్దాలు ధ్వంసమై.. 8 మంది కార్మికులకు గాయాలయ్యాయి. దాంతో డ్రైవర్ బస్సును వెనక్కి రివర్స్‌లో తీసుకెళ్లి, సురక్షిత ప్రాంతంలో పార్క్ చేశారు. గాయపడ్డ ఎనిమిది మందికి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు.



పరిశ్రమ వద్ద సహాయక చర్యలు


రోదిస్తున్న కార్మికుల బంధువులు

మా వాళ్లు ఎలా ఉన్నారు?

ప్రమాదం వార్తను తెలుసుకున్న కార్మికుల బంధుమిత్రులు సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. చనిపోయిన వారు.. క్షతగాత్రుల్లో తమ వారు కనిపించడం లేదంటూ.. వారు కన్నీరుమున్నీరుగా విలపించడం కనిపించింది. పరిశ్రమ నిర్వాహకులు, పోలీసులు ఎలాంటి వివరాలను అందజేయకపోవడంతో.. తమ వారి జాడ కోసం కనిపించిన వారందరినీ అడుగుతుండడం చూసేవారిని కలిచివేసింది. శిథిలాల కింద మృతదేహం దొరికిందని తెలియగానే.. తమ వారేనా? అని గుర్తించేందుకు పరుగెత్తే ప్రయత్నం చేశారు. మృతులు, క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో తరలిస్తుండగా.. కిటికీల్లోంచి చూసేందుకు ఆ వాహనాల వెంట పరుగులు తీశారు. కార్మికుల బంధుమిత్రులకు పరిశ్రమ యాజమాన్య ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో.. వారు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘటనాస్థలికి నేడు సీఎం..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలపై మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహలతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఆరా తీస్తున్నట్లు వివరించారు. ప్రమాదం జరిగిన తీరు, తగిన కారణాలపై సీఎస్ రామకృష్ణరావు అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. ఈ కమిటీలో విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, అగ్నిమాపక శాఖ డీజీ సభ్యులుగా ఉంటారు. మంగళవారం సీఎం రేవంత్ ఘటనాస్థలిని పరిశీలించనున్నారు.

మేం అధికారంలోకి వస్తే బీసీనే సీఎం

- బీజేపీలో బీసీలకు సముచిత స్థానం దక్కింది
- దమ్ముంటే బీసీని బీఆర్ఎస్ అధ్యక్షుడిని చేయాలి
- కేసీఆర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "బీజేపీ బాజాప్త ఒక్కటే మాట చెప్పింది.. తెలంగాణలో పార్టీ అధికారంలోకి వస్తే బీసీ నాయకుడే సీఎం అవుతారు" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. "పార్టీ వేరు, ప్రభుత్వం వేరు. పార్టీ బలోపేతం కోసం అనేక రకాలుగా ఆలోచించి నాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది. బీసీ అయిన నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వలేదా..? లక్ష్మణ్‌కు ఇవ్వలేదా..? దత్తాత్రేయకు ఇవ్వలేదా..? దళితుడైన బంగారు లక్ష్మణ్‌కు పదవి ఇవ్వలేదా..? కేంద్ర పదవుల్లో బీసీ నేతలకు సముచిత స్థానం కల్పించలేదా..?" అని ప్రశ్నించారు. దమ్ముంటే బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని బీసీ నేతకు ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ చేశారు. దళితుడిని సీఎం చేస్తానని.. లేకుంటే తల నరక్కుంటానని హామీ ఇచ్చి.. మాట తప్పిన నాయకుడు కేసీఆర్ అని మండిపడ్డారు. దళితుడిని సీఎం చేస్తానని మాట తప్పి, రూ.వేల కోట్లు దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని మండిపడ్డారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాంచందర్‌రావు పేరును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖరారు చేయడం వెనుక టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సంజయ్ స్పందించారు. "ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వమున్న పార్టీ బీజేపీ. దేశంలోని అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీ. సిద్ధాంతం కోసం నిబద్ధతతో పని చేసే లక్షలాది మంది కట్టర్ కార్యకర్తలున్న పార్టీ. అంత గొప్ప చరిత్ర కలిగిన బీజేపీ.. ఒకరు చెబితేనో.. ఇంకొకరు ఒత్తిడి తెస్తేనో తలొగ్గి నిర్ణయం తీసుకునే పార్టీ కాదు. ఇది కావాలని కొంత మంది చేస్తున్న దుష్ప్రచారం. అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయి" అని అన్నారు. బీజేపీలోనూ కొందరు ఇలాంటి ప్రచారమే చేస్తున్నారంటూ మీడియా ప్రస్తావించగా.. "బీజేపీలో అలాంటివి జరగవు. ఇలాంటి పోకడలను ఇప్పుడే చూస్తున్నా. ఇది సరి కాదు. బండి సంజయ్ ఉంటేనే పార్టీ ఉన్నట్లు, లేకపోతే పార్టీయే లేనట్లు అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం ఇంకొకటి లేదు. ఎవరు లేకపోయినా పార్టీ నడుస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని సంజయ్ స్పష్టం చేశారు.

బీజేపీ.. బీసీ వ్యతిరేకి: మంత్రి పొన్నం

- కేసీఆర్ సూచనతోనే ఆ నిర్ణయం: బీర్ల అయిలయ్య
- బీసీలను మోసగించిన మోదీ సర్కారు: జాజుల

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీసీ వ్యతిరేక పార్టీ అని బీజేపీ మరోమారు నిరూపించుకుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలతోపాటు అర్హతలున్న సీనియర్ బీసీ నేతలు అనేక మంది ఉన్నా, వారి నుంచి ఎందుకు రాష్ట్ర అధ్యక్షుడ్ని ఎంపిక చేయలేదని సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. పైగా నామినేషన్ వేయబోయిన ఒక బీసీ నేతను అడ్డుకున్నారన్నారు. ఫ్యూడల్ పార్టీ బీజేపీలో బీసీలకు న్యాయం జరగట్లేదని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అసెంబ్లీ మీడియా హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ.. బలహీనమైన నేత ఎన్.రామచంద్రరావును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిందని ఆరోపించారు. ఆయన ఎంపికతో బీజేపీ-బీఆర్ఎస్ కలయిక మరోమారు తేటతెల్లమైందన్నారు. భవిష్యత్తులో బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ సజావుగా సాగేందుకే రామచంద్రరావును ఎంపిక చేశారని అయిలయ్య ఆరోపించారు. బీసీలకు అన్యాయం జరుగుతున్నందునే బీజేపీకి ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా చేశారని అయిలయ్య చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.. సచివాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బీసీలకు రాష్ట్ర అధ్యక్ష పదవినిస్తామన్న బీజేపీ.. వారిని మోసగించిందని ఆరోపించారు. రాజకీయ పార్టీలన్నీ బీసీ జపం చేస్తుంటే, బీజేపీ భిన్నంగా వ్యవహరించిందన్నారు. పార్టీ అధ్యక్షుడిగా బీసీని నియమించని పార్టీ.. సీఎంను చేస్తామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు.

అది బీజేపీ-బీఆర్ఎస్ ఉమ్మడి నిర్ణయం: చామల

న్యూఢిల్లీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయమే బీజేపీ తెలంగాణ కొత్త అధ్యక్షుడి నియామకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీల భవిష్యత్తు ప్రణాళికలో భాగంగానే కొత్త పార్టీ అధ్యక్షుడి ఎంపిక జరిగిందని సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. పసుపు బోర్డుకు రూపాయి కూడా కేటాయించకుండా ఎన్నిసార్లు ప్రారంభోత్సవాలు చేస్తారని ప్రశ్నించారు. పదేళ్ల రాష్ట్రాన్ని బీఆర్ఎస్ దోచుకుంటుంటే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమిటని నిలదీశారు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అవగాహన తెలంగాణ ప్రజలకు తెలుసునని, కొత్త డ్రామాలు అక్కర్లేదని చామల స్పష్టం చేశారు.

ట్యాపింగ్ కేసులో ఆరా మస్తాన్‌కు నోటీసులు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాల్సిందిగా సెఫాలజిస్ట్ ఆరా మస్తాన్‌ను సిట్ నోటీసులు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరా మస్తాన్ ఉపయోగిస్తున్న రెండు సెల్ ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. ఈ విషయంలో ఆయనను విచారించేందుకు ఇది వరకు నోటీసులు జారీ చేసినా, బిజీ షెడ్యూల్ కారణంగా హాజరు కాలేదు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొలిక్కి వచ్చినందుకు తప్పనిసరిగా విచారణకు రావాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో దర్యాప్తు అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాలని సూచించింది.



ఎంపీ రఘునందన్‌కు కిషన్ రెడ్డి పరామర్శ

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావును సోమవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా శుక్రవారం నుంచి రఘనందన్‌రావు ఆర్థోపెడిక్ సమస్యతో బాధ పడుతూ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రైతును బెదిరించి రూ.30 వేలు వసూలు

- నేరడిగొండలో ముగ్గురు విలేకరుల అరెస్టు

నేరడిగొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతును బెదిరించి రూ.30 వేలు వసూలు చేసిన ముగ్గురు విలేకరులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన టగరే కాసాన్ దాస్ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. మే నెలలో అతడి చేనులో పండిన జొన్న పంటను సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆరబెట్టాడు. దీన్ని గమనించిన నేరడిగొండకు చెందిన విలేకరులు గాజుల దేవేందర్, షేక్ ఫసీయుద్దీన్, గాజుల శ్రీకాంత్ మే 18న రైతును బెదిరించారు. పాఠశాల ఆవరణలో పంటను ఆరబెట్టినందుకు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తామని భయపెట్టారు. విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఉండాలంటే రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన రైతు రూ.30వేలు ఇచ్చాడు. ఆ తర్వాత జరిగిన ఘటనపై పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రంలో అధికారమే లక్ష్యం!

స్థానిక సంస్థల ఎన్నికలే తొలి టార్గెట్.. మా ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సే

- బీఆర్ఎస్‌ను జనం మరిచిపోయారు
- బీజేపీనే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు
- మా పార్టీలో ఎలాంటి విభేదాలూ లేవు
- అందరం కలిసికట్టుగా ముందుకెళ్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలే తమ తొలి లక్ష్యమని బీజేపీ తెలంగాణ శాఖ నూతన అధ్యక్షుడు నారపరాజు రాంచందర్‌రావు చెప్పారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో అధికార పీఠాన్ని కైవసం చేసుకోవడమే అంతిమ లక్ష్యమని తెలిపారు. తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెసేనని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ తమకు ఏ దశలోనూ పోటీ కాదన్నారు. పార్టీలో సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో కలిసికట్టుగా ముందుకు వెళతామని తెలిపారు. పార్టీ కేంద్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక దుస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కారణమేనని చెప్పారు. అవినీతిలో బీఆర్ఎస్‌కు పోటీగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం రాంచందర్‌రావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు?

మా తొలి ప్రాధాన్యం స్థానిక సంస్థల ఎన్నికలే. ఎప్పుడు ఎన్నికలు ప్రకటించినా మెజారిటీ స్థానాలు గెలిచి, సత్తా చాటుతాం. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. అందుకే ఎన్నికలకు ఆ పార్టీ భయపడుతోంది. ఏదో ఒక సాకుతో వాయిదా వేసే ప్రయత్నం చేస్తోంది. గతంలో పోలిస్తే మేం చాలా బలపడ్డాం. ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలతో పాటు ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఇక తదుపరి లక్ష్యం వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే.

మీ పార్టీకి ప్రధాన ప్రత్యర్థి ఎవరు?

మా ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సే. బీఆర్ఎస్ పార్టీ క్రమంగా కనుమరుగవుతోంది. ఆ పార్టీని జనం కూడా మరిచిపోయారు. బీఆర్ఎస్ ఏ దశలోనూ మాకు పోటీ కాదు. ఇక గ్రూపులతో కాంగ్రెస్ పార్టీ సతమతమవుతుంటే ఎందుకు ఎన్నుకున్నామా? అని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్.. రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. ఏడాదిన్నర గడిచినా అతీగతీ లేదు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి తెలంగాణ ఏటీఎంలా మారింది. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయగా.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఎడాపెడా అప్పులు చేస్తూ రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపుతోంది. అందుకే ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. ఇంతకుముందు రాష్ట్రంలో బీజేపీకి 11లక్షల మంది సభ్యులు ఉండగా.. ఇప్పుడా సంఖ్య 36 లక్షలు దాటింది. అన్ని వర్గాల ప్రజలూ బీజేపీ పట్ల ఆకర్షితులవుతున్నారు.

క్యాడర్‌లో నిరాశ, నిస్పృహలను ఎలా అధిగమిస్తారు?

కార్యకర్తలను మరింత క్రియాశీలం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడతాం. ఇందుకు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ సీనియర్ నాయకులతో కలిసి చర్చిస్తా. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తాం.

పార్టీలో ముఖ్యులు, సీనియర్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది?

అదంతా తప్పుడు ప్రచారం. పార్టీలో ఆధిపత్య పోరు లేదు. గ్రూపులూ లేవు. అంతా కలిసికట్టుగా ఉన్నాం. మాకు సమర్థ నాయకులు ఉన్నారు. వారి సేవలను వినియోగించుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తాం. ఇక పాత, కొత్త అన్న వివక్ష మా పార్టీలో లేనేలేదు.

ఏపీ బీజేపీ కొత్త అధ్యక్షుడు మాధవ్



అమరావతి, విశాఖపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్‌ను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. అనేక మంది పెద్దలు పోటీ పడినా మాధవ్‌నే అదృష్టం వరించింది. సుదీర్ఘకాలంగా ఆయన చేసిన సేవలను గుర్తించిన బీజేపీ అధిష్ఠానం.. కీలక బాధ్యతలు అప్పగించింది. దీంతో సోమవారం ఆయన విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి శివ ప్రకాశ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీ పెద్దల ఆదేశాలతో ఇతరులెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో మాధవ్ పేరు అధ్యక్షుడిగా ఖరారైంది. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం జరిగే రాష్ట్ర బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పేరును అధికారికంగా ప్రకటిస్తారు.

విశాఖపట్నానికి చెందిన పాతతరం బీజేపీ నాయకుడు పీవీ చలపతి రావు కుమారుడు మాధవ్. చలపతిరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. అదే వారసత్వాన్ని తన పని తీరు ద్వారా మాధవ్ అందిపుచ్చుకున్నారు. చలపతిరావు దంపతులకు అనకాపల్లిలో 1973 ఆగస్టు 10న మాధవ్ జన్మించారు. మాధవ్ విద్యార్థి దశలో ఏబీవీపీలో చేరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం)లో 2003లో చేరి క్రియాశీల రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టారు. 2003 నుంచి 2007 వరకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు. 2007 నుంచి 2010 వరకు మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేశారు. 2010-2013 వరకూ బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.2009లో విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా 2017లో పోటీ చేసి విజయం సాధించారు. శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా సేవలు అందించారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న రాంచందర్‌రావు

కమల దళపతి రాంచందర్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పార్టీ నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావు పేరును సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శోభా కరంద్లాజే మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఉదయం 10 గంటలకు మన్నెగూడలోని వేద కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ అధ్యక్ష, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి అధికారిక ప్రకటన ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, అధ్యక్ష పదవి కోసం రాంచందర్‌రావు నామినేషన్ దాఖలు చేసిన సమయంలో ఆయన వెంట పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మరో కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్, సీనియర్ నాయకులు గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల ఎన్నిక పూర్తవుతున్న నేపథ్యంలో బీజేపీ ఇక జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ చేపట్టనుంది. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనుంది. ఇందుకు సంబంధించి మంగళవారం పార్టీ ప్రకటన చేసే అవకాశం ఉంది. ఎన్.రాంచందర్‌రావు అంటే న్యాయవాదిగా, మాజీ ఎమ్మెల్సీగా మాత్రమే చాలామందికి తెలుసు. కానీ, విద్యార్థి రాజకీయాల్లో ఆయన రాడికల్స్‌కు ఎదురొడ్డి పోరాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ మనుగడలో లేని సమయంలో రాంచందర్‌రావు అందులో చేరి ఆ సంఘాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 1977 నుంచి 1980 వరకు రైల్వే డిగ్రీ కాలేజీలో బీఏ చదువుతూ మూడేళ్లపాటు ఏబీవీపీ అధ్యక్షుడిగా కొనసాగారు. రాంచందర్‌రావు ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో ఉన్న సమయంలో నక్సలైట్లు ఏకంగా అక్కడికి వచ్చి ఆయనపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో దాదాపు రెండు నెలలపాటు ఆస్పత్రిలో మంచానికే పరిమితమైన రాంచందర్‌రావు ఆ తరువాత రాడికల్స్‌కు వ్యతిరేకంగా మరింత ఉధృతంగా పోరాటాలు చేశారు. విద్యార్థుల పక్షాన ఉద్యమాలు చేసి పోలీసుల చేతిలోనూ పలుమార్లు లాఠీ దెబ్బలు తిన్నారు. ఓవైపు ఉద్యమాలు చేస్తూనే ఎంఏ ఎల్ఎల్‌బీ (1982--85) పూర్తి చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా (1977--85), నగర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 1986లో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించిన రాంచందర్‌రావు.. ప్రస్తుతం సుప్రీంకోర్టులో, హైకోర్టులో, ట్రైబ్యునళ్లలో క్రిమినల్, సివిల్, రాజ్యాంగ సంబంధిత కేసులను వాదిస్తుంటారు. బీజేపీ నేతలకు న్యాయ సహాయం విషయంలో రాంచందర్‌రావు ఎప్పుడూ ముందుంటారు.

కార్పొరేటర్‌గా తొలి పోటీ..

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో రాంచందర్‌రావు అంచెలంచెలుగా ఎదిగారు. 1986లో బీజేపీలో చేరి హైదరాబాద్‌లోని రవీంద్రనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా తొలిసారిపోటీ చేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, నగర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ లీగల్ సెల్‌లో క్రియాశీల పాత్ర పోషించారు. లీగల్ సంయుక్త కన్వీనర్‌గా, కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా (2007-09), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా (2009-12), ముఖ్య అధికార ప్రతినిధిగా(2012-15) పనిచేశారు. 2015లో హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై 2021 వరకు బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. బీజేపీ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. మల్కాజిగిరి నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

రేవంత్ రెడ్డిని బీజేపీ కాపాడుతోంది

- బీజేపీ, కాంగ్రెస్‌ది కుమ్మక్కు రాజకీయం
- అమిత్ షా... ఓ నయా గజిని: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డిని బీజేపీ కాపాడుతోందని, ఇది కుమ్మక్కు రాజకీయమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందని అమిత్ షా గొంతుచించుకుంటున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీయేనని ఆయన మరిచినట్లున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఓ నయా గజిని అని ఎద్దేవా చేశారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని స్వయంగా దేశ ప్రధాని మోదీనే విమర్శిస్తే, ఏ ఒక్క కేంద్ర సంస్థ అయినా విచారణ చేపట్టిందా? అని నిలదీశారు. బావమరిది సృజన్‌రెడ్డికి 1,137 కోట్ల విలువైన అమృత్ పనుల కాంట్రాక్టును ఎలాంటి నిబంధనలు పాటించకుండా రేవంత్ రెడ్డి కట్టబెడితే కేంద్ర ప్రభుత్వం కనీస విచారణ జరపలేదని గుర్తుచేశారు. అన్ని సాక్ష్యాలతో తాము ఫిర్యాదుచేసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు అయ్యాయనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు పెట్టిన రేవంత్ ప్రభుత్వం.. గురుకులాల్లో చదివే పిల్లలకు యూనిఫాంలు, భోజనం అందించడానికి డబ్బుల్లేవని చెప్పడం సిగ్గుచేటు అంటూ రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. తెలంగాణ ప్రజలు సరైన సమయంలో ఈ రెండు పార్టీలకు కర్రు కల్చి వాత పెడతారని హెచ్చరించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన కర్మ తమకు పట్టలేదని, అది ఓ పనికి మాలిన కేసు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌ను బద్నామ్ చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మోదీ, చంద్రబాబు చేతిలో రేవంత్ కీలు బొమ్మ అని విమర్శించారు.

బీజేపీకి రాజాసింగ్ గుడ్‌బై

పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖ అందజేత

- నన్ను నామినేషన్ వేయనివ్వలేదు
- అధ్యక్షుడి ఎన్నికపై క్యాడర్‌లో నిరాశ
- హిందుత్వకు కట్టుబడి ఉంటా: రాజాసింగ్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సోమవారం పార్టీ కార్యాలయంలో స్వయంగా అందజేశారు. పార్టీకి రాజీనామా చేసినందున ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా ప్రకటించాలంటూ స్పీకర్‌కు లేఖ రాయాలని కిషన్‌రెడ్డిని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష పదవికి తాను కూడా నామినేషన్ వేస్తానని రెండు రోజుల క్రితమే ప్రకటించిన రాజాసింగ్.. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. అయితే తనకు మద్దతిచ్చే వారిని 'పదవిలో ఉంటారా? సస్పెండ్ చేయాలా?' అంటూ కొందరు బెదిరించారని, తద్వారా నామినేషన్ వేయకుండా తనను అడ్డుకున్నారని ఆరోపించారు. రాజీనామా అనంతరం రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత నియమావళి ప్రకారం తన అభ్యర్థిత్వానికి మద్దతిచ్చేందుకు 10 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిద్ధమయ్యారని, ముగ్గురు సంతకాలు చేశారని తెలిపారు. బెదిరింపుల కారణంగా మిగిలిన వారు సంతకాలు చేయలేదని చెప్పారు. ఎంతో మంది అర్హులైన నాయకులు ఉన్నా రాంచందర్‌రావును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలనుకోవడం క్యాడర్‌ను నిరాశకు గురి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న సందర్భంలో ఈ నిర్ణయం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. కొంతమంది ముఖ్యనేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం జాతీయ నాయకత్వాన్ని తప్పుదోవ పట్టించారన్నారు.



మీకో దండం.. మీ పార్టీకో దండం..

"రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నా.. రావొద్దని కోరుకునే కొంత మంది పెద్దలు పార్టీలో జమ అయ్యారు. ఆ ఆకాంక్ష వారికే లేనప్పుడు మేమెంత కష్టపడ్డా లాభం లేదు. అందుకే అయ్యా మీకో దండం.. మీ పార్టీకో దండమని చెప్పాను" అని రాజాసింగ్ వివరించారు.

పార్టీలో తాను 2014 నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. తనతో పాటు తన కుటుంబం మొత్తం ఉగ్రవాదులకు టార్గెట్‌గా ఉందన్నారు. తాను బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వ సిద్ధాంతానికి మాత్రం కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కాగా, రాజాసింగ్‌ను బుజ్జగించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రయత్నించినా.. తన నిర్ణయంలో మార్పులేదని చెప్పి వెళ్లిపోయారు. రాజాసింగ్ రాజీనామాపై స్పందించేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిరాకరించారు. అయితే ఆయన రాజీనామా లేఖను కిషన్‌రెడ్డి జాతీయ నాయకత్వానికి నివేదించనున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ తెలిపారు. రాజాసింగ్ అభ్యర్థిత్వానికి పది మంది కూడా రాలేదని, అందుకే పార్టీని బద్‌నాం చేసి వెళ్లిపోయారని ఆరోపించారు. కాగా, పార్టీ నియమావళికి అనుగుణంగా అధ్యక్ష ఎన్నిక జరుగుతోందని బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు.

అప్పుడు సస్పెన్షన్.. ఇప్పుడు రాజీనామా

బీజేపీలో రాజాసింగ్ రూటే సెపరేటు అన్నట్లుగా ఉంటుంది. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా సొంత అభిప్రాయాలు వ్యక్తపరుస్తుంటారు. పరోక్షంగా సీనియర్ నాయకులపైనే విమర్శలు చేస్తుంటారు. గతంలో కిషన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇద్దరి మధ్య పొసగలేదు. దీంతో ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానని భీష్మించుకున్నారు. బండి సంజయ్‌ను అధ్యక్షుడిగా నియమించేంత వరకు పార్టీ ఆఫీసులోకి రాలేదు. పలుమార్లు రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ తీసుకున్న నిర్ణయాలను రాజాసింగ్ తప్పుబట్టారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సూచించిన వారికి టికెట్ ఇవ్వలేదని ఆగ్రహించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఓ వర్గం వారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పార్టీ ఆయనను సస్పెండ్ చేసింది. 14 నెలలపాటు పార్టీకి దూరంగా ఉంచింది. చివరికి ఎన్నికల టికెట్ కేటాయింపు సమయంలో సస్పెన్షన్‌ను ఎత్తివేసి టికెట్ కేటాయించింది. తిరిగి ఎమ్మెల్యేగా గెలిచాక కూడా రాజాసింగ్ తీరు మారలేదు. సీనియర్లపై విమర్శలు ఆపలేదు. ఈ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్ష పదవిపైనా కన్నేశారు. అది నెరవేరే అవకాశం కనిపించకపోవడం, రాష్ట్ర నాయకత్వం నిర్ణయం రుచించకపోవడంతో పార్టీకి రాజీనామా చేశారు.

హిందుస్థాన్ ధాన్యం టెండర్ లాట్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఎంటర్‌ప్రైజెస్ 80,873టన్నుల సామర్థ్యం కలిగిన 12వ లాటును దక్కించుకుంది. నిజామాబాద్, కామారెడ్డి, నారాయణపేట, మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలోని 106 రైస్‌మిల్లుల్లో నిల్వ చేసిన సన్న ధాన్యానికి టన్నుకు రూ.22,599 చొప్పున కోట్ చేసింది. మార్కెట్ ఫీజు, గన్నీ బ్యాగుల ఖర్చు కలిపి రూ.24,072చొప్పున హెచ్-1 బిడ్డింగ్ ఖరారైంది. నిబంధనల మేరకు రూ.28.55కోట్ల ఈఎండీ చెల్లించటంతోపాటు రూ.18కోట్లకు సెక్యూరిటీ డిపాజిట్ ఇచ్చింది. ఏడాదిన్నరలో కేంద్రీయ భండార్ 55 శాతం, మంచుకొండ ఆగ్రోటెక్ 68శాతం, న్యాకాఫ్ 43 శాతం ధాన్యాన్ని లిఫ్టింగ్ చేశాయి. కానీ, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ ఒక్క శాతం కూడా ధాన్యం ఎత్తలేదు. తాజాగా, పౌర సరఫరాల శాఖ వీసీ, ఎండీ లేఖ రాయడంతో అదే శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఆ లాట్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సన్న బియ్యం సరఫరాకు అనుమతి ఇవ్వాలంటూ ఆ ఐదు జిల్లాల రైస్ మిల్లర్లు విజ్ఞప్తి చేశారని, వారి నుంచి సేకరిస్తే తనకూ అభ్యంతరం లేదని హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొందని, రాష్ట్ర ప్రభుత్వానికి సన్న బియ్యం అవసరం ఉన్న నేపథ్యంలో 2022-23రబీ సీజన్లో వేలం వేసిన 80,872టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఫోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని రాష్ట్ర కోటా కింద పౌర సరఫరాల శాఖకు అందించడానికి మిల్లర్లకు అనుమతి ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2 నెలల్లో సన్న బియ్యం సరఫరా చేయకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ అందజేసిన ఈఎండీని జప్తు చేస్తారా!? వెనక్కి ఇస్తారా!? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. మిల్లర్ల నుంచి బియ్యం సేకరించినా అభ్యంతరం లేదంటూ హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొనడం, టెండర్ బిడ్‌ను రద్దు చేయడం ద్వారా ఈఎండీ, సెక్యూరిటీ డిపాజిట్‌ను వెనక్కి ఇవ్వడానికి పౌర సరఫరాల శాఖ అధికారులే మార్గం సుగమం చేశారని చెబుతున్నారు.

4 రోజుల్లో శ్రీశైలం గేట్లు ఓపెన్!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. సోమవారం జలాశయానికి 1.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. 157.49 టీఎంసీల నిల్వ ఉంది. 885 అడుగులకు గాను 873.70 అడుగుల్లో నీటి మట్టం నమోదైంది. శ్రీశైలం పూర్తి స్థాయిలో నిండేందుకు మరో 58 టీఎంసీలు కావాల్సి ఉంది. రోజుకు సగటున సమారుగా 12 టీఎంసీల నీరు చేరుతుండటంతో మరో ఐదు రోజుల్లో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండనుంది. దీంతో నాలుగు రోజుల్లోనే గేట్లు ఎత్తే అవకాశముంది. శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో అధికారులు ఉత్పత్తి ప్రారంభించారు. ఇక జూరాల ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర జిల్లాల్లో వానలు కురిశాయి. సాయంత్రం తర్వాత హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో అత్యధికంగా 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రంలో మంగళ, బుధ వారాల్లో తేలికపాటి వర్షాలు కొన్ని జిల్లాల్లో కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.